PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ◆
ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 43 సంచిక : 65 | విజయవాడ, గురువారం 5 అక్టోబర్ 2023 | 6 + 8 పేజీలు వెల : 5.50
Vol No | Vijayawada, Thursday 5 October 2023 | Rs

జ్యోతి సురేఖకు స్వర్ణం
6

నేటి నుంచి వన్డే ప్రపంచకప్ సంగ్రామం

ఇంగ్లండ్ X న్యూజిలాండ్ మ్యాచ్‌తో ప్రారంభం

ఐసిసి వన్డే ప్రపంచకప్ సంగ్రామం నేటినుంచి ప్రారంభం కానుంది. గత వన్డే ప్రపంచకప్ ఫైనలిస్ట్ జట్లయిన ఇంగ్లండ్-న్యూజిలాండ్ జట్ల మధ్య అహ్మదాబాద్‌లో జరిగే తొలి మ్యాచ్‌తో మెగా టోర్నీ ఆరంభం కానుంది.
6

పత్రికా స్వేచ్ఛను కాపాడాలని కోరుతూ ఢిల్లీలో ఆందోళన చేస్తున్న పాత్రికేయ, విద్యార్థి, యువజన, ప్రజా సంఘాల కార్యకర్తలు (వార్త5లో)

దాడులపై జోక్యం చేసుకోండి

సిజెఐ చంద్రచూడ్‌కు 18 మీడియా సంస్థల లేఖ

న్యూఢిల్లీ : దేశంలో పత్రికా స్వేచ్ఛపై జరుగుతున్న దాడుల పట్ల మీడియా సంస్థలు ఆందోళన వ్యక్తం చేశాయి. ఈ విషయంలో జోక్యం చేసుకోవాలంటూ భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి వై చంద్రచూడ్‌కు బుధవారం లేఖ రాశాయి. పాత్రికేయుల ఫోన్లు, లాప్‌టాప్‌లను ఇష్టానుసారం స్వాధీనం చేసుకోకుండా నిలువరించేందుకు నిబంధనలను, జర్నలిస్టుల విచారణకు సంబంధించి మార్గదర్శకాలను రూపొందించడంలో సాయపడాలని విజ్ఞప్తి చేశాయి. చట్ట విరుద్ధంగా వ్యవహరించే ప్రభుత్వ సంస్థలు, అధికారుల్లో జవాబుదారీతనం ఉండేలా చూడాలని కోరాయి. పాత్రికేయులు చట్టానికి అతీతులని తాము భావించడం లేదని, చట్టానికి లోబడి తమను విచారించాలని మాత్రమే కోరుతున్నామని తెలిపాయి. ప్రధాన న్యాయమూర్తికి రాసిన లేఖపై 16 పాత్రికేయ సంఘాలు సంతకాలు చేశాయి.దేశంలోని పలువురు పాత్రికేయులు నేడు ప్రతీకార ప్రమాదాన్ని ఎదుర్కొంటూ విధులు నిర్వర్తిస్తున్నారని ఆ లేఖలో జర్నలిస్టు సంఘాలు తెలిపాయి. న్యూస్‌క్లిక్ పోర్టల్ పాత్రికేయులు, ఉద్యోగుల నివాసాలపై జరిగిన దాడులను, వారి నుండి ఎలక్ట్రానిక్ పరికరాలను స్వాధీనం చేసు కున్న వైనాన్ని వివరించాయి. 'పత్రికలకు వ్యతిరేకంగా ప్రభుత్వ సంస్థలు పలు సందర్భాలలో అధికార దుర్వినియోగానికి పాల్పడిన విషయం మీకు తెలిసిందే. న్యూస్‌క్లిక్ పాత్రికేయులపై నిర్దిష్టత లేని నేరారోపణలు చేశారు. వాటితో సంబంధం లేని ప్రశ్నలు అడిగారు. ఉపా కింద అరెస్టయిన జర్నలిస్టులు బెయిల్ పొందడానికి ముందు నెలల తరబడి జైళ్లలో మగ్గాల్సి వస్తోంది. సిద్ధిక్ కప్పన్ అనే పాత్రికేయుడు బెయిల్ పొందడానికి ముందు 28 నెలలు జైలులో గడిపారు. ప్రభుత్వ చర్యలు ఇలాగే కొనసాగితే వాటిని సరిదిద్దే పరిస్థితే ఉండదు' అని వివరించాయి. ఈ లేఖపై వివిధ నగరాలకు చెందిన ప్రెస్‌క్లబ్‌లు, మీడియా సంస్థలు సంతకాలు చేశాయి.

సాగు సంక్షోభ ఘంటిక

- అంతకంతకూ తగ్గుతున్న ఖరీఫ్ సాధారణ విస్తీర్ణం
- ప్రతి ఏటా లక్షల ఎకరాలు బీడు
- గిట్టుబాటు ధర లేకపోవడమే కారణం

పదేళ్ల ఖరీఫ్ సాగు వివరాలు (లక్షల ఎకరాలు)

సంవత్సరం	నార్మల్	సాగైంది	తగ్గుదల
2014	105.00	99.65	5.35
2015	106.04	90.85	15.19
2016	102.40	96.55	5.85
2017	101.17	84.87	16.30
2018	98.82	86.90	11.92
2019	95.75	84.47	11.28
2020	93.55	86.82	6.73
2021	93.32	83.30	10.02
2022	92.05	82.82	9.23
2023	85.97	60.22	25.75

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

విభజనానంతరం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వ్యవసాయమే ప్రధాన జీవనాధారం కాగా గడచిన తొమ్మిదేళ్లలో సేద్యం అంతకంతకూ తగ్గుతోంది. పంటల సాగులో ఖరీఫ్ అత్యంత కీలకం. 70 శాతం సాగు ఈ కాలంలోనే సాగుతుంది. విభజన తర్వాత పది ఖరీఫ్ సీజన్లు రాగా క్రమేపి పంటల సగటు సాధారణ సాగు విస్తీర్ణం దిగజారుతోంది. ఇదే సమయంలో యేటికేడు పంటల సేద్యమూ క్షీణిస్తోంది. కరువు కాటకాలు తుపాను వరదల వంటి ప్రకృతి విపత్తులతో నిమిత్తం లేకుండా సాగు తగ్గడం కొత్త ధోరణి. ఐదేళ్ల పంటల సాగు ప్రాతిపదికగా సాధారణ నార్మల్ విస్తీర్ణం నిర్ణయిస్తారు. ఏడాదేడాదీ నార్మల్ విస్తీర్ణం పడిపోతుండగా అందులోనూ లక్షల ఎకరాల్లో సాగు లేక బీడు పడుతున్నాయి. 2014లో 105 లక్షల ఎకరాల సాధారణ సాగు విస్తీర్ణం ఉన్నదికాస్తా 2023 కొచ్చేసరికి 86 లక్షల ఎకరాలకు తగ్గింది. ఇదే సమయంలో పంటల సాగు 99.65 లక్షల ఎకరాల నుంచి 60.22 లక్షల ఎకరాలకు కుంచించుకుపోయింది. దశాబ్ద కాలంలో ఇన్నేసి లక్షల ఎకరాల్లో సాగు తగ్గడం ఆందోళన కలిగించే అంశం. సాగు యోగ్యమైన భూమి ఖాళీ పడటం ప్రభుత్వాల వైఫల్యానికి నిదర్శనం. సంక్షోభానికి సంకేతం. ప్రతేడాది లక్షల ఎకరాలు బీడు పడటం ఆహార భద్రతకు, ప్రజల జీవనోపాధికి ప్రమాద ఘంటిక.

పాదుకుంటున్న కొత్త ధోరణి

కరువొచ్చినప్పుడు పంటల సాగు తగ్గడం కద్దు. పుష్కలంగా వర్షాలు కురిసినప్పుడూ, ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు తొణికిసలాడినప్పుడూ, సమృద్ధిగా భూగర్భ జలాలున్నప్పుడు సైతం లక్షల ఎకరాల్లో సాగు భూములు ఖాళీ పడుతున్నాయి. పది ఖరీఫ్ సీజన్లలోకెల్ల 2020 కాస్త ఆశాజనకంగా ఉంది. కానీ ఆ సంవత్సరం కూడా నార్మల్‌లో ఆరేడు లక్షల ఎకరాల్లో సేద్యం జరగక బీడు పడ్డాయి. 2014లో 5.35 లక్షల ఎకరాలు, 2015లో 15.19 లక్షల ఎకరాలు, 2016లో 5.85 లక్షల ఎకరాలు, 2017లో 16.30 లక్షల ఎకరాలు, 2018లో 11.92 లక్షల ఎకరాల్లో సాగు లేదు. అవన్నీ కరువు సంవత్సరాలు. రాష్ట్రంలో ఏదొక మూలన గణనీయంగా కరువు మండలాలు ప్రకటించారు.

కాగా 2019 నుంచి వరుసగా నాలుగేళ్లపాటు పుష్కలంగా వానలు కురి శాయి. అయినా 2019లో 11.28 లక్షల ఎకరాలు, 2020లో 6.73 లక్షల ఎకరాలు, 2021లో 10 లక్షల ఎకరాలు, 2022లో 9.23 లక్షల ఎకరాలు, 2023లో దాదాపు 26 లక్షల ఎకరాల్లో విత్తనం పడలేదు.

అన్ని పంటలదీ అదే వరస

ఆహార ధాన్యాలు, నూనెగింజలు, వాణిజ్య పంటలు ఒకటేమిటి అన్ని పంటల సాగు గణాంకాల గ్రాఫ్ కిందికే. 2014ల నుంచీ ఆహార ధాన్యాల నార్మల్ విస్తీర్ణం 50 లక్షల ఎకరాల వద్ద కునారిల్లుతుండగా సాగు 47.67 లక్షల ఎకరాల నుంచి 40.45 లక్షల ఎకరాలకు దిగజారింది. ఆహార పంటల్లో వరి నార్మల్ 37 లక్షల ఎకరాలకు అటూ ఇటుగా ఉంది. సాగు మాత్రం 35.37 లక్షల ఎకరాల నుంచి 31.65 లక్షల ఎకరాలకు తగ్గింది. ఈ కాలంలో నూనెగింజల సాగు బాగా క్షీణించింది. అందుకు వేరుశనగ తగ్గడమే కారణం. నూనె గింజలు నార్మల్ 20.55 లక్షల ఎకరాల నుంచి 17.40 లక్షల ఎకరాలకు దిగజారింది. సాగు 2020లో అత్యధికంగా 19 లక్షల ఎకరాల్లో కాగా ప్రస్తుతం 8.8 లక్షల ఎకరాలకు పరిమితమైంది. నూనె గింజలు ఇంతగా తగ్గడం ఇప్పుడే.

ఎంతో చేశామంటున్న ప్రభుత్వాలు

ఈ సమయంలో టిడిపి ప్రభుత్వం రైతులకు కొద్ది మేర రుణ మాఫీ చేసింది. వైసిపి సర్కారు రైతు భరోసా పేరిట కొంత మొత్తంలో స్వంత భూమి కలిగిన రైతాంగానికి నగదు బదిలీ చేసింది. కౌలు రైతులకు ఇస్తామన్నా నామమాత్రంగానే ఇచ్చింది. రెండు ప్రభుత్వాలూ ఉచిత విద్యుత్‌ను కొనసాగించాయి. అయినప్పటికీ సాగు కుదించుకుపోతోంది. పండించిన పంటలకు ధరలు గిట్టుబాటుకాక, పెట్టుబడులు పెరిగి, సంస్థాగత పరపతి దొరక్క, ప్రైవేటు రుణాలపై ఆధారపడి, విపత్తుల సమయం లో బీమా, పరిహారం అందక, నకిలీ, కల్తీ విత్తనాలు, పురుగుమందుల బెడదతో రైతాంగం తమ జీవనోపాధి అయిన సాగును సాగించలేకపోతున్నారు. ఈ ఏడాదిని పక్కనపెడితే నిరుటి వరకు ప్రాజెక్టుల్లో నీరున్నా నెల్లూరు వంటి చోట్ల రైతులు వరి వేయడానికి ముందుకు రాలేదు. కోనసీమలో క్రాప్ హాలిడే దుష్ప్రచారం అడపాదడపా ముందుకొస్తోంది. రాయలసీమలో రైతులు పంటలు వేయకుండానే ఇ-క్రాప్‌లో నమోదు చేయించుకొనే ధోరణి అక్కడక్కడ కనిపిస్తోంది. వ్యవసాయ భూములు వ్యవసాయేతరానికి మార్పు చెందడం వలన నార్మల్ తగ్గుతోందన్న వాదనలో పస లేదు. రైతులు తమ ప్రాంతాల్లో సంప్రదాయంగా పండించే పంటల నుంచి వేరే పంటలకు మళ్లడం వలన సాగు తగ్గిందనడమూ అంతగా నొప్పదు. ఆ మేరకు సాగు పెరగకపోవడమే కారణం.

తీవ్ర అభ్యంతరకరం

- పినరయి విజయన్

తిరువనంతపురం: ప్రధాన స్రవంతి మీడియా విస్మరిస్తున్న సమస్యలను దేశం దృష్టికి తెచ్చే ప్రత్యామ్నాయ మీడియాను అణచివేసేందుకు చేస్తున్న యత్నాలు అత్యంత అభ్యంతరకరమని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ అన్నారు. ఆన్‌లైన్ న్యూస్ పోర్టల్ 'న్యూస్‌క్లిక్'పై ఢిల్లీ పోలీసులు జరిపిన దాడులు అటువంటి యత్నాల్లో భాగమేనని, వీటిని తీవ్రంగా పరిగణించాల్సిన అవసరముందని బుధవారం ఫేస్‌బుక్‌లో పెట్టిన పోస్ట్‌లో ఆయన పేర్కొన్నారు. న్యూస్‌క్లిక్‌పై ఢిల్లీ పోలీసుల చర్యను పున్ణ పరిశీలించుకోవాలని విజయన్ కోరారు. అసమ్మతి వాణిని అణచివేయడం ఫాసిస్టు పద్ధతి అని ఆయన విమర్శించారు. మీడియా స్వేచ్ఛగా, నిజాయితీగా వార్తలను సేకరించి, ప్రచురించే స్వేచ్ఛను దేశం కల్పించింది. ఆ స్వేచ్ఛను కాపాడేలా కేంద్ర ప్రభుత్వ చర్యలు ఉండాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

బిజెపి, వైసిపి పాలనలో

నిరుద్యోగులకు తీవ్ర ద్రోహం

- ప్రత్యామ్నాయ విధానాలతోనే నిరుద్యోగ సమస్యకు పరిష్కారం
- సిపిఎం రాష్ట్ర సదస్సులో వి శ్రీనివాసరావు
- 19 తీర్మానాలు ఏకగ్రీవంగా ఆమోదం

సదస్సులో మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వాలు నిరుద్యోగులకు తీరని ద్రోహం చేశాయని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. సిపిఎం ఆధ్వర్యంలో తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని హోటల్ రివర్‌బేలో బుధవారం రాష్ట్ర స్థాయి నిరుద్యోగ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించగా, సిపిఎం తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి టి.అరుణ్ సభికులను వేదికపైకి ఆహ్వానించారు. వి.శ్రీనివాసరావు ముఖ్యవక్తగా హాజరై ప్రసంగించారు. కేంద్రలోని బిజెపి, రాష్ట్రంలో వైసిపి పూర్తి భిన్నమైన విధానాలను అనుసరిస్తున్న ఫలితంగానే నిరుద్యోగ సమస్య నానాటికి పెరుగుతోందన్నారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలిస్తామని చెప్పిన బిజెపి, ప్రతి ఏటా జాబ్ కేలండర్ విడుదల చేస్తామంటూ హామీ ఇచ్చిన వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని బుట్టదాఖలు చేశాయని తెలిపారు. పరిశ్రమల ఏర్పాటులో కీలకమైన రాష్ట్రానికి ప్రత్యేక హోదాను సాధించుకోవడంలో వైసిపి సర్కారు పూర్తిగా విఫలమైందన్నారు. పదేళ్లలో బిజెపి సర్కారు ఒక్క ప్రభుత్వ రంగ సంస్థను కూడా ఏర్పాటు చేయకపోగా, ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటుపరం చేసి కార్పొరేట్లకు అప్పజెప్పే కుట్ర చేస్తోందని తెలిపారు. 32 మంది యువకుల బలిదానంతో సాధించుకున్న విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని కార్పొరేట్లకు కట్టబెట్టాలని చూస్తోందని, కడప ఉక్కు పరిశ్రమ మాటే పరిచిందని అన్నారు. విశాఖలో గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్ అనంతరం 60 లక్షల మందికి ఉద్యోగాలొస్తాయంటూ ప్రచారం చేశారని, ఏడు నెలలు గడుస్తున్నా పరిశ్రమల ఏర్పాటుకు అడుగులు ఎందుకు పడడంలేదని ప్రశ్నించారు.

ఎంఎల్‌సి కెఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 30 వేల పోస్టులతో మెగా మిగతా 2లో

పారిశ్రామికవేత్తలకు సానుకూలం

- సిఎం జగన్
- 13 ప్రాజెక్టులకు వర్చువల్‌గా ప్రారంభోత్సవం, శంకుస్థాపనలు



తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో పారిశ్రామికవేత్తలతో ముఖ్యమంత్రి జగన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పారిశ్రామిక వేత్తల పట్ల అత్యంత సానుకూలంగా ఉన్నామని, జిల్లాల కలెక్టర్లు, ఎపిఐఐసి, పరిశ్రమల శాఖ మంత్రి,కార్యదర్శి, సిఎస్‌తో సహా అందరూ మిమ్మల్ని (పారిశ్రామిక వేత్తలు) చేయి పట్టుకుని నడిపించేందుకు సానుకూలంగా ఉన్నారని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. క్యాంపు కార్యాలయం లో బుధవారం సిఎం పరిశ్రమలు, ఆహార శుద్ధి రంగంలో 13 ప్రాజెక్టులకు ప్రారంభోత్సవం, శంకుస్థాపనలు వర్చువల్‌గా చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ (జిఐఎస్)లో భాగంగా విశాఖలో పరిశ్రమలు నెలకొల్పేందుకు 386 ఎంఓయూలు, రూ.13లక్షల కోట్లు పెట్టుబడులు, 6లక్షల మందికి ఉద్యోగాలు వచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. అవన్నీ సాకారం అయ్యేందుకు ప్రతి నెలా వాటిని కార్యరూపం దాల్చేలా అవి అమలయ్యేందుకు సిఎస్ ఆధ్వర్యంలో ఒక ప్రత్యేకమైన కమిటీని కూడా ఏర్పాటు చేశామని సిఎం వెల్లడించారు. 3 యూనిట్లకు ప్రారంభోత్సవాలు, 9 యూనిట్లకు శంకుస్థాపనలు , ఒక ఎంఓయూపై సంతకాలు కూడా చేసినట్లు సిఎం వెల్లడించారు. రూ.3008 కోట్ల పెట్టుబడితో దాదాపు 7వేల మందికి పైగా ప్రత్యక్షంగా ఉద్యోగ అవకాశాలు వచ్చే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు పేర్కొన్నారు. అ 75శాతం స్థానికులకే ఉద్యోగాలివ్వాలని చట్టం కూడా చేశామన్నారు.

3ఎఫ్ ఆయిల్ ఎపామ్ కంపెనీకి ఎంఓయూ:

తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం అయ్యవరంలో ఆయిల్ పామ్ కంపెనీ ఏర్పాటుకు ముఖ్యమంత్రి సమక్షంలో ఎంఓయూ చేసుకున్నారు. 3ఎఫ్ ఆయిల్ పామ్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండి సంజయ్ గోయెంకా, ఎపిఎఫ్‌పిఎస్ సిఇఓ శ్రీధర్‌రెడ్డి కంపెనీ తరపున పాల్గొన్నారు. రూ.250కోట్లతో 50 ఎకరాల్లో ఏర్పాటు కానున్న ఫ్యాక్టరీ ద్వారా సుమారు 1500మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. గంటకు 60 టన్నుల ఉత్పత్తిసామర్థ్యం, 25వేల హెక్టార్లలో మిగతా 2లో

ఆకస్మిక వరదలతో అతలాకుతలమైన గ్యాంగ్‌టక్

సిక్కింలో ఆకస్మిక వరదలు

- 8 మంది మృతి
- 23 మంది సైనికులతో సహా 49 మంది గల్లంతు

గ్యాంగ్‌టక్: ఉత్తర సిక్కింలో మేఘ విస్ఫోటనంతో వర్షాలు కుండపోతగా కురియడంతో తీస్తా నదికి ఆకస్మిక వరదలొచ్చి ఎనిమిది మంది చనిపోయారు. 23 మంది సైనికులతో సహా 49 మంది గల్లంతయ్యారు. ముగ్గురు ఉత్తర బెంగాల్‌లో చనిపోగా, గొలిటార్, సింగ్టామ్ ప్రాంతంలో అయిదు మృతదేహాలు స్వాధీనం చేసుకున్నట్లు గాంగ్టక్ సబ్ డివిజనల్ మెజిస్ట్రేట్ మహేంద్ర ఛెత్రి తెలిపారు. మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశమున్నట్లు అధికారులు పేర్కొన్నారు. మంగళవారం రాత్రి ఉత్తర సిక్కింలోని లోనాక్ సరస్సు వెంబడి ఒక్కసారిగా కురిసిన కుంభవృష్టికి లాచెన్ లోయలో తీస్తా నది ఒక్కసారిగా ఉప్పొంగింది. నీటి మట్టం ఒక్కసారిగా 25 అడుగుల మేర పెరగడంతో ఆ సమీప ప్రాంతాలను వరద ముంచెత్తింది. ఈ వరదల ధాటికి లాచెన్ లోయలోని ఆర్మీ పోస్టులు, సింగ్తమ్ ప్రాంతంలోని ఆర్మీ వాహనాలు కొట్టుకుపోయాయని,. అందులోని 23 మిగతా 2లో

చంద్రబాబు పిటిషన్ల విచారణ నేటికి వాయిదా

నేడు ఉక్కు రక్షణ యాత్ర ముగింపు

- హాజరుకానున్న ఏచూరి

టిడిపి - జనసేన ఉమ్మడి మ్యానిఫెస్టో

- కేంద్రం మద్దతివ్వాలి
- నాకున్న సమాచారంతోనే మాట్లాడాను : పవన్ కల్యాణ్

2

వాటాలు తేల్చండి

- కెడబ్ల్యుడిటికి కేంద్ర కేబినెట్ సూచన

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య కృష్ణా జలాలను పున:పంపిణీ చేయాలని కేంద్ర కేబినెట్ అభిప్రాయపడింది. ప్రధానమంత్రి నరేంద్రమోడీ అధ్యక్షతన బుధవారం జరిగిన మంత్రిమండలి సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. దీనిలో భాగంగా కృష్ణా జల వివాద ట్రిబ్యునల్-2కు సంబంధించిన నిబంధనలను కేంద్ర మంత్రివర్గం ఆమోదించింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మధ్య నెలకొన్న వివాదాన్ని వీటి ప్రకారం పరిష్కరించాలని కెడబ్ల్యుడిటికి సూచించింది. కేంద్ర ప్రభుత్వ ఈ నిర్ణయం రాష్ట్ర ప్రయోజనాలకు హాని చేస్తుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించిన కృష్ణా జలాలను రెండు రాష్ట్రాల మధ్య ట్రిబ్యునల్ పంపిణీ చేస్తుంది. ఐఎస్‌ఆర్‌డబ్ల్యుడి చట్టం, 1956లోని సెక్షన్ 3 ప్రకారం రాష్ట్రాలు చేసిన అభ్యర్థనలపై 2004లో కేంద్ర ప్రభుత్వం కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్-2 బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. తుది తీర్పు గెజిట్‌లోకి వచ్చే సమయంలో 2014 రాష్ట్రం విడిపోవడంతో తెలంగాణా తమకు బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ కేటాయింపులు న్యాయసమ్మతంగా లేవని పేర్కొంది.కృష్ణా నదీ జలాల వినియోగం, పంపిణీ లేదా నియంత్రణపై వివాదాన్ని పరిష్కరించాలని తెలంగాణ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు 2015లో సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ కూడా దాఖలు చేసింది. 2020లో జలశక్తి మంత్రి ఆధ్వర్యంలో జరిగిన రెండవ అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో ఈ విషయం చర్చించారు. బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ సిఫార్సులు గజెట్‌లో ప్రచురితం కాకున్నా ప్రాజెక్టుల కేటాయింపుల ఆధారంగా ఎపికి 512 టిఎంసిలు, తెలంగాణా 299 టిఎంసీలు వినియోగించుకునేలా తాత్కాలిక ఏర్పాటు చేసుకున్నారు. ట్రిబ్యునల్ కాలపరిమితి ఉన్నంత కాలం ఈ ఒప్పందం అమలులో ఉండాల్సిఉంది. కాగా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణాల మధ్య మధ్యంతరంగా మరోసారి కృష్ణా జలాల పంపిణీ చేయాలని కేంద్ర కేబినెట్ తాజాగా నిర్ణయించింది. ఇది రాష్ట్ర రైతాంగానికి నష్టం చేకూరుతుందని పలువురు నిపుణులు హెచ్చరిస్తున్నారు. తెలంగాణాలో ఎన్నికలు వున్నందున రాజకీయ ప్రయోజనాల కోసమే కేంద్రం ఈ నిర్ణయం తీసుకుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

పసుపు బోర్డు, గిరిజన యూనివర్శిటికి ఆమోదం

తెలంగాణలో జాతీయ పసుపు బోర్డు, సమ్మక్క సారక్క కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటుకు కేంద్ర క్యాబినేట్ ఆమోదం తెలిపింది. తెలంగాణలో గిరిజనుల ఉన్నత విద్య కోసం ఈ వర్సిటీని రూ.889.07 కోట్ల వ్యయంతో ములుగులో ఏర్పాటు చేయనున్నారు. కేబినెట్ నిర్ణయాలను కేంద్రమంత్రులు అనురాగ్ ఠాకూర్, కిషన్ రెడ్డి మీడియాకు వెల్లడించారు. ఉజ్వల పథకం లబ్ధిదారులకు 14 కేజీల గ్యాస్ సిలిండర్‌పై ఇచ్చే రాయితీని రూ.300కు పెంచుతూ కేబినెట్ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు.

ఉజ్వల పథకం కింద పేదలకు సరఫరా చేసే వంట గ్యాస్ సిలిండర్‌పై ప్రస్తుతం కేంద్రం రూ.200 చొప్పున రాయితీ ఇస్తుండగా.. తాజాగా దాన్ని రూ.300కు పెంచుతూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం 14.2 కిలోల వంటగ్యాస్ సిలిండర్ మార్కెట్ ధర రూ.925 ఉండగా.. ఉజ్వల లబ్ధిదారులు రూ.725 చొప్పున చెల్లిస్తున్నారు.

బిజెపి కుటిల రాజకీయాలు

ఎపి రైతు సంఘం 3

నేడు ఉక్కు రక్షణ యాత్ర ముగింపు

- హాజరుకానున్న ఏచూరి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా, కేంద్రంలో బిజెపి ప్రభుత్వ వైఖరికి నిరసనగా సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన ఉక్కు రక్షణ యాత్ర గురువారం ముగియనుంది. ఈ సందర్భంగా విశాఖపట్నం స్టీలు ప్లాంటు మెయిన్‌గేటు (కూర్మన్నపాలెం) వద్ద భారీ బహిరంగసభను నిర్వహించనున్నట్లు సిపిఎం రాష్ట్ర కమిటీ ప్రకటించింది. ఈ సభకు సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నరసింగరావు హాజరవుతారని తెలిపింది. సిపిఎం ఆధ్వర్యంలో సెప్టెంబరు 20న విశాఖపట్నంలోని జివిఎంసి గాంధీ విగ్రహం నుంచి పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు లోకనాథం నాయకత్వంలో 52 మంది కార్యకర్తలతో బైకుయాత్ర ప్రారంభమైంది. ఆరు జిల్లాల్లో 12 రోజులపాటు సుమారు 1500 కిలోమీటర్లు సాగింది. 150 సెంటర్లలో సభలు నిర్వహించగా, 30 వేలమంది ప్రజలు హాజరయ్యారు. బైకుయాత్రకు సంఘీభావంగా ఎక్కడికక్కడ ప్రజలు పెద్దయెత్తున బైకులతో యాత్రలో పాల్గొన్నారు. మొత్తంగా విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రజల నుంచి నిరసన వ్యక్తమైంది. బైకుయాత్రకు ప్రజల నుంచి మంచి స్పందన వచ్చిందని రాష్ట్ర కమిటీ తెలిపింది.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

దళితుడి కాలు విరగ్గొట్టిన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలి : కెవిపిఎస్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కోళ్ల దొంగతనం పేరుతో దళితుడి కాలు విరగ్గొట్టిన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఓ నల్లప్ప, అండ్ర మాల్యాద్రి డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. విశాఖ జిల్లా పద్మనాభం పోలీస్ స్టేషన్‌లో బాందేవపురం పాపు అనే దళిత యువకుడిని కోళ్ల దొంగతనం కేసులో విచారించేందుకు తీసుకొచ్చి థర్డ్ డిగ్రీ ప్రయోగించి కాలు విరగ్గొట్టారని తెలిపారు. దీనికి కారణమైన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

దేశంలో బిజెపి పాలిత రాష్ట్రాలతోపాటు మన రాష్ట్రంలో దళితులపై దారుణమైన కుల దురహంకార దాడులు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. మాస్క్ లేదని దళిత యువకుడిని కొట్టి చంపారని, ఇసుకపై ఫిర్యాదు చేశారని మరొక దళిత యువకుడికి శిరోముండనం చేశారని తెలిపారు. నిందితులపైనా, కారణమైన పోలీసులపైనా ఇప్పటి వరకూ ఏలాంటి చర్యలూ తీసుకోలేదని విమర్శించారు. ఆందోళన, ఉద్యమాలు సందర్భంలో కొందరు పోలీసులు దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారని అన్నారు.

టిడిపి - జనసేన ఉమ్మడి మ్యానిఫెస్టో

- కేంద్రం మద్దతివ్వాలి
- నాకున్న సమాచారంతోనే మాట్లాడాను : పవన్ కల్యాణ్

పెడన బహిరంగ సభలో మాట్లాడుతున్న పవన్ కల్యాణ్

ప్రజాశక్తి- కృష్ణా ప్రతినిధి

త్వరలో జనసేన-టిడిపి సంయుక్త మ్యానిఫెస్టో రానుందని జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ తెలిపారు. జనం బాగుపడాలంటే రాష్ట్రంలో దుష్టపాలన చేస్తోన్న జగన్ ప్రభుత్వం పోవాలన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి, రాష్ట్రాభివృద్ధికి వచ్చే ఎన్నికల్లో జనసేన-టిడిపి సంకీర్ణ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావాలని కోరారు. తమ సంకీర్ణ కూటమికి కేంద్రం మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కృష్ణా జిల్లాలో పవన్ చేపట్టిన వారాహి విజయయాత్ర నాలుగో రోజైన బుధవారం పెడనలో సాగింది. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రత్యేక పరిస్థితులున్నాయని విమర్శించారు. సభ జరపాలన్నా సమస్యగా మారిందని ఆక్షేపించారు. రాష్ట్రంలోకి రావాలన్నా వీసా, పాస్‌పోర్టు అడిగేలా పరిస్థితి ఉందని విమర్శించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇది సరికాదన్నారు. చంద్రబాబు అనుభవానికి జనసైనికుల బలం తోడైతే వైసిపిని భూస్థాపితం చేయవచ్చని పేర్కొన్నారు. త్వరలోనే టిడిపి, జనసేన చర్చించుకుని రాష్ట్రాభివృద్ధికి అన్ని వర్గాలకూ మేలు జరిగేలా మ్యానిఫెస్టో తీసుకొస్తామన్నారు. గత ఎన్నికల్లో ప్రజలు వైసిపికి 151 మంది ఎంఎల్‌ఎలను, 22 మంది ఎంపిలను ఇచ్చినా రాష్ట్ర రాజధాని నిర్మాణంలో, విభజన హామీల అమలులో ముఖ్యమంత్రి జగన్ విఫలమయ్యారని విమర్శించారు. విశాఖ ఉక్కును ప్రయివేటీకరించొద్దని, ఈ ఫ్యాక్టరీ అభివృద్ధికి నిధులు అవసరమని కేంద్రాన్ని అడగలేకపోయారని అన్నారు. రాష్ట్రాభివృద్ధి కుంటుపడిందని, యువతకు ఉద్యోగాలు దొరకడం లేదని తెలిపారు. ఉద్యోగాలు ఏవని ప్రశ్నిస్తే గ్రామ సచివాలయాలు, వార్డు వలంటీర్ల లెక్కలను రాష్ట్ర ప్రభుత్వం చూపుతోందని విమర్శించారు. జనసేన, టిడిపి ప్రభుత్వం అధికారంలోకొస్తే అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తామని, యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉద్యోగావకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. పోలీసుల నోటీసులపై స్పందించారు. గతంలో తాను చిత్తూరు జిల్లాకు వెళ్తుండగా పోలీసులు అడ్డుకున్నారని, దీనిపై పోలీసులను ప్రశ్నించగా తాను వెళ్లే ప్రాంతంలో అల్లర్లు జరిగే అవకాశం ఉందని తెలిపారన్నారు. ఇందుకు సంబంధించి మీ వద్ద ఏ సమాచారం ఉందని ప్రశ్నిస్తే, ఇన్‌పుట్ ఉందని చెప్పి తన పర్యటనను అప్పట్లో అడ్డుకున్నారని వివరించారు. వారాహి విజయయాత్రలో పెడనలో అల్లర్లు సృష్టించడానికి, రాళ్ల దాడికి ప్రభుత్వం ప్రయత్నాలు ప్రయత్నిస్తోందని నాకున్న సమాచారం మేరకు మాట్లాడానని తెలిపారు. దీనికి ఆధారాలు చూపాలని పోలీసులు నోటీసులు ఇవ్వడం సరికాదన్నారు. దాడులు జరగకుండా నియంత్రించాల్సిన బాధ్యత పోలీసులదని తెలిపారు. పోలీసులు వైసిపి కార్యకర్తల్లా వ్యవహరించకూడదని, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని, చట్టప్రకారం వ్యవహరించాలని అన్నారు. ఈ సభకు జనసేన, టిడిపి నేతలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

పవన్ కల్యాణ్‌కు పోలీసుల నోటీసులు

దీనికి ముందు జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్‌కు బుధవారం కృష్ణా జిల్లా బందర్‌లో పోలీసులు నోటీసులు ఇచ్చారు. వారాహి యాత్రపై రాళ్ల దాడికి ప్లాన్ జరిగిందని పవన్ కల్యాణ్ చేసిన ఆరోపణలకు సాక్ష్యాలు ఏవైనా ఉన్నాయా? అని ఈ నోటీసులో ప్రశ్నించారు. 'పవన్ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. అందుకే నోటీసులు ఇచ్చాం. దాడులు జరుగుతాయనే సమాచారం మీకు ఎక్కడి నుంచి వచ్చిందనేది మాకు తెలియజేయాలని కోరాం. సరైన ఆధారాల్లేకుండా వ్యాఖ్యలు, ఆరోపణలు చేయకూడదు. బాధ్యతారాహిత్యంగా ఆరోపణలు చేస్తే పర్యవసానాలు ఉంటాయి. రెచ్చగొట్టే భాష, సైగలు మానుకుని మాట్లాడాలి. పవన్ కంటే నిఘా వ్యవస్థ మాకు బలంగా ఉంది. అసాంఘిక శక్తులుంటే కచ్చితంగా చర్యలు తీసుకుంటాం' అని జిల్లా ఎస్‌పి జాషువా పేర్కొన్నారు.

బాబు పిటిషన్ల విచారణ నేటికి వాయిదా



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో రిమాండ్‌లో వున్న తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబునాయుడును కస్టడీకి ఇవ్వాలన్న సిఐడి పిటీషన్, చంద్రబాబునాయుడి బెయిల్ పిటిషన్‌పై విచారణను ఎసిబి కోర్టు గురువారానికి వాయిదా వేసింది. బుధవారం విజయవాడలోని ఎసిబి కోర్టులో చంద్రబాబునాయుడి తరుపున సుప్రీం కోర్టు న్యాయవాది ప్రమోద్‌కుమార్ దూబే, సిఐడి తరుపున ఎఎజి పొన్నవోలు సుదాకర్‌రెడ్డి వాదనలను వినిపించారు. ఇరువర్గాల వాదనలను విన్న ఎసిబి కోర్టు గురువారం ఉదయం 11.15 గంటలకు మిగిలిన వాదనలను వింటామని ప్రకటించింది. అంతకుముందు చంద్రబాబునాయుడుకు బెయిల్ ఇవ్వొద్దని, కస్టడీకి అనుమతించాలంటూ ప్రభుత్వం తరపున ఎఎజి పొన్నవోలు సుధాకర్ రెడ్డి వాదించారు. ఈ కేసులో చంద్రబాబునాయుడుకు 17ఎ వర్తించదని అన్నారు. చంద్రబాబునాయుడి పిఎ పెండ్యాల శ్రీనివాస్, మనోజ్ వాసుదేవ్ విదేశాలకు పరారయ్యారని పొన్నవోలు సుధాకర్‌రెడ్డి తెలిపారు. వాళ్లిద్దరూ ఐటి దర్యాప్తులో ఉన్నవాళ్లేనా కోర్టు సిఐడి న్యాయవాదిని ప్రశ్నించింది. స్కిల్ కేసులో చంద్రబాబునాయుడితో ఆర్థిక లావాదేవీలు జరపటంతోనే వాళ్లిద్దరూ విదేశాలకు వెళ్లారని పొన్నవోలు సుదాకర్‌రెడ్డి తెలిపారు. ఈ కేసులో వాంగ్మూలం ఇచ్చిన ఆర్థిక కార్యదర్శి పివి రమేష్ మాట మార్చారని మీడియాలో వేరే విధంగా చెబుతున్నారని కోర్టు దృష్టికి తెచ్చారు. ఈ దశలో చెప్పిందే చెబుతున్నారని ఎఎజి పొన్నవోలు సుధాకర్‌రెడ్డి పై న్యాయమూర్తి కొంత అసహనం వ్యక్తం చేశారు. నిధుల దుర్వినియోగం ఎలా జరిగిందో చెప్పాలని ప్రశ్నించింది. . స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబునాయుడి వైపు ఎలాంటి తప్పిదాలు లేవని ప్రమోద్‌కుమార్ దుబే వాదించారు. ఆర్థికశాఖ ఉన్నతాధికారి సునీత గుజరాత్ వెళ్లి అధ్యయనం చేశారు. ఆమె అధ్యయనం చేశాక సీమెన్స్ ప్రాజెక్టుకు ఎలాంటి అభ్యంతరం తెలపలేదన్నారు. ఎలాంటి అభ్యంతరం లేకుండా ప్రాజెక్టు ఆమోదం పొందిందన్న ఆధారాలు ఉన్నాయని తెలిపారు. స్కిల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టుకు కాస్ట్ ఎవాల్యుయేషన్ కమిటీ ప్రాజెక్టు ఎక్విప్‌మెంట్ ధరను నిర్ధారించిందని, ఆ కమిటీలో చంద్రబాబునాయుడు లేరని కోర్టు దృష్టికి తెచ్చారు. ఎవాల్యుయేషన్ కమిటీలో ఉన్న భాస్కరరావు ప్రస్తుతం మధ్యంతర బెయిల్‌పై ఉన్నారన్నారు. సుప్రీంకోర్టు నవంబర్ 16 వరకు ఆయన బెయిల్‌ను పొడిగించిందని తెలిపారు. చంద్రబాబునాయుడుకు ఎలాంటి నోటీసు ఇవ్వకుండా అరెస్ట్ చేసి ఆ తర్వాత విచారణ చేపట్టారని కోర్టు దృష్టికి తెచ్చారు. ఈ వాదనల అనంతరం మధ్యాహ్నానికి వాయిదా వేశారు. భోజన విరామం అనంతరం ప్రభుత్వం తరపున ఎఎజి పొన్నవోలు సుధాకర్ రెడ్డి వాదనలను కొనసాగించారు.స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మొత్తం వ్యవహారం అంతా చంద్రబాబునాయుడు చుట్టూనే వుందని కోర్టు దృష్టికి తెచ్చారు. ముద్దాయిలందరికీ ఏదో ఒక స్థాయిలో ఈ కార్పొరేషన్ ద్వారా వ్యక్తిగత లబ్ధి చేకూరిందన్నారు. 2018లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం సిబిఐ హెచ్చరికల నేపథ్యంలో కంటితుడుపు విచారణకు ఆదేశించిందన్నారు. ఆ విచారణ అనంతరం కేసును బుట్ట దాఖలు చేశారని తెలిపారు. సామాజిక, ఆర్థిక నేరాల్లో బెయిల్ ఇవ్వొద్దని సుప్రీంకోర్టు తీర్పులున్నాయని చెప్పారు. ఇరువైపుల వాదనలు విన్న ఎసిబి కోర్టు విచారణను గురువారానికి వాయిదా వేసింది.

'న్యూస్ క్లిక్'పై అక్రమ కేసులు : సిఐటియు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

'న్యూస్ క్లిక్'పై కేంద్ర ప్రభుత్వ దాడులు, అక్రమ అరెస్టులను సిఐటియు ఎపి కమిటీ ఖండించింది. ఈ మేరకు సిఐటియు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎవి నాగేశ్వరరావు, సిహెచ్ నరసింగరావు ఒక ప్రకటన విడుదల చేశారు. ఢిల్లీతో సహా వివిధ నగరాల్లో న్యూస్ క్లిక్ మీడియా సంస్థపై క్రూరమైన యుపిఎ చట్టంలోని వివిధ సెక్షన్ల కింద అక్రమంగా కేసులు నమోదు చేసి జర్నలిస్టులు, శాస్త్రవేత్తలు, కార్టూనిస్టులు, విమర్శకుల ఇళ్లపై ఢిల్లీ పోలీసులు దాడులు చేయడం దుర్మార్గమన్నారు. న్యూస్ క్లిక్‌పై దాడి అంటే ప్రజాస్వామ్య హక్కులపై దాడిగా సిఐటియు పేర్కొంది.

ప్రశ్నించే మేధావులపై దాడులను ఖండించాలి
జనవిజ్ఞాన వేదిక

ప్రభుత్వాలను ప్రశ్నిస్తున్న మేధావుల నోరునొక్కడానికి కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా పోలీసులను ప్రయోగించడాన్ని జనవిజ్ఞాన వేదిక నిరసించింది. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షులు గేయానంద్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఒక అకడమిక్ నిపుణుడిగా ఉన్న ఢిల్లీ సైన్స్ ఫోరం నాయకులు రఘునందన్‌ను పోలీసులు విచారణ పేరుతో వేధించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు.

తమతో ఏకీభవించని జర్నలిస్టులు, రచయితలు, కళాకారులు, నిపుణులపై పోలీసు నిర్బంధకాండను తేలికగా తీసుకోవడానికి వీల్లేదని అన్నారు. ఒక పదకం ప్రకారం జరుగుతున్నట్లు కనిపించే ఈ దాడులు ఆంధ్రప్రదేశ్‌కు కూడా విస్తరించాయని పేర్కొన్నారు. ఇది భావప్రకటనా స్వేచ్ఛ మీద, ఆధునిక ప్రజాస్వామిక విలువల మీద జరుగుతున్న దాడి అని అన్నారు. దీన్ని జనవిజ్ఞాన వేదిక నిరసిస్తున్నదని వివరించారు. రఘునందన్‌పై ఢిల్లీ పోలీసులు అక్రమ, అనుచిత చర్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

జర్నలిస్టులపై దాడికి ఖండన : కెవిపిఎస్

ఢిల్లీలో జర్నలిస్టులపై దాడిని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నల్లప్ప, అండ్ర మాల్యాద్రి ఖండించారు. న్యూస్ క్లిక్ వార్తా సంస్థ కార్యాలయంపై దాడి చేసి, ఎడిటర్‌పై ఉగ్రవాద నిరోధక చట్టం కింద కేసు నమోదు చేయడం దుర్మార్గమని పేర్కొన్నారు.

ఇది ముమ్మాటికీ పత్రికా స్వేచ్ఛపై దాడి చేయడమేనని అన్నారు. సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, సామాజిక కార్యకర్త తీస్తా సెతల్వాద్ ఇళ్లపై సోదాలు చేయడమంటే ప్రజాస్వామ్యానికి పాతర వేయడమేనని పేర్కొన్నారు.

లోటు భర్తీ చేసేదెలా!

- తలలు పట్టుకుంటున్న ఆర్థికశాఖ
- తొలి అర్థ సంవత్సరంలోనే 82 వేల కోట్లు లోటు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ఎన్నికల సంవత్సరంలో ఖజానాపై పడుతున్న లోటు భారం సమస్యగా మారుతోంది. తొలి అర్థ సంవత్సరంలోనే ఏకంగా 80 వేల కోట్లకుపైగా లోటు నెలకొనడం ఆందోళన కలిగిస్తోంది. ఇప్పటికే ఆదాయానికి, వ్యయానికి మధ్య అంతరం భారీగా పెరగడంతో అప్పులపై, కేంద్రం నుంచి వచ్చే నిధులపై ఆధారపడుతున్న ఆర్థికశాఖ ప్రతి నెల్లోనూ ఓవర్‌డ్రాఫ్ట్‌కు వెళ్లాల్సి వస్తోంది. దీనివల్ల ప్రతి నెలా తొలి వారమంతా అయోమయ పరిస్థితులే నెలకొంటున్నాయి.

తాజాగా లెక్కల మేరకు తొలి ఆరు నెలల్లో రూ. 82,040 కోట్లు లోటుగా తేలింది. రాష్ట్ర సొంత పన్నులు, ఇతర సొంత ఆదాయం కేవలం రూ.39,175 కోట్లు మాత్రమే రికార్డు కాగా, వ్యయం మాత్రం ఏకంగా రూ.1,21,215 కోట్లుగా రికార్డు కావడంతో ఈ భారీ లోటు నెలకొందని అధికారులు చెబుతున్నారు. ఇందులో అత్యధికంగా మే నెల్లోనే రూ.20,190 కోట్లు లోటు కనిపించింది. ఆ తరువాత జూన్‌లో రూ.18,087 కోట్లు, జులైలో రూ.13,410 కోట్లు లోటు నెలకొంది. వ్యయానికి వస్తే అత్యధికంగా మే నెలలోనే రూ. 26,576 కోట్లు ఖర్చు చేయగా, జూన్‌లో రూ. 24,913 కోట్లు, ఏప్రిల్‌లోరూ. 20,320 కోట్లు వ్యయం జరిగింది. ఇక ఆదాయ విభాగంలో అతి తక్కువగా జూలైలో రూ. 5,579 కోట్లు వచ్చినట్లు తేలింది.

రుణాలపై ఆధారం

ఇలా ఆదాయానికి వ్యయానికి మధ్య భారీ అంతరం నెలకొనడంతో రుణాలపైనే ఎక్కువగా ఆధారపడాల్సి వస్తోందని అధికారులే అంగీకరిస్తున్నారు. ఇప్పటికే సెక్యూరిటీల వేలం ద్వారా రిజర్వ్‌బ్యాంకు నుంచి రూ. 45 వేల కోట్ల వరకు రుణాలు సేకరించగా, దాంతో సగం లోటు భారాన్ని తగ్గించుకున్నట్లు అయిందని కూడా అధికారులు అంటున్నారు. మిలిగిన లోటును కొంత కేంద్రం నుంచి వచ్చే నిధుల నుంచి భర్తీ చేసుకుంటున్నామని ఒక అధికారి వ్యాఖ్యానించారు.

ఓవర్‌డ్రాఫ్టులూ కీలకమే

దైనందిక అవసరాలు తీర్చుకునేందుకు సరిపడే ఆదాయం లేకపోవడంతో అనునిత్యం ఓవర్ డ్రాఫ్టలపైనే ఆధారపడాల్సి వస్తోంది. సెప్టెంబర్‌తో ముగిసిన రెండో త్రైమాసికంలో ఏకంగా 21 రోజులు ఓవర్‌డ్రాఫ్ట్‌లో ఉండగా, మూడో త్రైమాసికం ప్రారంభ నెల అయిన అక్టోబర్ తొలి రోజు కూడా భారీగా ఓడీకి వెళ్లాల్సి వచ్చింది. తొలి రెండు రోజులు సెలవు రోజులు కావడంతో స్తబ్దుగా ఉండిపోయిన ఆర్థికశాఖ మూడో రోజునే ఏకంగా మూడు వేల కోట్లకుపైగా ఓవర్‌డ్రాఫ్ట్‌కు వెళ్లడం విశేషం.

తొలి అర్థ వార్షికంలో ఆదాయ వ్యయాల వివరాలు (రూ. కోట్లలో)

నెల	ఆదాయం	వ్యయం	లోటు
ఏప్రిల్	8,147	20,320	12,173
మే	6,386	26,576	20,190
జూన్	6,826	24,913	18,087
జూలై	5,579	18,989	13,410
ఆగస్టు	6,299	15,515	9,215
సెప్టెంబర్	5,938	14,902	8,965
మొత్తం	39,175	1,21,215	82,040

ఎపికి విద్యుత్ బకాయిల కేసులో తీర్పు రిజర్వు

- ముగిసిన వాదనలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎపికి విద్యుత్ బకాయిలు చెల్లించాలని తెలంగాణకు కేంద్రం ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేసిన కేసులో తెలంగాణ హైకోర్టులో మంగళవారం వాదనలు ముగిశాయి. తీర్పును రిజర్వు చేస్తున్నట్టు ప్రధాన న్యాయమూర్తి ఆలోక్ ఆరాదే, జస్టిస్ ఎన్‌వి.శ్రావణ్ కుమార్‌ల డివిజన్ బెంచ్ ప్రకటించింది. ఎపికి విద్యుత్ బకాయిలు రూ.3441.78 కోట్లు చెల్లించకపోవడంతో సర్‌చార్జ్ రూ.3315.14 కోట్లతో కలిపి మొత్తం రూ.6756.92 కోట్లను 30 రోజుల్లో చెల్లించాలంటూ గత అగస్టు 20న కేంద్రం ఉత్తర్వులిచ్చింది. దీనిని తెలంగాణ ప్రభుత్వం, తెలంగాణ విద్యుత్ సంస్థలు హైకోర్టులో సవాల్ చేశాయి. గతంలో హైకోర్టు స్టే ఇచ్చింది. మంగళవారం వాదనలు పూర్తయ్యాయి. రాష్ట్రం తరపున సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాది సిఎస్ వైద్యనాథన్, విద్యుత్ సంస్థల తరపున వై.రామారావులు వాదనలు వినిపిస్తూ.. రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్ 12 ప్రకారం రెండు రాష్ట్రాల మధ్య వివాదం ఏర్పడితే కేంద్రం జోక్యానికి వీల్లేదన్నారు. దక్షిణ ప్రాంత మండలిలో చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని తెలిపారు. ఎపి నుంచి తమకు బకాయిలు రావాలన్నారు. కేంద్రం పెత్తనం చేసే క్రమంలోనే ఉత్తర్వులు ఇచ్చిందని తెలిపారు. ఆ ఉత్తర్వులను రద్దు చేయాలని కోరారు. దీనిపై ఎపి తరుపు సీనియర్ లాయర్ సివి మోహన్‌రెడ్డి, ఎపి విద్యుత్తు సంస్థల తరపున సీనియర్ లాయర్ ఎం.విద్యాసాగర్ ప్రతివాదన చేస్తూ గతంలో మాదిరిగా విద్యుత్‌ను తెలంగాణకు ఇవ్వాలని కేంద్రం చెప్పినట్టుగా చేశామనీ, విద్యుత్ బకాయిలు చెల్లించకపోవడంతో తమ విద్యుత్ సంస్థలు ఆర్థిక సంక్షోభంలోకి వెళ్లిపోతున్నాయని చెప్పారు. కేంద్రం చెప్పిందని 2017 వరకు ఎపి విద్యుత్‌ను సరఫరా చేసిందన్నారు. కేంద్రం తరపున అదనపు సొలిసిటర్ జనరల్ సుందరేశన్ వాదిస్తూ విద్యుత్, బొగ్గు వంటి అంశాలపై వివాదం ఏర్పడితే కేంద్రం జోక్యం చేసుకోవచ్చని చెప్పారు. అందుకే తెలంగాణ ప్రభుత్వానికి నోటీసులిచ్చినట్టు పేర్కొన్నారు. వాదనల తర్వాత హైకోర్టు తీర్పును వాయిదా వేసింది.

ఎవరో చేసిన తప్పులకు నాటి సిఎం బాధ్యుడు కాదు

- హైకోర్టులో చంద్రబాబు ముందస్తు బెయిల్ కేసులో వాదనలు

ప్రజాశక్తి-అమరావతి

విధానపరమైన నిర్ణయాలపై న్యాయపరమైన సమీక్షకు ఆస్కారం లేదని, అలాంటి నిర్ణయాలు అమల్లో భాగంగా ఇతరులు చేసిన అవకతవకలకు నాటి సిఎం చంద్రబాబు నాయుడును బాధ్యుడిని చేయడం చెల్లదని ఆయన తరపున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ అగర్వాల్ హైకోర్టులో వాదించారు. ఎపి ఫైబర్ గ్రిడ్ కేసులో తనకు ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూ చంద్రబాబు దాఖలు చేసిన పిటిషన్‌ను బుధవారం జస్టిస్ కె సురేష్‌రెడ్డి విచారణ జరిపారు. టెరాసాఫ్ట్ సంస్థకు టెండర్‌ను ఖరారు చేసిన టెక్నికల్ కమిటీలో కానీ, టెండర్ అవార్డు కమిటీలో కానీ చంద్రబాబు సభ్యుడిగా లేరని గుర్తు చేశారు. దీనికి చెందిన ఫైళ్లన్నీ ప్రభుత్వం వద్దనే ఉన్నాయని, అవి ట్యాంపరింగ్ చేస్తారనేందుకు ఆస్కారం లేదని అగర్వాల్ చెప్పారు. టెండర్ కమిటీలో సభ్యుడిగా ఉన్న వేమూరి హరికృష్ణ ప్రసాద్ టెరాసాఫ్ట్ సంస్థ, అధికారులతో కుమ్మక్కై టెండర్‌ను టెరాసాఫ్ట్ సంస్థకు అప్పగించేలా చేశారంటూ ఎపి స్టేట్ ఫైబర్ గ్రిడ్ లిమిటెడ్ సంస్థ ఎమ్‌డి 2021 జులై 16న ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా అదే ఏడాది సెప్టెంబరు 9న సిఐడి కేసు నమోదు చేసింది. ఎఫ్‌ఐఆర్‌లో చంద్రబాబు పేరు లేదని, స్కిల్ స్కాంలో చంద్రబాబు అరెస్టు అయ్యాక ఈ కేసులో పిటిషనర్‌ను 25వ నిందితుడిగా చేర్చడం అన్యాయమని చెప్పారు. జైల్లోనే చంద్రబాబును ఉంచాలనే కుట్రతో సిఐడి ఉందన్నారు. చంద్రబాబుకు ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరారు. గురువారం సిఐడి వాదనలు కొనసాగుతాయి.

దసరాకు 5,500 బస్సు సర్వీసులు

- 13 నుంచి 26 వరకు అందుబాటులోకి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

దసరా పండగకు ముందు తర్వాత ప్రయాణాలు చేసేందుకు ఎపిఎస్‌ఆర్‌టిసి 5,500 ప్రత్యేక బస్సు సర్వీసులను ఏర్పాటుచేసింది. ఈ నెల 13 నుంచి 26 వరకు ఈ ప్రత్యేక సర్వీసులను సాధారణ ఛార్జీలతోనే ప్రయాణికుల కోసం నడపనున్నట్లు ఎపిఎస్‌ఆర్‌టిసి తెలిపింది. ఈ మేరకు బుధవారం ఎపిఎస్‌ఆర్‌టిసి ఒక ప్రకటన విడుదల చేసింది. పొరుగు రాష్ట్రాలకూ ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు పేర్కొంది. విజయవాడకు హైదరాబాద్, బెంగళూరు, చెన్నై నగరాల నుంచి ప్రత్యేక బస్సులను నడపనున్నారు. ఈ నెల 13 నుంచి 22 వరకు దసరా ముందు రోజుల్లో 2,700 బస్సుల్ని, 23 నుంచి పండగ ముగిశాక ఈ నెల 26 వరకు 2,800 బస్సుల్ని ఆర్‌టిసి నడిపేందుకు కార్యాచరణ రూపొందించింది. హైదరాబాద్ నుంచి 2,050 బస్సులు, బెంగళూరు నుంచి 440, చెన్నై నుంచి 153 బస్సులు వివిధ పట్టణాలకు నడపబడతాయి. విశాఖపట్నం నుంచి 480 బస్సులు, రాజమండ్రి నుంచి 355, విజయవాడ నుంచి 885, అలాగే రాష్ట్రంలోని ఇతర జిల్లాల నుంచి వివిధ ప్రాంతాలకు 1,137 ప్రత్యేక బస్సుల కేటాయింపుతో రద్దీని తట్టుకునేలా ఏర్పాట్లు చేస్తున్నారు. డిజిటల్ పేమెంట్స్‌తో ద్వారా టిక్కెట్లు తీసుకునే వీలు కల్పిస్తోంది. రిజర్వేషన్లకు కూడా అవకాశం ఉందని తెలిపింది. కాల్ సెంటర్ 149, 08662570005 నెంబర్లను అందుబాటులో వుంచింది.

లోకేష్‌ను 12 వరకు అరెస్టు చేయొద్దు

- హైకోర్టు

ప్రజాశక్తి-అమరావతి

స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో తనను అరెస్టు చేయకుండా సిఐడికి ఉత్తర్వులు జారీ చేయాలని కోరుతూ టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ ఈ నెల 12కు వాయిదా వేస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. అరెస్టు నుంచి రక్షణ కల్పిస్తూ ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులు పొడిగించింది.

నారాయణ కేసు నుంచి తప్పుకున్న న్యాయమూర్తి

రాజధాని అమరావతి ఇన్నర్ రింగ్‌రోడ్డు అలైన్‌మెంటు మార్పు చేసి లబ్ధి పొందారనే కేసులో ఈ నెల 4న విచారణకు హాజరుకావాలని మాజీ మంత్రి పి నారాయణకు సిఐడి ఇచ్చిన నోటీసులను హైకోర్టులో సవాల్ చేశారు. ఈ కేసు విచారణ నుంచి జస్టిస్ కె శ్రీనివాస్‌రెడ్డి తప్పుకున్నారు. మరో బెంచ్‌కు కేసును నివేదించాలని రిజిస్ట్రీకి ఆదేశించారు. మరో బెంచ్ విచారణ చేసే వరకు అంటే ఈ నెల 6 వరకు పిటిషన్ విషయంలో సిఐడి ఒత్తిడి చేయొద్దని మౌఖిక ఆదేశాలిచ్చారు.

జిగ్రామ్ జ్యూట్ మిల్లు తెరిపించాలి

- కార్మికశాఖ కమిషనరుకు సిఐటియు వినతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు మండలం జిగ్రామ్ జ్యూట్ మిల్లును గడిచిన 16 నెలలుగా యాజమాన్యం అక్రమంగా మూసివేసిందని, ఫలితంగా 1200 మంది కార్మికులు రోడ్డున పడ్డారని, వెంటనే మిల్లును తెరిపించి కార్మికులకు ఉపాధి కల్పించాలని ప్రభుత్వాన్ని సిఐటియు రాష్ట్ర అధ్యక్ష, ఉపాధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు, కె సుబ్బరావమ్మ, కోశాధికారి కెఆర్‌కె మూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం విజయవాడలో కార్మికశాఖ కమిషనరు శేషగిరిరావుకు వినతిపత్రం అందజేశారు. గడిచిన 44 రోజులుగా జ్యూట్ మిల్లు వద్ద కార్మిక జెఎసి ఆధ్వర్యంలో తెరిపించాలని దీక్షలు జరుగుతున్నాయని వినతిపత్రంలో పేర్కొన్నారు. పార్వతీపురం ఎసిఎల్ వద్ద రెండు దఫాలు చర్చలు జరిపినా యాజమాన్యం హాజరుకాలేదని, జెసిఎల్ విశాఖపట్నం వద్ద రెండు రకాల చర్చలకు యాజయాన్యం హాజరుకాలేదని తెలిపారు. ఫ్యాక్టరీని లీజుదారునికిచ్చామనే కారణంతో యాజమాన్యం కార్మికుల సమస్యల పట్ల నిర్లక్ష్యంగా ఉండటం సరికాదన్నారు. సిఐటియు ప్రతినిధుల బృందం ఇచ్చిన వినతిపత్రంపై స్పందించిన కమిషనరు మాట్లాడుతూ.. అన్ని స్థాయిల్లో లేబర్ అధికారులతో ఈ నెల 5న సమావేశం జరుపుతామని, కార్మికులకు న్యాయం చేయాడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

ప్రభుత్వ రంగంలోనే విశాఖ ఉక్కు

- సిఎంకు సిపిఐ రామకృష్ణ లేఖ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రభుత్వ రంగంలోనే ఉండేలా చూడాలని, తగిన వనరులు కేంద్రం నుంచి సకాలంలో సరఫరా జరిగేలా మోడీని కోరాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ కోరారు. ఈ మేరకు సిఎంకు రాసిన లేఖను బుధవారం మీడియాకు విడుదల చేశారు. విశాఖపట్నం ఫ్యాక్టరీని అన్ని రకాలుగా నిర్వీర్యం చేసి ప్రైవేటీకరించేందుకు కేంద్రం కుయుక్తులు పన్నుతోందని అన్నారు. ఏడాదికి 75 లక్షల టన్నుల సామర్థ్యం కలిగిన ప్రాంతంలో కేవలం 50 లక్షల టన్నులు మాత్రమే ఉత్పత్తి జరుగుతోందని, సంస్థ ఉద్యోగులకు జీతాలు చెల్లించడంలో కూడా అలసత్వం నెలకొందని పేర్కొన్నారు. నెలకు రూ.80 కోట్లు ఉద్యోగుల జీతాల చెల్లింపుల కోసం కావాల్సి ఉండగా, ప్రస్తుతం సంస్థలో నగదు నిల్వలు రూ.10 కోట్లు మాత్రమే ఉన్నాయని వివరించారు. కేంద్ర ప్రభుత్వం కుట్రపూరితంగా విశాఖ స్టీల్ ప్లాంట్‌ను నిర్వీర్యం చేస్తోందన్నారు. ఉద్యోగులకు పొమ్మనలేక పొగ పెడుతోందని తెలిపారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రిగా స్పందించి విషయాన్ని పిఎం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.

నిరుద్యోగులకు తీవ్ర ద్రోహం

(మొదటి పేజీ తరువాయి)

డిఎస్‌సి ప్రకటించాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్ స్టడీ సర్కిళ్లను అభివృద్ధి చేయడంతోపాటు ప్రతి జిల్లాలో జ్యోతిరావు పూలే స్టడీ సర్కిల్ ఏర్పాటు చేసి పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ ఇవ్వాలని కోరారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికీ ఒక స్కిల్ సెంటర్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఎంఎల్‌సి ఐ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రజల సంపదను కార్పొరేట్లకు దోచిపెడుతున్న బిజెపికి రాష్ట్రంలో వైసిపి, టిడిపి వంతపాడడం సిగ్గుచేటన్నారు. నిరుద్యోగ సమస్య పరిష్కరించని పాలక ప్రభుత్వాలపై దానినే రాజకీయ అస్త్రంగా మలచుకొని తిరగబడాలని యువతకు పిలుపునిచ్చారు.

19 తీర్మానాలు ఏకగ్రీవ ఆమోదం

సమావేశంలో డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న 19 తీర్మానాలను ప్రవేశపెట్టారు. దీన్ని సదస్సు ఏకగ్రీవంగా ఆమోదించింది. మెగా డిఎస్‌సిని 40 వేల పోస్టులు పిఇటిలతో కలిపి ప్రకటించాలని, గిరిజన ప్రాంతాల్లో ప్రత్యేక డిఎస్‌సి నిర్వహించాలని, కేంద్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న 9.64 లక్షల పోస్టులను భర్తీ చేయాలని, ఆంధ్రప్రదేశ్ నూతన యూత్ పాలసీని ప్రకటించాలని, ఐదు వేల పోస్టులతో గ్రూప్-1, 2 ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేయాలని, రాష్ట్రంలో ఐటి, సినీ పరిశ్రమలను అభివృద్ధి చేయాలని, పరిశ్రమల్లో స్థానికులకు 75 శాతం ఉద్యోగ, ఉపాధి జిఒను అమలు చేయాలని తదితర తీర్మానాలను ఆమోదించారు. ఈ సదస్సులో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు హరికిషోర్, డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు వై.రాము, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అశోక్, శ్రామిక మహిళా సంఘం నాయకులు దయా రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామిక వేత్తలకు సానుకూలం

(మొదటి పేజీ తరువాయి)

ఆయిల్ పామ్ సాగుచేస్తున్న రైతులకు ఉపయోగం. ప్రాజెక్టుల ప్రారంబోత్సవ కార్యక్రమంలో మంత్రులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి,అమర్‌నాథ్, కెవి ఉషశ్రీచరణ్, ఎపిఐఐసి ఛైర్మన్ మెట్టు గోవిందరెడ్డి, సిఎస్ డాక్టర్ కెఎస్ జవహర్‌రెడ్డి, ఉన్నతాధికారులు చిరంజీవి చౌదరి, ఎన్ యువరాజ్, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఢిల్లీకి సిఎం జగన్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండు రోజులపాటు ఢిల్లీలో పర్యటించనున్నారు. ఈ మేరకు షెడ్యూల్ ఖరారైంది. గురువారం ఉదయం పది గంటలకు తాడేపల్లి నివాసం నుంచి బయలుదేరి ఢిల్లీ వెళతారు. అక్కడే 1 జనపథ్ నివాసంలో రాత్రి బస చేస్తారు. 6న ఉదయం 9:45 గంటలకు అక్కడ్నుంచి బయలుదేరి విజ్ఞాన్ భవన్‌కు చేరుకుని వామపక్ష తీవ్రవాదంపై కేంద్రం నిర్వహించే సమీక్షా సమావేశంలో పాల్గొంటారు. అయితే సిఎం ఢిల్లీ పెద్దలను ఎవరెవరిని కలుస్తారనేది షెడ్యూల్‌లో లేదు.

సిక్కింలో ఆకస్మిక వరదలు

(మొదటి పేజీ తరువాయి)

మంది సిబ్బంది గల్లంతయ్యారని ఈస్టర్న్ కమాండ్ బుధవారం ఉదయం ప్రకటనలో వెల్లడించింది. 41 వాహనాలు నీటమునిగినట్లు తెలిపింది. గల్లంతైన సిబ్బంది కోసం గాలింపు ప్రక్రియ ముమ్మరంగా కొనసాగుతోంది. వరదలు సంభవించిన ప్రాంతంలో కమ్యూనికేషన్, ఇంటర్నెట్‌కు అంతరాయమేర్పడడంతో సహాయక చర్యలు మందకొడిగా సాగుతున్నాయి. తీస్తా నది ఉగ్రరూపం దాల్చడంతో సింగ్తమ్ ఫుట్ బ్రిడ్జ్ కుప్పకూలింది. బంగ్లాదేశ్‌లో ప్రవేశించే ముందు తీస్తా నది సిక్కిం, పశ్చిమ బెంగాల్‌లో ప్రవహిస్తుంది.

పాత కక్ష్యల నేపథ్యంలో యువకుడి హత్య

ప్రజాశక్తి-రేపల్లె

పాత కక్ష్యల నేపథ్యంలో ఓ యువకుడు దారుణ హత్యకు గురైన సంఘటన బాపట్ల జిల్లా రేపల్లె పట్టణంలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పట్టణంలోని 24 వార్డుకు చెందిన మేక రాములు, నాగమణి దంపతుల కుమారుడు సాయి (23), అతని స్నేహితుడు హర్ష మధ్య మూడు నెలల క్రితం చిన్న గొడవ జరిగింది. మంగవారం మరోసారి వీరిద్దరూ గొడవపడ్డారు. ఈ నేపథ్యంలో హర్ష మద్యం సేవించి సాయిని కత్తితో పొడిచి హత్య చేశాడు. నిందితుడి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

బిజెపి కుటిల రాజకీయాలు

- ఎపి రైతు సంఘం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కృష్ణా జలాల వినియోగంపై తెలుగు రాష్ట్రాల మధ్య తగువులు పెట్టేందుకు బిజెపి కుటిల రాజకీయాలకు పాల్పడుతోందని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కమిటీ పేర్కొంది. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వి కృష్ణయ్య, కె ప్రభాకరరెడ్డి బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తగువులు పెట్టేందుకు చూస్తోన్న నరేంద్ర మోడీ సర్కారు ప్రయత్నాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కృష్ణా నదీ జలాల పంపిణీ కోసం ఏర్పాటు చేసిన బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ తీర్పు అమల్లోకి రాకముందే కృష్ణా నదీ జలాల వినియోగంపై రెండు తెలుగు రాష్ట్రాల మధ్య తగువులు పెట్టి రాజకీయ పబ్బం గడుపుకునేందుకు కేంద్ర బిజెపి ప్రభుత్వం చూస్తోందన్నారు. తెలంగాణలో ఎన్నికల వేళ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు ఈ కుటిల యత్నాలను ప్రారంభించిందన్నారు. రెండు రాష్ట్రాల్లోని వెనుకబడిన ప్రాంతాలకు ప్రయోజనం కలిగేలా కేంద్రంపై ఒత్తిడి తెచ్చి బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ తీర్పును సాధించుకునేందుకు తెలుగు ప్రజలంతా ఐక్యంగా కృషి చేద్దామన్నారు.

మూగజీవాలపై దూసుకెళ్లిన లారీ

24 గొర్రెలు మృతి

ప్రజాశక్తి - రాయదుర్గం

అనంతపురం జిల్లా రాయదుర్గం మండలం కదరంపల్లి టోల్ ప్లాజా సమీపంలో బుధవారం తెల్లవారుజామున గొర్రెల మందపై లారీ దూసుకెళ్లింది. కదరంపల్లి టోల్‌ప్లాజా సమీపంలో ఒక్కసారిగా గొర్రెల మందపైకి లారీ దూసుకెళ్లగా.. 24 మూగజీవాలు మృత్యువాతపడ్డాయి. మృతి చెందిన జీవాల విలువ రూ.2.50 లక్షల ఉంటుందని బాధితులు తెలిపారు. రాయదుర్గం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పామాయిల్ రైతు కుదేలు!

- రూ.12,900కు పడిపోయిన టన్ను ధర
- సాగు ఖర్చులకు, ధరకు లేనిపొంతన
- కౌలు రైతుల పరిస్థితి మరింత దయనీయం
- తెల్లదోమ ప్రభావంతో దిగుబడిపై తీవ్ర ప్రభావం

పామాయిల్ తోటలు

ప్రజాశక్తి- ఏలూరు ప్రతినిధి

పామాయిల్ రైతుల పరిస్థితి అత్యంత దారుణంగా తయారైంది. పండించిన పంటకు గిట్టుబాటు ధర రాక నష్టాల ఊబిలో కూరుకుపోతున్నారు. ధర విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తోన్న తీరు పామాయిల్ రైతులను కోలుకోలేని దెబ్బతీస్తోంది. సాగు ఖర్చులకు, ధరకు పొంతన లేకపోవడంతో దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారు. ముఖ్యంగా కౌలు రైతుల పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో లక్షా ఎనిమిది వేల ఎకరాల్లో పామాయిల్ సాగవుతోంది. ఈ పంట సాగులో అత్యధికులు కౌలు రైతులే. గతేడాది అనూహ్యంగా టన్ను పామాయిల్ ధర రూ.23 వేలు పలికింది. దీంతో, ఒక్కసారిగా కౌలు ధరలు పెరిగిపోయాయి. ఎకరాకు రూ.80 వేల నుంచి రూ.లక్ష వరకూ కౌలు చేరింది. ఈ ఏడాది ఒక్కసారిగా టన్ను ధర రూ.12,900కు పడిపోయింది. ప్రసుత్తం ఇదే ధర కొనసాగుతోంది. టన్నుకు అమాంతం రూ.పది వేలు ధర తగ్గిపోవడంతో రైతులు తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారు. పామాయిల్ సాగులో ఎకరాకు ఎరువులు, కోత ఖర్చులు అన్నీ కలిపి రూ.70 వేల నుంచి రూ.80 వేల వరకూ పెట్టుబడి అవుతున్నట్లు రైతులు చెబుతున్నారు. తెల్లదోమ సోకి ఆకులు నల్లగా మారిపోవడంతో ఈ ఏడాది దిగుబడి తగ్గిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎకరాకు పది టన్నులకుపైగా రావాల్సిన దిగుబడి ఏడు నుంచి ఎనిమిది టన్నులు మాత్రమే వస్తున్నట్లు చెబుతున్నారు. ఎకరా పామాయిల్‌కు పెట్టుబడి, కౌలు కలిపితే దాదాపు రూ.1.50 లక్షలు అవుతోంది. ఏడు టన్నుల దిగుబడి వస్తే ప్రస్తుతం టన్ను ధర రూ.12,900 చొప్పున లెక్కిస్తే రూ.90,300 వరకూ వస్తోంది. ఎనిమిది టన్నుల దిగుబడి వచ్చినా రూ.లక్షా మూడు వేల వరకూ మాత్రమే ఆదాయం రానుంది. దీంతో, కౌలు రైతులు ఎకరాకు రూ.50 వేలు వరకూ నష్టపోతున్నారు. ఐదెకరాలు, పదెకరాలు కౌలుకు తీసుకున్న రైతులు రూ.లక్షల్లో అప్పుల పాలై దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారు.

తీవ్రంగా నష్టపోతున్నాం

ఐదెకరాల్లో పామాయిల్ సాగు చేశాను. సరాసరి ఎకరాకు రూ.ఎనిమిది టన్నుల దిగుబడి వచ్చింది. ఎరువుల నుంచి అన్నీ ధరలూ విపరీతంగా పెరగడంతో పెట్టుబడి భారీగా అయింది. ప్రస్తుత ధర వల్ల కనీసం సాగు ఖర్చులు కూడా రావడం లేదు. కౌలు రైతుల పరిస్థితి దారుణంగా మారింది.

-బిక్కిన వీరసత్యం, పాములవారిగూడెం, జీలుగుమిల్లి మండలం

దిగుబడి లేదు... ధరా లేదు

12 ఎకరాల్లో పామాయిల్ సాగు చేశాను. ఎకరాకు పది టన్నుల దిగుబడి రావాల్సి ఉండగా తెల్లదోమ కారణంగా ఏడు నుంచి ఎనిమిది టన్నులు మాత్రమే వచ్చింది. అన్ని ఖర్చులతో కలిపి ఎకరాకు రూ.70 వేలకుపైగా పెట్టుబడి అవుతోంది. దిగుబడి, ధర తగ్గిపోవడం తీవ్రంగా దెబ్బతీసింది.

-కె.చంద్రశేఖర్‌రెడ్డి, ప్రగడవరం గ్రామం, చింతలపూడి మండలం

టన్నుకు కనీసం రూ.18 వేలు ఇవ్వాలి

పామాయిల్ పంటకు మద్దతు ధరను కేంద్రం ముందుగానే ప్రకటించాలి. స్వామినాథన్ కమిటీ సిఫార్సులకు అనుగుణంగా ధర ఉండాలి. ఆయిల్ రికవరీ శాతం ఆధారంగా నిర్ణయిస్తున్న ధర అశాస్త్రీయంగా ఉంది. పెదవేగి ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీని నిర్లక్ష్యం చేయడం తగదు. ఈ ఫ్యాక్టరీని ఆధునీకరించాలి. పామాయిల్‌కు కనీస మద్దతు ధర టన్నుకు రూ.18 వేలు ఉండాలి.

-కె.శ్రీనివాస్, ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి

తల్లి ఒడికి చేరిన శిశువు

- శిశువు అపహరణ కేసును ఛేదించిన పోలీసులు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

శిశువును తల్లికి అప్పగిస్తున్న ఎఎస్‌పి సుప్రజ

గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జిజిహెచ్)లో మంగళవారం అపహరణకు గురైన శిశువును పల్నాడు జిల్లా నరసరావుపేట మండలం ఉప్పలపాడులో పోలీసులు బుధవారం గుర్తించారు. నిందితురాలు కంబాల లక్ష్మి నుంచి శిశువును స్వాధీనం చేసుకుని తల్లి షేక్ రోష్నికి జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్ సమక్షంలో అదనపు ఎస్‌పి సుప్రజ అప్పగించారు. ఈ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కొత్తపేట పోలీసులు నాలుగు బృందాలతో జల్లెడ పట్టారు. అపహరించిన మహిళను ఉప్పలపాడుకు చెందిన కంబాల లక్ష్మిగా గుర్తించారు. ఉప్పలపాడులో వలంటీరు ద్వారా వచ్చిన సమాచారంతో పోలీసులు నిందితురాలి వివరాలను సేకరించి అదుపులోకి తీసుకున్నారు. పిల్లలులేని దంపతుల కోరిక మేరకు లక్ష్మీ గుంటూరు నుంచి శిశువును అపహరించి తీసుకెళ్లినట్టు పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది. ఆమె సొమ్ము కోసం శిశువును అపహరించిందా? సాయం చేయాలనే ఆలోచన ఉందా? అనే అంశాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. నిందితురాలు కంబాల లక్ష్మీతోపాటు పిల్లలు లేని దంపతులనూ పోలీసులు విచారిస్తున్నారు. కొత్తపేట సిఐ అన్వర్‌బాషా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కార్మిక నేత నారు కృష్ణయ్య మృతి

- సిపిఎం, సిఐటియు సంతాపం

ప్రజాశక్తి- నెల్లూరు ప్రతినిధి



కృష్ణయ్య (ఫైల్ ఫొటో)

సిఐటియు సీనియర్ నాయకులు నారు కృష్ణయ్య (76) బుధవారం తిరుపతిలోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో ఆయన బాధపడుతున్నారు. కృష్ణయ్యకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. విడవలూరు మండలం చౌకచర్ల ఆయన స్వగ్రామం. సుదీర్ఘంగా సిపిఎం, సిఐటియులో వివిధ బాధ్యతలలో పనిచేశారు. స్పిన్నింగ్ మిల్లులో కార్మికునిగా పనిచేస్తూ సిఐటియులోకి వచ్చారు. అక్కడ యూనియన్ నిర్వహణలో ప్రముఖ పాత్ర పోషించారు. లారీ వర్కర్స్ యూనియన్‌తోపాటు, సిఐటియులో అనేక సంఘాల బాధ్యతలు నిర్వహించారు. పార్టీ అభివృద్ధికి కృషి చేశారు. జిల్లాలో జరిగిన అనేక కార్మిక ఉద్యమాలు, ప్రజా ఉద్యమాల్లో కీలకంగా వ్యవహరించారు. కృష్ణయ్య మృతికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, పూర్వ కార్యదర్శి పి.మధు, జిల్లా కార్యదర్శి మూలం రమేష్, సిపిఎం సీనియర్ నాయకులు చంద్ర రాజగోపాల్, సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టివివి ప్రసాద్, కె.అజయ్‌కుమార్ తదితరులు సంతాపం తెలిపారు. ఆయన కుటుంబానికి సానుభూతి తెలియజేశారు. గురువారం మధ్యాహ్నం నెల్లూరు బాలాజీ నగర్‌లోని ఆయన స్వగృహం నుంచి అంతిమయాత్ర జరగనుందని కుటుంబ సభ్యులు తెలిపారు.

కర్నూలు కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న నాయకులు

పత్రికా స్వేచ్ఛను హరిస్తున్న మోడీ సర్కార్

- న్యూస్‌క్లిక్‌పై దాడులకు నిరసనగా పలుచోట్ల ఆందోళనలు

ప్రజాశక్తి- యంత్రాంగం

స్వతంత్ర మీడియా సంస్థ న్యూస్‌క్లిక్ కార్యాలయంపైన, సిబ్బంది ఇళ్లపైన కేంద్ర ప్రభుత్వ దాడిని నిరసిస్తూ విశాఖ, కర్నూలు, పశ్చిమగోదావరిలో నిరసన తెలిపారు. న్యూస్ క్లిక్ ఎడిటర్, హెచ్‌ఆర్ విభాగం అధిపతిని అరెస్టు చేయడాన్ని పలువురు నేతలు ఖండించారు.

పశ్చిమగోదావరి జిల్లా కేంద్రం భీమవరంలో సిపిఎం జిల్లా కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం మాట్లాడుతూ.. స్వాతంత్ర భారతదేశ చరిత్రలోనే ఈ ఫాసిస్టు తరహా దాడిని ఇప్పటి వరకూ చూడలేదన్నారు. ఢిల్లీలో కొన్ని న్యూస్ ఛానల్స్, పత్రికా కార్యాలయాలపై సిబిఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడులు అత్యంత దుర్మార్గమన్నారు. కొంతమందిని అరెస్టు చేసి కోర్టులో ప్రవేశపెట్టారని తెలిపారు. మరికొంతమందిని కోర్టులో ప్రవేశపెట్టలేదని అన్నారు. ప్రతిపక్షాలపైన, ప్రజాస్వామికవాదులు, మేధావులు, అభ్యుదయవాదులపైన అప్రజాస్వామికంగా మోడీ, అమిత్ షా దాడులు చేయడం దారుణమన్నారు.

కర్నూలు కలెక్టరేట్ ఎదుట గాంధీ విగ్రహం సమీపంలో ప్రజాసంఘాలు, న్యాయవాదులు నల్లజెండాలతో నిరసన తెలిపారు. ఎపిడబ్ల్యుజెఎఫ్ సంఘీభావం తెలిపింది. సిఐటియు నగర నాయకులు టి.రాముడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఐలు రాష్ట్ర నాయకులు కేంగార కుమార్, డి.వెంకటస్వామి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కెవి. నారాయణ, కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.ఆనంద్‌బాబు, ఆవాజ్ కమిటీ నాయకులు ఎస్‌ఎండి షరీఫ్, ఎపిడబ్ల్యుజెఎఫ్ నగర ప్రధాన కార్యదర్శి నాగేంద్ర మాట్లాడారు. బిజెపి ప్రభుత్వ హయాంలో బిబిసి, న్యూస్ లాండ్రీ, దైనిక్‌భాస్కర్, భారత్ సమాచార్, ది కాశ్మీర్ వాలా , ది వైర్ వంటి మీడియా సంస్థలను అణచివేయడానికి, వేధించడానికి, భయపెట్టడానికి దర్యాప్తు సంస్థలను ఉపయోగిస్తోందని విమర్శించారు. ఉపా చట్టం కింద వివిధ సెక్షన్లతో దాడులు చేస్తోందన్నారు. విశాఖలోని కూర్మన్నపాలెం స్టీల్ ప్లాంట్ ఆర్చి వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రజాశక్తి ఆధ్వర్యాన నిరసన కార్యక్రమం చేపట్టారు. ఎపిడబ్లుజెఎఫ్ నాయకులు ఎన్. మధుసూదనరావు, జి.కాంతారావు, కె.అప్పలనాయుడు, ఎం. వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

స్వేచ్ఛకు సంకెళ్ల సిగ్గు సిగ్గు, మీడియాపై దాడి హేయం అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. అనకాపల్లి ఆర్‌టిసి కాంప్లెక్స్ కూడలిలో సిఐటియు ఆధ్వర్యాన నిరసన తెలిపారు. బిజెపి హయాంలో మీడియాపై దాడులు పెరిగాయని, అక్రమ కేసులు బనాయిస్తున్నారని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.శంకరరావు ఈ సందర్భంగా ఆందోళన వ్యక్తం చేశారు.

చంద్రబాబు అరెస్టు వెనుక బిజెపి హస్తం

మాజీ ఎంపి హర్షకుమార్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

స్కిల్ స్కామ్ పేరుతో మాజీ సిఎం చంద్రబాబునాయుడు అరెస్టు వెనుక కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం హస్తం ఉందని మాజీ ఎంపి జివి హర్షకుమార్ అన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో బుధవారం నారా భువనేశ్వరిని ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం మీడియాతో హర్షకుమార్ మాట్లాడుతూ జైల్లో ఉన్న చంద్రబాబు ఆరోగ్యానికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నానని చెప్పారు. బాబు కుటుంబ సభ్యులంతా ఎంతో ధైర్యంగా ఉన్నారని తెలిపారు. చంద్రబాబు ఎటువంటి తప్పు చేయలేదన్న ఆత్మవిశ్వాసమే వారి ధైర్యానికి కారణమన్నారు. త్వరలోనే చంద్రబాబు జైలు నుంచి బయటకు వస్తారనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే బాబును అరెస్టు చేశారని, దీని వెనుక బిజెపి హస్తం పక్కాగా ఉందనడానికి ఇన్ని రోజులు చంద్రబాబు జైల్లో ఉండడమే నిదర్శనమన్నారు.

న్యూస్‌క్లిక్‌పై దాడులు ఆందోళనకరం

ఐరాస మానవ హక్కుల కమిషనర్

జెనీవా: భారతదేశంలో మీడియా స్వేచ్ఛపై జరుగుతున్న దాడి , జర్నలిస్టుల నిర్బంధం పట్ల ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల కమిషనర్ కార్యాలయం బుధవారం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. "దాడులు, అరెస్టులు , నిర్బంధాలు, జప్తులు జరుగుతున్నట్లు వచ్చిన వార్తలు మమ్మల్ని ఎంతగానో బాధించాయని ఐరాస మానవ హక్కుల కమిషనర్ పేర్కొన్నారు. మంగళవారం న్యూస్‌క్లిక్‌పై జరిగిన దాడులపై స్పందిస్తూ జర్నలిస్టుల భావ ప్రకటనా స్వేచ్ఛను గౌరవించాలని, వైర్‌తో ఆయన అన్నారు. న్యూస్‌క్లిక్‌లో పని చేస్తున్న అనేక మంది వ్యక్తులను నిర్బంధించడం దిగ్భ్రాంతిని కలిగించిందని జెనీవాలోని మీడియా విశ్లేషకులొకరు తెలిపారు.

ఈ సమయంలో పోలీసులు డజన్ల కొద్దీ జర్నలిస్టుల ఇ-ఎలక్ట్రానిక్ పరికరాలను - ల్యాప్‌టాప్‌లు , టెలిఫోన్‌లను స్వాధీనం చేసుకోవడం భారతదేశంలో సర్వసాధారణంగా అనిపించింది. పైగా, జర్నలిస్టులను టెర్రరిస్టులుగా పరిగణించడం వంటి ఆరోపించిన క్రూరమైన %ఖూరూారా% కింద వారిపై అభియోగాలు మోపడం, "ప్రజాస్వామ్యానికి తల్లి" అని గర్వించుకునే భారతదేశానికి శ్రేయస్కరం కాదని విశ్లేషకులు వ్యాఖ్యానించారు.

అలిపిరి వద్ద విశ్రాంతి మండపం పునర్నిర్మాణం

- రూ.1.36 కోట్లతో త్వరలో పనులు ప్రారంభం : టిటిడి ఇఒ

ప్రజాశక్తి- తిరుమల

తిరుమల నడక మార్గంలో అలిపిరి పాదాల మండపం వద్ద యాత్రికులు విశ్రాంతి తీసుకునే పురాతన రాతి మండపం శిధిలావస్థకు చేరుకున్నదని, త్వరలో పునర్నిర్మించనున్నట్లు టిటిడి ఇఒ ఎవి ధర్మారెడ్డి చెప్పారు. మండపాన్ని పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రెండు రాతి మండపాలను 16వ శతాబ్దంలో అప్పటి రాజులు నిర్మించినట్లు తెలి పారు. ఈ మండపాలలో ఒకటి శిథిలావస్థకు చేరుకున్నదని ఇంజనీరింగ్ విభాగం వారు ఇచ్చిన నివేదికననుసరించి పునర్నిర్మించాలని టిటిడి నిర్ణయించిందన్నారు. రూ.1.36 కోట్లతో త్వరలో ఈ రాతి మండపం పునర్నిర్మాణ పనులు ప్రారంభించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జెఇఒ, సిఇ నాగేశ్వరరావు, ఎస్ఇ-2 జగదీశ్వర్‌రెడ్డి, ఇఇ ప్రసాద్, డిప్యూటీ ఇఇ ప్రకాష్ బాబు, ఎఇ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరులో టిడిపి నేతల నిర్బంధం

శాంతియుత ర్యాలీకి అడుగడుగునా అడ్డంకులు

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

టిడిపి అధినేత చంద్రబాబునాయుడు అరెస్ట్‌ను నిరసిస్తూ నెల్లూరులో టిడిపి, సిపిఐ, జనసేన పార్టీ శ్రేణులు చేపట్టిన ర్యాలీకి పోలీసులు అడుగడుగునా అడ్డంకులు సృష్టించారు. ర్యాలీలో పాల్గొనకుండా టిడిపి ముఖ్య నేతలను గృహనిర్బంధం చేశారు. నగరంలో 144 సెక్షన్ అమలులో ఉన్నందున ర్యాలీకి అనుమతి లేదంటూ హెచ్చరికలు జారీ చేశారు. శాంతియుతంగా నిరసన తెలిపేందుకు వెళ్తున్న తమను అడ్డుకోవడం ఏమిటని నాయకులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. పోలీసుల ఆంక్షలను దాటుకుని టిడిపి నేతలు ర్యాలీలో పాల్గొన్నారు. 'బాబుకు తోడుగా మేము' అంటూ నెల్లూరులో విఆర్‌సి కూడలి నుంచి గాంధీబొమ్మ వరకు బుధవారం శాంతియుత ర్యాలీ చేపట్టారు.

కెనరా బ్యాంక్ Canara Bank (భారత ప్రభుత్వరంగ సంస్థ) సిండికేట్ Syndicate A Government of India Undertaking

బకింగ్‌హామ్‌పేట బ్రాంచ్ (13341)
విజయవాడ, ఎన్.టి.ఆర్. జిల్లా-520002.
0866-2574718, 9440905153

ఋణగ్రహీత/హామీదారు/తనఖాదారులకు డిమాండ్ నోటీసు

టు:
1. శ్రీ పొల్లా ఆంజనేయులు, తండ్రి: పొల్లా పిచ్చయ్య, 1-21, రామాలయం దగ్గర, పెద్ద అగ్రహారం, పిడుగురాళ్ల, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్ - 522437.
2. శ్రీమతి పొల్లా సంధ్య, భర్త: పి. ఆంజనేయులు, 1-21, రామాలయం దగ్గర, పెద్ద అగ్రహారం, పిడుగురాళ్ల, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్ - 522437.

డియర్ సర్/మేడమ్,

విషయం: సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 లోని సెక్షన్ 13(2) ప్రకారం డిమాండ్ నోటీసు.

మా కెనరా బ్యాంక్, బకింగ్‌హామ్‌పేట బ్రాంచ్ నుండి శ్రీ పొల్లా ఆంజనేయులు మరియు శ్రీమతి పొల్లా సంధ్య పొందిన లోన్/ఋణసౌకర్యాల వివరములు:

లోన్ స్వభావం & అకౌంట్ నెం.	లోన్ మొత్తం మరియు లోన్ తేది	బకాయి మొత్తం	వడ్డీ రేటు
హౌసింగ్ లోన్ అకౌంట్ నెం. 16000020713	రూ. 21,00,000/- తేది: 20.02.2021	రూ. 18,93,697.86	9.50%

మాకు తనఖా పెట్టిన వ్యక్తి / వ్యక్తులచే వ్రాసి ఇవ్వబడిన సంబంధిత డాక్యుమెంట్ల ద్వారా ఈ నోటీసును షెడ్యూలులో వివరించిన ఆస్తుల తనఖా ద్వారా పైన తెలిపిన ఋణాలు / ఋణసౌకర్యాలకు తగు విధంగా హామీ కల్పించబడినది. పేర్కొన్న నియమ నిబంధనల ప్రకారం తమ ఋణాలను చెల్లించడంలో పైన తెలిపిన మీరు విఫలమైనందున బ్యాంక్ **సదరు ఋణాన్ని తేది 17.09.2023 న నిరర్ధక ఆస్తి (ఎన్.పి.ఎ) గా వర్గీకరించింది.** అందువలన ఈ నోటీసు తేది నుండి 60 రోజులలోగా **రూ.18,93,697.86 (అక్షరాల పద్దెనిమిది లక్షల తొంభై మూడు వేల ఆరు వందల తొంభై ఏడు రూపాయలు మరియు ఎనభై ఆరు పైసలు)** + తదుపరి వడ్డీ, ఖర్చులు కలిపి మొత్తమును చెల్లించవలసిందిగా కోరుతూ సంబంధిత చట్టంలోని సెక్షన్ 13(2) క్రింద మీకు ఇందుమూలముగా ఈ నోటీసు జారీ చేయుచున్నాము. చెల్లించడంలో విఫలమైతే సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద అన్ని లేదా ఏవేని హక్కును మేము వినియోగించుకుంటాము. ఇంతే కాకుండా మా ముందస్తు సమ్మతి లేకుండా ఏ విధంగానూ షెడ్యూలులో తెలిపిన ఏ సెక్యూర్డ్ ఆస్తులతో ఏ రకంగానూ వ్యవహరించకుండా మీరు నిరోధింపబడుచున్నారు. సదరు చట్టం మరియు/ లేదా అమలులో ఉన్న చట్టం క్రింద లభించే ఏవేని ఇతర హక్కుకు ఎటువంటి ప్రతికూల అభిప్రాయం లేకుండా ఈ నోటీసు ఇవ్వబడింది.

SARFAESI చట్టం నందలి సెక్షన్ 13, సబ్ సెక్షన్ (8) ప్రకారము మీరు తనఖా ఆస్తులను విడిపించుకోవటానికి ఉన్న కాలవ్యవధిని వినియోగించుకోగలరని సూచించడమైనది. మా బ్రాంచ్ రికార్డులో అందుబాటులో ఉన్న మీ చిరునామాకు తిరుగు రశీదుతో కూడిన రిజిస్టర్డ్ పోస్టు ద్వారా డిమాండ్ నోటీసు పంపించడం జరిగింది.

తనఖా / తాకట్టు వుంచిన ఆస్తి యొక్క నిర్దిష్ట వివరాలు దిగువ పేర్కొనబడినవి

ఎన్‌టిఆర్ జిల్లా, పటమట సబ్-రిజిస్ట్రీ, పెనమలూరు మండలం, కానూరు మున్సిపాలిటీ, ఆర్.ఎస్. నెం. 2/8, మొత్తం 344.66 చ॥గ॥ లేదా 288.17 చ॥మీ॥ల విస్తీర్ణంలో అనిర్దేశపు మరియు అవిభాజ్యపు వాటా 35 చ॥గ॥ లేదా 29.26 చ॥మీ॥ స్థలం. హద్దులు: తూర్పు: 33' వెడల్పు పంచాయితీ బజారు, దక్షిణం: వివిఎస్ మల్లిఖార్జునరావు ఆస్తి, పడమర: బి వెంకటేశ్వరరావు మరియు ఇతరుల ఆస్తి, ఉత్తరం: వి. రత్తమ్మ ఆస్తి.

పైన తెలిపిన స్థలంలో నిర్మించిన అపార్ట్‌మెంట్ "లక్ష్మి రెసిడెన్సీ", గ్రౌండ్ ఫ్లోర్‌లో ప్లింత్ ఏరియా 912 చ॥అ॥ (ఉమ్మడి ఏరియాలు కలుపుకొని), 40 చ॥అ॥ పార్కింగ్ ఏరియా కలిగిన **ఫ్లాట్ నెం. జిఎఫ్-1. హద్దులు:** తూర్పు: పార్కింగ్, దక్షిణం: వివిఎస్ మల్లిఖార్జునరావు ఆస్తి, పడమర: బి వెంకటేశ్వరరావు మరియు ఇతరుల ఆస్తి, ఉత్తరం: వి. రత్తమ్మ ఆస్తి.

తేది: 19.09.2023, ప్రదేశం: విజయవాడ — సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

TATA **టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్**
సంప్రదించాల్సిన చిరునామా: 11వ అంతస్తు, టవర్ ఎ, పెనిన్సుల బిజినెస్ పార్క్, గణపత్‌రావు కదం మార్గ్, లోయర్ పారెల్, ముంబాయి 400013 సంప్రదించల్సిన నం. (022) 66069383.

డిమాండ్ నోటీసు

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 ("రూల్స్") యొక్క రూల్ 3తో చదువుతూ సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 ("యాక్ట్") యొక్క సెక్షన్ 13(2) క్రింద.

ఏ దైతే టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (టిసిహెచ్‌ఎఫ్‌ఎల్) యొక్క ఆధీకృత అధికారి అయిన దిగువ సంతకందారుదు రూల్ 3తో చదువుతూ చట్టం యొక్క సెక్షన్ 13(12) క్రింద అధికారాలను అధ్యయనం చేస్తూ సెక్షన్ 13(2) క్రింద దిగువ పేర్కొన్న తేదీలలో ఇప్పటికే వివరణాత్మక డిమాండ్ నోటీసు జారీ చేయబడింది. పిలువబడిన రుణగ్రహిత(లు)/సహ-రుణగ్రహీతల(లు)/హామీదారు(లు) (మొత్తం ఒక్కరు లేదా అందరితో కలిపి "అబ్లిగర్స్"గా సూచిస్తారు)/చట్టబద్ధవారసు(లు)/చట్టబద్ధప్రతినిధు(లు) జాబితా దిగువ ఇవ్వడమైనది, సంబంధిత డిమాండ్ నోటీసులో పేర్కొన్న మొత్తం చెల్లించుటకు, పేర్కొన్న నోటీసు యొక్క తేది నుండి 60 రోజులలోగా, వివరాల ప్రకారం దిగువ ఇవ్వడమైనది. సదరు నోటీసుల కాపీలు రిజిస్టర్డ్ పోస్ట్ ఎ.డి. ద్వారా పంపించడం జరిగింది మరియు దిగువసంతకందారుడుతో అందుబాటులో ఉంటుంది మరియు సదరు బాండ్ రాసి ఇచ్చినవారసు(లు)/చట్టబద్ధవారసుడు(లు)/చట్టబద్ధ ప్రతినిధి(లు), కాబట్టి వారి కోరిక మేరకు, సాధారణ కార్యాలయ వేళలో దిగువ సంతకందారుడి నుండి సంబంధిత కాపీని పొందవచ్చు.

పైదానికి అనుసందానంగా, ఇక్కడ నోటీసు ఇవ్వడమేమనగా, మరొక సారి, సదరు బాండ్ రాసి ఇచ్చినవారు(లు)/చట్టబద్ధవారసుడు(లు)/చట్టబద్ధ ప్రతినిధి(లు) లోను అగ్రిమెంట్ మరియు ఇతర డాక్యుమెంట్‌లు/వ్రాతపూర్వాకాలు చదువుతూ, చెల్లింపులు మరియు/లేదా తెలుసుకున్న తేది నుండి దిగువ కాలమ్ (డి) లో పేర్కొన్న సంబంధిత తేది నుండి దిగువ వివరించిన వడ్డీతో కలుపుకొని సంబందిత పేర్లకు ఎదురుగా దిగువ గుర్తించిన మొత్తాన్ని సంబంధిత నోటీసు/లు తేది నుండి 60 రోజులలోగా టిసిహెచ్‌ఎఫ్‌ఎల్‌కు చెల్లించవలెను, ఒకవేళ, సదరు లోన్ అగ్రిమెంట్ మరియు ఇతర డాక్యుమెంట్లు రాసి ఇచ్చినవారు(లు) ద్వారా అమలు జరిగినట్లయితే లోను తిరిగిచెల్లించుటకు బకాయిల కొరకు సెక్యూరిటీగా ఉంచబడింది, సదరు బాండ్ రాసి ఇచ్చినవారు(లు) చే టిసిహెచ్‌ఎఫ్‌ఎల్‌కు దిగువ సెక్యూర్డ్ ఆస్తు(లు)

క్ర. సం	లోన్ అకౌంట్ నం.	ఆబ్లిగేటర్ (లు)/ చట్టబద్ధ వారసు(లు)/చట్టబద్ధ ప్రతినిధు(లు) పేరు	దిగువ తేదీ ప్రకారం ఉన్న మొత్తం బకాయిలు (రూ)	డిమాండ్ నోటీసు తేది మరియు ఎన్‌పిఎ తేది
1.	9834981	దొడ్డాక నాగ వీరేంద్ర (రుణగ్రహీత) దొడ్డాక శివనాగ మల్లేశ్వరి (సహ రుణగ్రహీత) దొడ్డాక శ్రీనివాసరావు (సహ రుణగ్రహీత)	28.09.2023 నాటికి మొత్తం రూ.28,19,787/- (ఇరవై ఎనిమిది లక్షల పంతొమ్మిది వేల ఏడు వందల ఎనభై ఏడు రూపాయలు మాత్రమే)	28.09.2023 & 07.09.2023

స్థిరాస్తి షెడ్యూల్ : గుంటూరు జిల్లా, తెనాలి రెవెన్యూ జిల్లా ఏరియా, తెనాలి మున్సిపల్ ఎక్స్‌టెంషన్ ఏరియా, తెనాలి గ్రామం వద్ద ఉన్న మొత్తం ఆ ముక్క మరియు పార్శిల్ సైట్ విస్తీర్ణం 168.0 చ.గ.లు. లేదా 140.45 చ.మీ.లు. మొత్తం నుండి బయటకు ఎసి. 0.77 సెంట్లు. తో అందులో డో.నం.162-2లో నిర్మాణాలు, మింజువాలె డో.నం.31-1-4 వద్ద (వార్డు నం.1, డో.నం.13-1-4 వద్ద, సుల్తానాబాద్ ప్లాన్ ప్రకారం) **శ్రీ.దొడ్డాక నాగ వీరేంద్ర** పేరు మీద ఉన్న వైడ్ రిజిస్ట్రార్డ్ సేల్ డీడ్ నం.505/2017 మరియు **క్రింది విధమైన హద్దులు : సరిహద్దులు : తూర్పు:** ఏలూరు రమాదేవి ఇతరులకు అమ్మినది 48.0 అ.లు., **దక్షిణం:** దాసరి కృష్ణారావు స్థలం 31.6 అ.లు., **పడమర:** గద్దం చంద్రారావు స్థలం 48.0 అ.లు., **ఉత్తరం:** 21.0 అ.లు. ఉమ్మడి బజార్ 31.6 అ.లు.

*తదుపరి వడ్డీతో, అదనంగా వడ్డీ సంబంధిత డిమాండ్ నోటీసులో తెలిపిన మరింత ప్రత్యేకంగా వివరించిన రేటు వద్ద, అదనపు వ్యయాలు, ఖర్చులు, చార్జీలు వగైర చెల్లించవలసిన మరియు/లేదా తెలిపినమేర తేదివరకు అనుభవించినవి. ముందు చెప్పి టిసిహెచ్‌ఎఫ్‌ఎల్‌కు చెల్లించుటకు బాండ్ రాసి ఇచ్చినవారసు(లు) విఫలంచెందినట్లయితే, సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద పై సెక్యూర్డ్ అస్సెట్(లు)/స్థిరాస్తు(లు) ఎదురుగా టిసిహెచ్‌ఎఫ్‌ఎల్ తదుపరి చర్యలు సిద్ధమవుతుంది మరియు ఖర్చులు మరియు తదుపరి పర్యావసనాలకు బాండ్ రాసి ఇచ్చినవారసు(లు)/చట్టబద్ధవారసు(లు)/చట్టబద్ధప్రతినిధు(లు) వర్తించే నియమాలకు మొత్తం బాధ్యత వహిస్తారు. బాండ్ రాసి ఇచ్చినవారసు(లు)/చట్టబద్ధవారసు(లు)/చట్టబద్ధప్రతినిధు(లు) టిసిహెచ్‌ఎఫ్‌ఎల్ వారి ముందస్తు అనుమతి లేకుండా ఏవిధంగాను అమ్ముట, విక్రయించుట లేదా ఇతర ఏ రకంగాను ముందు చెప్పిన సెక్యూర్డ్ అస్సెట్(లు)/స్థిరాస్తు(లు) బదిలీ చేయడం చట్టం క్రింద నిషేధించబడింది. చట్టం యొక్క నిబంధనలను లేదా దానిపై చేసిన నిబంధనలను ఉల్లంఘించే లేదా ప్రోత్సహించే ఏ వ్యక్తి అయినా చట్టం ప్రకారం అందించిన విధంగా జైలు శిక్ష మరియు/లేదా జరిమానా విధించబడతాయి.

తేది: 05.10.2023 ప్రదేశం: గుంటూరు — సం/- అధీకృత అధికారి, టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

JM FINANCIAL
జెఎమ్ ఫైనాన్షియల్ అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్
కార్పొరేట్ గుర్తింపు నంబర్ : U67190MH2007PLC74287
నమోదిత కార్యాలయం :7వ అంతస్తు, సినర్జీ, అప్పాసాహెబ్ మారతె మార్గ్, ప్రభాదేవి, ముంబై-400025
టెలి : +91 22 6630 3030, ఫ్యాక్స్ : +911 22 6630 3223, www.jmfinancialarc.com

డిమాండ్ నోటీసు

సెక్యూరిటి ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నియమాలు, 2002 యొక్క రూల్ 3(1)తో చదువుతూ సెక్యూరిటిజేషన్ అండ్ రికన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటి ఇంటరెస్ట్ యాక్ట్, 2002 యొక్క సెక్షన్ 13(2) క్రింద దిగువ సంతకందారుదు పిరమల్ క్యాపిటల్ అండ్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ [గతంలో దివాన్ హౌసింగ్ అండ్ ఫైనాన్స్ కార్పోరేషన్ లిమిటెడ్] యొక్క ఆధీకృత అధికారి సెక్యూరిటిజైషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అఫ్ సెక్యూరిటి ఇంటరెస్ట్ యాక్ట్, 2002 ("సర్ఫేసీ యాక్ట్") యొక్క సెక్షన్ 5(1) (బి) క్రింద జెఎమ్‌ఎఫ్‌ఎఆర్‌సి (జెఎమ్) (ఇకపై అసైనీగా పేర్కొనబడుతుంది) కి అనుకూలంగా వైడ్ అస్పైన్‌మెంట్ అగ్రిమెంట్ తేది 29 మార్చి, 2023 ("అస్పైన్‌మెంట్ అగ్రిమెంట్") అన్నీ హక్కులు, టైటిల్ మరియు వడ్డీతో పాటుగా సృష్టించబడిన అంతర్లీన సెక్యూరిటీ ఇంట్రస్ట్ ఒక పూల్ రుణాన్ని కేటాయించారు. (జెఎమ్) అసైనీ యొక్క అధీకృత అధికారి అయిన దిగువసంతకందారు సెక్యూరిటిజైషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అఫ్ సెక్యూరిటి ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద సెక్యూరిటి ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 రూల్ 3తో చదువుతు చెప్పిన చట్టం యొక్క సెక్షన్ 13(12) క్రింద సదరు అధికారాలను వినియోగించుకుంటూ ఆధీకృత అధికారి చెప్పిన చట్టం సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటిసులు జారీ చేయడమైనది, పిలువబడిన రుణగ్రహీత/లు ("పేర్కొన్న రుణగ్రహీత(లు)"), ఇక్కడ పేర్కొనబడిన మొత్తాన్ని చెల్లించుటకు పిలుస్తూ డిమాండ్ నోటీసు/లు జారీ చేయడమైనది. పై దానికి అనుసంధానంగా, ఈ నోటీసు ప్రచురణ వెలువడిన 60 రోజులలోగా చెల్లించవలెనని రుణగ్రహీతకు చెప్తూ మరొక సారి నోటీసు ఇక్కడ ఇవ్వడమైనది, మొత్తం రూపాయలతో పాటు తదుపరి వడ్డీ దిగువ పేర్కొనబడినవి, చెల్లింపు మరియు/లేదా రియలైజేషన్ తేది వరకు తేదిలు దిగువ పేర్కొనబడినవి, రుణగ్రహీతలు చెప్పిన అన్నింటిని అమలు చేయుటకు ఇతర డాక్యుమెంట్‌లు/వ్రాతలతో చదువుతూ లోను అగ్రిమెంట్ క్రింద చెల్లించవలెనని, అంగీకరించడమైనది. లోను తిరిగి చెల్లించుటకు సెక్యూరిటీగా పెట్టినవి, సదరు రుణగ్రహీత(లు) జెఎమ్‌కు తాకట్టుపెట్టిన ఆస్తులు దిగువ ఇవ్వడమైనది.

రుణగ్రహీత(లు)/హామీదారు(లు) పేరు	డిమాండ్ నోటీసు తేది మరియు ఎన్‌పిఎ తేదితో మొత్తం	సెక్యూర్డ్ అస్సెట్ వివరణ (స్థిరాస్తి)
(విజయవాడ శాఖ యొక్క ఎల్‌సి నెం. 02400006252)అశోక నందిపాటి (రుణగ్రహీత), సూర్య నారాయణ దొర్నాల (సహ-రుణగ్రహీత1)	29.08.2023 / రూ.13,56,710/- (పదమూడు లక్షల యాభై ఆరు వేల ఏడు వందల పది రూపాయలు మాత్రమే) ఎన్‌పిఎ (08.01.2023)	డో.నం.8-48బి/2, ఫ్లాట్ 102, గ్రౌండ్ ఫ్లోర్, వెంకటేశ్వర హైట్స్, పాత కరెంట్ ఆఫీసు రోడ్డు, శ్రీ విద్యా స్కూల్ వద్ద, రైతుపేట, నందిగామ కృష్ణ ఆంధ్రప్రదేశ్-521185

సదరు రుణగ్రహీతలు జెఎమ్‌కు మొత్తాన్ని చెల్లించలేకపోతే, జెఎమ్ వారి ద్వారా సెక్షన్ 13(4) చట్టం క్రింద పై సెక్యూర్డ్ అసెట్స్ వ్యతిరేకంగా చర్యలు తీసుకొనబడుతాయి మరియు వర్తింపబడు నియమాలు, సంబంధిత చెప్పిన రుణగ్రహీతలు ఖర్చులు మరియు పర్యావసనాలకు బాధ్యత వహించాల్సి ఉంటుంది. సదరు రుణగ్రహీతలు చట్టం క్రింద సదరు ఆస్తులను, అమ్మడంగాని, లీజుకు గాని లేదా జెఎమ్‌కు ముందుగా తెలియకుండా బదిలి చేయుట నిషేధించబద్దారు. ఎవరైన వ్యక్తి చెప్పిన తయారు చేయబడిన చట్టం లేదా నియామాలు క్రింద నేరానికి పాల్పడిన లేదా ఉల్లంఘించిన వారికి చట్టబద్ధంగా జైలు శిక్ష మరియు/లేదా జరిమానా విధించబడుతుంది.

తేది: 05.10.2023
ప్రదేశం: ఆంధ్రప్రదేశ్
సం/- (ఆధీకృత అధికారి)
జెఎమ్ ఫైనాన్షియల్ అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్

పబ్లిక్ నోటీసు

ICICI Bank **శాఖ కార్యాలయం:** ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్, 4/10, మైత్రి టవర్, బొమ్మన్ హల్లి హొసూర్ మెయిన్ రోడ్డు బెంగళూరు-560068

కింది రుణగ్రహీతలు బ్యాంక్ నుండి పొందిన రుణాల సదుపాయం యొక్క అసలైన మరియు వడ్డీని తిరిగి చెల్లించడంలో డీఫాల్ట్ అయ్యారు మరియు రుణాలు పని చేయని ఆస్తులు (ఎన్‌పిఎ) గా వర్గీకరించబడ్డాయి. సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్-2002 సెక్షన్ 13(2) కింద వారికి నోటీసు జారీ చేయబడింది, వారి చివరిగా తెలిసిన చిరునామాలపై అది అందించబడలేదు అందువల్ల ఈ పబ్లిక్ నోటీసు ద్వారా వారికి తెలియజేయడమైంది.

క్ర. సం:	రుణగ్రహీత/సహ రుణగ్రహీత/ హామీదారుల పేర్లు (లోన్ ఎకౌంట్ నెంబరు) మరియు చిరునామా	సెక్యూర్డ్ అసెట్స్/అమలు చేయబడిన అసెట్స్ ఆస్తి చిరునామా	నోటీసు పంపిన తేదీ/ నోటీసు తేది నాటికి బకాయి మొత్తం	ఎన్‌పిఎ తేది
1.	మాత గాయత్రి ఆయిల్స్, ప్రొప్రైటర్. వంకాయల శ్రీనివాసరావు, వంకాయల లక్ష్మి శిరీష, వంకాయల కాశీవిశ్వనాథం మరియు వంకాయల శ్రీధర్ కుమార్ ద్వారా ప్రాతినిధ్యం/14 1 35 1 పి ఎస్ రోడ్డు నరసరావుపేట గుంటూరు-522601/ 067905005781/ 067955000057/ 067955000032.	ఆస్తి-1 : గుంటూరు జిల్లా, నరసరావుపేట వద్ద టిఎస్.నం.311, 312సి, బ్లాక్ నం.1/3, పాత డో.నం.355/ఎలో సైట్ విస్తీర్ణం 78.58 చ.గ.లు. హద్దులు : ఉత్తరం: బలుకూరి జ్ఞానచంద్రరావు, రామిశెట్టి రామచంద్రరావు సైట్, దక్షిణం: ఇమ్మడిశెట్టి హనుమంతరావు ఇల్లు, తూర్పు: చిలంకూరి వెంకటేశ్వర్లు ఇల్లు, పడమర: మున్సిపల్ బజార్. ఆస్తి-2 : ఎస్.ఆర్.ఓ. డి.ఆర్.ఓ. నరసరావుపేట, మున్సిపల్ పాత వార్డు నం.1, కొత్త వార్డు నం.3, టి.ఎస్.నం.183 మరియు 184 ఖాళీ సైట్ డో.నం.2-3-52 వద్ద ఉన్న సైట్ విస్తీర్ణం 581.11 చ.గ.లు. అమ్ముడు బోయిన మరియు హద్దులు : తూర్పు: శ్రీ రామకృష్ణ ఆయుర్వేద విద్యాపీఠం కు చెందిన సైట్ 135 అ.లు., దక్షిణం: 14 అ.లు. వెడల్పు రోడ్డు 40 అ.లు., పడమర: పి.వెంకటరత్నం ఆర్ రామసుబ్బారావు మరియు ఇతరులకు చెందిన సైట్ 126.6 అ.లు., ఉత్తరం: 10 అ.లు. వెడల్పు రోడ్డు 40 అ.లు. ఈ సరిహద్దుల సైట్ పరిధిలో 581.11 చ.గ.లు. 485.87 చ.మీ.లకు సమానమైన ఖాళీ సైట్. ఆస్తి-3 : ఎస్.ఆర్.ఓ., డి.ఆర్.ఓ. నరసరావుపేట, మున్సిపల్ పాత వార్డు నం.1, కొత్త వార్డు నం.1, పాత సర్వే నం.355/ఎ టి.ఎస్.నం.174/8, బ్లాక్ నం.1/1 డో.నం.1-1-19 పడమర వైపు ఉన్న ఖాళీ సైట్ విస్తీర్ణం 172.66 చ.గ.లు. హద్దులు : తూర్పు: లింగమ్మఆస్తి 74.6 అ.లు., దక్షిణం: మున్సిపల్ బజార్ 18 అ.లు., పడమర: మున్నలూరి సత్యనారాయణ మరియు ఇతరుల ఆస్తి 73.6 అ.లు., ఉత్తరం: బొందిలి అంజమ్మ మరియు ఇతరుల ఆస్తి 24 అ.లు. ఆస్తి-4 : ఎస్.ఆర్.ఓ., డి.ఆర్.ఓ. నరసరావుపేట, మున్సిపల్ పాత వార్డు నం.4, కొత్త వార్డు నం.11, పాత సర్వే నం.355/ఎ, టి.ఎస్.నం.1292 మూల్యాంకనం నం.10240010531, డో.నం.7-7-3 వద్ద ఉన్న ఆస్తి ఖాళీ సైట్ విస్తీర్ణం 136.95 చ.గ.లు. అమ్మబడిన మరియు హద్దులు : తూర్పు: మున్సిపల్ రోడ్డు 21.9 అ.లు., దక్షిణం: చిలకల రామారావు ఇల్లు మరియు సొంత గోడ 57 అ.లు., పడమర: జొన్నగడ్డ సుబ్బాయమ్మ ఇల్లు 21.6 అ.లు., ఉత్తరం: రెడ్డి ఆంజనేయులు ఇల్లు మరియు ఉమ్మడి గోడ 57 అ.లు., సైట్ పరిధిలో 172.66 చ.గ.లు. 144.36 చ.మీ.ల. ఖాళీ సైట్‌కి సమానం. ఆస్తి-5 : ఎస్.ఆర్.ఓ., డి.ఆర్.ఓ. నరసరావుపేట, మున్సిపల్ పాత వార్డు నం.1, కొత్త వార్డు నం.3, టి.ఎస్.నం.656 ఖాళీ సైట్ విస్తీర్ణం 94.44 డో.నం.3-1-3 పాతూరి శివాలయం వీధి బ్లాక్ నం.1/8 గజాల సైట్ హద్దులు : తూర్పు: ఆర్. శ్యామల దేవి మరియు ఇతరులు 39.0 అ.లు., దక్షిణం: గలి బజార్ 20.0 అ.లు., పడమర: సిహెచ్.వెంకటేశ్వర్లు ఇల్లు మరియు సొంత గోడ 46.0 ఉత్తరం: బజార్ 20 అ.లు. సైట్ విస్తీర్ణం 94.44 చ.గ.లు. 78.96 చ.మీ.లు. కు సమానమైన ఖాళీ సైట్. ఆస్తి-6 : ఎస్.ఆర్.ఓ., డి.ఆర్.ఓ. నరసరావుపేట, మున్సిపల్ పాత వార్డు నం.1, కొత్త వార్డు నం.3, టి.ఎస్.నం.183, 184 వార్డు నం.3, బరంపేట రోడ్డు ఖాళీ సైట్ డో.నం.3-7-23 82 ఎమ్ వద్ద ఉన్న సైట్ విస్తీర్ణం 74.07 చ.గ.లు. హద్దులు : తూర్పు: రోడ్డు, దక్షిణం: రోడ్డు, పడమర: రాజేంద్రప్రసాద్ ఆస్తి, ఉత్తరం: విశ్వేశ్వరయ్య ఆస్తి. సైట్ విస్తీర్ణం 74.07 చ.గ.లు. 62.54 చ.మీ.లు.కు సమానమైన ఖాళీ సైట్.	10-08-2023/ Rs.5,72,96, 242.00/-	25/06/ 2023

నోటీసు యొక్క ప్రత్యామ్నాయ సేవ కోసం చర్యలు తీసుకోబడుతున్నాయి. పై రుణగ్రహీతలు/మరియు/లేదా వారి హామీదారులు (వర్తించే విధంగా) ఈ నోటీసును ప్రచురించిన తేదీ నుండి 60 రోజుల వ్యవధిలోపు బకాయి ఉన్న చెల్లించాలని సూచించారు. లేకపోతే సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్-2002 నిబంధన ప్రకారం తదుపరి చర్యలు తీసుకోబడతాయి.

తేది: 05 అక్టోబర్, 2023
ప్రదేశం: గుంటూరు
అధీకృత అధికారి
ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్

సంపాదకీయం

అప్రకటిత ఎమర్జెన్సీ!

స్వతంత్ర వార్తా పోర్టల్ 'న్యూస్ క్లిక్'పై మోడీ ప్రభుత్వం చేసిన దాడి భావ ప్రకటనా స్వేచ్ఛ గొంతు నొక్కడమే. వందలాది మంది పోలీసులను రంగంలోకి దింపిన కేంద్ర ప్రభుత్వం చివరకు ఆ సంస్థ ఎడిటర్ ప్రబీర్ పుర్కాయస్థ, హెచ్.ఆర్ విభాగం అధిపతి అమిత్ చక్రవర్తిని అరెస్ట్ చేసిన తీరు ఎమర్జెన్సీ రోజులను గుర్తుకుతెస్తోంది. ఎటువంటి నేరారోపణలు (ఛార్జీలు ఫ్రేమ్) చేయకుండానే ఉగ్రవాద నిరోధక చట్టం (ఉపా) కింద ఈ అరెస్టులు చేస్తున్నట్లు ప్రకటించడం దుర్మార్గం. ఈ చర్య ద్వారా రాజ్యాంగాన్ని, అది నెలకొల్పిన విలువలను, ప్రజాస్వామ్య స్ఫూర్తిని తుంగలోకి తొక్కిన మోడీ సర్కారు అప్రకటిత ఎమర్జెన్సీని అమలులోకి తీసుకువచ్చింది. 1975 ఎమర్జెన్సీ సమయంలో జెఎన్‌యు విద్యార్థిగా వున్న ప్రబీర్‌ను అప్పటి ప్రభుత్వం బూటకపు ఆరోపణలపై అరెస్టు చేసింది. తాజాగా ఎటువంటి ఆధారాలు లేకుండానే మీడియా సంస్థ కార్యాలయంతో పాటు, సిబ్బంది నివాసాల మీద, ఆ సంస్థతో సంబంధాలు ఉన్న మేధావులు, రచయితలు, కళాకారుల ఇళ్లపై కూడా మోడీ ప్రభుత్వం విరుచుకుపడింది. మంగళవారం ఉదయం నుండి రాత్రి వరకు పోలీసులు జరిపిన దాడులు దిగ్భ్రాంతికరం. 500 మందికిపైగా పోలీసులను, పెద్ద సంఖ్యలో నిఘా సిబ్బందిని సిద్ధం చేసుకుని తెల్లవారు జామున 2 గంటలకే అధికారులు సమావేశం జరిపి దాడులకు దిగారంటే జర్నలిస్టుల పట్ల మోడీ ప్రభుత్వం ఎంత దుర్మార్గంగా వ్యవహరిస్తోందో తెలుస్తోంది. తనకు వ్యతిరేకంగా గళం విప్పేవారిలో భయోత్పాతాన్ని సృష్టించడమే దాని లక్ష్యం. మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత దేశ వ్యాప్తంగా ఈ తరహా దాడులు ఎన్నో జరిగాయి. భీమా కొరెగావ్ కేసు దీనికో ఉదాహరణ. దేశ వ్యాప్తంగా ఉన్న మేధావులను, ప్రజాతంత్ర వాదులను ఉపా చట్టం కింద అరెస్ట్ చేసి, నాలుగేళ్లుగా నిర్బంధంలో ఉంచినప్పటికీ ఇప్పటివరకు ఒక్క ఆధారాన్ని కూడా మోడీ సర్కారు చూపలేకపోయింది. అటువంటి కుట్రే 'న్యూస్ క్లిక్'పై కూడా కేంద్రం చేస్తోంది.

నిజానికి ఇదేమీ ఇప్పటికిప్పుడు కొత్తగా జరిగిన దాడి కాదు. మోడీ ప్రభుత్వం రెండవసారి అధికారంలోకి వచ్చినప్పటి నుండి 'న్యూస్ క్లిక్'పై దేశద్రోహ ముద్ర వేయడానికి ప్రయత్నాలు చేస్తూనే ఉంది. 2021 లోనే ఇ.డి, ఇన్‌కంట్యాక్స్ అధికారులతో పాటు ఢిల్లీ పోలీసులనూ రంగంలోకి దించింది. రకరకాల ప్రభుత్వ ఏజెన్సీలు రోజుల తరబడి విచారణ చేశాయి. అయినా, చైనా నిధులంటూ చేస్తున్న ఆరోపణలను కేంద్ర ప్రభుత్వం వీసమంత కూడా నిరూపించలేకపోయింది. తాజాగా 'న్యూయార్క్ టైమ్స్' అదే ఆరోపణ చేస్తూ ప్రచురించిన బూటకపు కథనాన్ని అడ్డు పెట్టుకుని ఉపా చట్టం కింద కేసును బనాయించింది. తనకు వచ్చే నిధులన్నీ భారతీయ చట్టాలకు లోబడి, రిజర్వు బ్యాంకు నిబంధనల ప్రకారం బ్యాంకు అకౌంట్ల ద్వారానే వస్తాయని 'న్యూస్ క్లిక్' స్పష్టం చేసింది.

ఢిల్లీ ఘర్షణలు, రైతుల ఆందోళనల సందర్భంగా 'న్యూస్ క్లిక్ ' ఇచ్చిన విస్తృతమైన కథనాలు మోడీ సర్కారుకు కంటగింపుగా మారాయి. ప్రజా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ప్రశ్నిస్తున్న తీరును కూడా భరించలేక అణచివేత చర్యలకు దిగింది. అన్ని మీడియా సంస్థలు తన ఎజెండాను మాత్రమే వినిపించాలన్నది మోడీ ప్రభుత్వ భావన. దానికి భిన్నంగా ప్రజల గొంతు వినిపించినందుకు గతంలో 'న్యూస్ ల్యాండ్రీ, ద వైర్, బిబిసి' వంటి మీడియా సంస్థలపైనా కేంద్రం ఇ.డి, ఐ.టి ల చేత దాడులు చేయించింది. ఎన్‌డి టివిని అదానీ గ్రూపుతో కొనుగోలు చేయించింది. కర్ణాటకలో జర్నలిస్టు గౌరీ లంకేష్ హత్య, హత్రాస్ ఘటనను కవర్ చేయడానికి వెళ్లిన కేరళ జర్నలిస్టు సిద్దిక్ కప్పన్‌ను యు.పి లో బిజెపి ప్రభుత్వం రోజుల తరబడి జైలులో పెట్టడం, మధ్యాహ్న భోజన పథకపు అధ్వాన్నపు అమలుపై రాసినందుకు కొందరిని కటకటాల వెనక్కు నెట్టడం వంటి సంఘటనలు ఎన్నో! అందుకే భారతదేశంలో పత్రికాస్వేచ్ఛ రోజురోజుకీ దిగజారిపోతోందని 'ప్రెస్ ఫ్రీడమ్ ఇండెక్స్' నివేదిక ఆవేదన వ్యక్తం చేసింది. 180 దేశాల జాబితాలో 2014లో 140వ స్థానంలో ఉన్న పత్రికా స్వేచ్ఛ 2023కి 161వ స్థానానికి పడిపోయింది. ఈ ధోరణిని ఇక ఏ మాత్రం అనుమతించకూడదు. పత్రికల గొంతు నొక్కడమంటే ప్రజాస్వామ్యం గొంతుకు ఉరితాడు వేయడమే! అందుకే, ప్రభుత్వ అణచివేత వైఖరిని గట్టిగా ప్రతిఘటించాలి...తిప్పికొట్టాలి. ప్రతి ఒక్కరూ ఈ పోరాటంలో కలిసి కదలాలి. అప్పుడే ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోగలం.

మంచి మాట

పేదరికం ఉన్నంత వరకూ
నిజమైన స్వాతంత్య్రం ఉండదు.
- నెల్సన్ మండేలా

ప్రాంతాల వెనుకబాటుకు కారణాలేంటి?

విశ్లేషణ

వి. రాంభూపాల్

దేశాభివృద్ధి అంటే గ్రామాభివృద్ధి అని చాటిచెప్పిన మహాత్ముని సందేశంలో సమగ్రాభివృద్ధి అనే దూరదృష్టి స్పష్టమవుతుంది. అన్ని ప్రాంతాలు, అన్ని జాతులు సమగ్రంగా అభివృద్ధి చెందడమే దేశాభివృద్ధి. గాంధీ జయంతి అక్టోబర్ 2 నుండి ప్రపంచ విప్లవ దినోత్సవం నవంబర్ 7 వరకు సిపిఎం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తతంగా 'ప్రజా రక్షణ భేరి' జరుగుతున్నది. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లక్ష కోట్ల రూపాయల ఆర్థిక ప్యాకేజి అమలు చేయాలని వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధిపై అనంతపురంలో జరిగిన రాష్ట్ర సదస్సు తీర్మానించింది. ఆంధ్రరాష్ట్ర విభజన జరిగి సుమారు పది సంవత్సరాలు పూర్తవుతున్నది. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ఇచ్చిన హామీల గడువు పది సంవత్సరాలే. కొద్ది నెలల్లో ఈ హామీల అమలు గడువు ముగుస్తుంది. కాని హామీల అమలు మాత్రం కంటికి కనిపించనంత దూరంగా నిలిచింది. రాయలసీమ లోని ఉమ్మడి కర్నూలు, అనంతపురం, కడప, చిత్తూరు, ఉత్తరాంధ్ర లోని ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలు మరియు ప్రకాశం జిల్లాలు అభివృద్ధి చెందకుండా రాష్ట్రం ఎలా అభివృద్ధి చెందుతుంది? ఈ అభివృద్ధికి కేంద్రం చట్ట ప్రకారం ఇవ్వాల్సిన నిధులు ఇవ్వకుండా ఈ ప్రాంతాలు ఎలా అభివృద్ధి చెందుతాయి? రాష్ట్ర ప్రజల హక్కుగా ఉన్న విభజన చట్టం హామీల గురించి అడగాల్సిన, పోరాడాల్సిన రాష్ట్ర ప్రభుత్వం, ప్రధాన ప్రతిపక్షాలు...ఆ బిజెపి భజనలో తరించి రాజకీయ మోక్షం పొందాలని చూడడమంటే... రాష్ట్రానికి ద్రోహం చేయడమే.

వ్యవసాయం, పారిశ్రామిక రంగాల్లో తరతరాలుగా అట్టడుగున ఉన్న ఈ ప్రాంతాల వెనుకబాటు గురించి, దాని పరిష్కారం గురించి ప్రజలను మభ్య పెట్టడానికి వివిధ ప్రభుత్వాలు అనేక కమిషన్లు వేశాయి. ముఖ్యంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన నేపథ్యంలో నియమించిన శ్రీకృష్ణ కమిషన్ ఈ ప్రాంతాల వెనుకబాటు గురించి మరింత సమగ్రంగా వివరించింది. ఈ జిల్లాలు ఆర్థికంగా వెనుకబడ్డాయేకాని ఇక్కడున్న సహజ వనరులు, నిక్షేపాలు, నీటి వనరులను సక్రమంగా ఉపయోగించగలిగితే వేగంగా అభివృద్ధి అవుతాయని ఈ కమిషన్లు నివేదించాయి. నేతలు మారుతున్నారేగానీ ఈ ప్రాంత ప్రజల బతుకులు మారడంలేదు.

రాష్ట్ర విభజన హామీలు- అమలు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన నాటికి వున్న 13 జిల్లాల్లో అత్యంత వెనుకబడిన జిల్లాల్లో విజయనగరం 13వ స్థానం, శ్రీకాకుళం 12వ స్థానం, అనంతపురం 11వ స్థానం, కర్నూలు 10వ స్థానం, చిత్తూరు 9వ స్థానం, ప్రకాశం 8వ స్థానం, కడప జిల్లా 7వ స్థానంలో వున్నాయి. అనంతపురం జిల్లా మొత్తం సాగుభూమిలో వర్షంపై ఆధారపడిన భూమి 85.39 శాతం వుండగా, కర్నూలు జిల్లాలో 72.31 శాతం ఉంది. ప్రకాశం జిల్లాలో 14 లక్షల ఎకరాల సాగుభూమిలో సుమారు తొమ్మిదిన్నర లక్షల ఎకరాలు వర్షాధారం మీదనే సాగవుతుంది. రాష్ట్ర విభజన వల్ల ఏర్పడే ఆంధ్రప్రదేశ్‌లో అత్యధిక జిల్లాలు వెనుకబడిన జిల్లాలు కావున వీటి అభివృద్ధి గురించి నాటి విభజన నేపథ్యంలో చర్చ జరిగింది. ఈ ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టకుండా రాష్ట్ర విభజన జరిగితే మరోసారి విభజన ఉద్యమాలు ఏర్పడే ప్రమాదం ఉందని నిపుణులు చెప్పారు. ఈ నేపథ్యంలోనే ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం లేక విభజన చట్టం-2014 రాష్ట్రంలోని ఉత్తరాంధ్ర, రాయలసీమలోని 7 వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజి ప్రకటించింది. విభజన చట్టంలోని సెక్షన్ 46 (2) ప్రకారం 'రాష్ట్రంలోని వెనుకబడిన ప్రాంతాలకు తగిన ప్రయోజనాలు మరియు ప్రోత్సహకాలను అభివృద్ధి ప్యాకేజీ రూపంలో ఇవ్వాలి' అని పేర్కొంది. నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ ఈ ప్రాంతాల అభివృద్ధికి బుందేల్‌ఖండ్ తరహాలో, బొలంగీర్- కలహండి- కోరాపుట్ (బికెకె) తరహాలో సహాయం అందిస్తామని ప్రకటించారు. నాటి ప్రధాన ప్రతిపక్షపార్టీ బిజెపి ఈ ప్రతిపాదనలను ఆమోదించింది. బుందేల్‌ఖండ్ కు రూ.9 వేల కోట్లు, బికెకె ప్యాకేజికి 15 వేల కోట్లు కేటాయించారు. అయితే రాష్ట్రంలోని వెనుకబడిన ప్రాంతాలకు మాత్రం ఆ తరహా ప్యాకేజీలు అమలు చేయలేదు.

బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత విభజన చట్టంలో పేర్కొన్న ఈ ఉమ్మడి 7 జిల్లాలకు జిల్లాకు సంవత్సరానికి రూ.50 కోట్ల చొప్పున మూడు సంవత్సరాలకు రూ.1050 కోట్లు మాత్రమే ఇచ్చి నిలిపివేసింది. ప్రత్యేకంగా విభజన చట్టంలో భాగంగా అనంతపురం జిల్లాలో కేంద్రీయ విశ్వవిద్యాలయం, బెల్, నాసెన్ పరిశ్రమలు, టెక్స్‌టైల్ పార్క్, కడపలో ఉక్కు పరిశ్రమ, కర్నూలులో రూ.400 కోట్లతో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐఐఐటి), రైల్వే కోచ్ నిర్మాణ పరిశ్రమ, తిరుపతిలో కండలేరు ప్రాజెక్టు, చిత్తూరులో చెన్నై-విశాఖ పారిశ్రామిక కారిడార్ వంటి అనేక హామీలలో గత తొమ్మిది సంవత్సరాల్లో ఒక్కటి కూడా పూర్తిగా అమలు కాలేదు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, వంశధార వంటి ప్రాజక్టుల నిర్మాణం, నిర్వాసితులకు పునరావాసం, విజయనగరంలో నిర్మిస్తామన్న గిరిజన కేంద్రీయ యూనివర్శిటీ, విశాఖపట్నంలో పెట్రోలియం యూనివర్శిటీలు ఇప్పటి వరకు పూర్తికాలేదు. ఇచ్చిన హామీలు అమలు చేయని కేంద్ర బిజెపి ప్రభుత్వం విశాఖపట్నంలో ఆంధ్రుల ఆత్మాభిమానానికి, వేల కుటుంబాలకు జీవనానికి ఆధారంగా ఉన్న విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరించడానికి అనేక ప్రయత్నాలు చేస్తున్నది. అదానీ లాంటి కార్పొరేట్ కంపెనీలు ఆంధ్ర రాష్ట్రంపై డేగల్లా వాలుతున్నాయి.

> వ్యవసాయం, పారిశ్రామిక రంగాల్లో తరతరాలుగా అట్టడుగున ఉన్న ఈ ప్రాంతాల వెనుకబాటు గురించి, దాని పరిష్కారం గురించి ప్రజలను మభ్య పెట్టడానికి వివిధ ప్రభుత్వాలు అనేక కమిషన్లు వేశాయి. ముఖ్యంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన నేపథ్యంలో నియమించిన శ్రీకృష్ణ కమిషన్ ఈ ప్రాంతాల వెనుకబాటు గురించి మరింత సమగ్రంగా వివరించింది. ఈ జిల్లాలు ఆర్థికంగా వెనుకబడ్డాయేకాని ఇక్కడున్న సహజ వనరులు, నిక్షేపాలు, నీటి వనరులను సక్రమంగా ఉపయోగించగలిగితే వేగంగా అభివృద్ధి అవుతాయని ఈ కమిషన్లు నివేదించాయి. నేతలు మారుతున్నారేగానీ ఈ ప్రాంత ప్రజల బతుకులు మారడంలేదు.

అన్నీ వున్నా అభివృద్ధికి దూరంగా...

రాష్ట్ర జనాభాలో రాయలసీమ జనాభా 30 శాతం. రాష్ట్ర సాగు భూమి విస్తీర్ణంలో 36.8 శాతం. అయితే ఈ ప్రాంతంలోని సాగు భూమిలో కేవలం 7.6 భూమికి మాత్రమే సాగునీటి వసతి వుంది. కోటికి పైగా జనాభా ఉన్న ఉత్తరాంధ్ర పరిస్థితి కూడా దయనీయంగానే ఉంది. ఈ ఏడు ఉమ్మడి జిల్లాల్లో విశాఖపట్నం మినహా కనీసం పది వేల మందికి ఉపాధి చూపే పరిశ్రమ ఒక్కటి కూడా లేదు. రాయలసీమలో అనేక దశాబ్దాల క్రితం నిర్మించిన తుంగభద్ర హెచ్ఎల్‌సి, ఎల్ఎల్‌సి కాల్వలు వ్యవసాయ అవసరాలను ఏమాత్రం తీర్చేవిగాలేవు. ఈ సాగునీటి కాల్వలు క్రమంగా తాగునీటి కాల్వలుగా మారిపోతున్నాయి. హంద్రీ-నీవా పథకం ద్వారా పంట పొలాలకు నీరు ఇవ్వాల్సిందిపోయి, చెరువులకు నీరు నింపే పథకంగా మారింది. ఈ జిల్లాల్లో 24 లక్షల ఎకరాల సాగుభూమి వుండగా సాగునీటి వసతి మాత్రం తొమ్మిది లక్షల ఎకరాలకు మాత్రమే ఉంది. విశాఖ నగరం మినహా మిగిలిన ఉత్తరాంధ్ర ప్రాంతమంతా తీవ్రంగా వెనుకబడి ఉంది. ప్రకాశం జిల్లా కూడా వ్యవసాయ, పారిశ్రామిక, సేవా రంగాల్లో వెనుకబడి వుంది. రాష్ట్ర తలసరి ఆదాయం బాగా తక్కువగా ఉన్న జిల్లాల్లో ప్రకాశం జిల్లా ఒకటి. రాయలసీమ జిల్లాల్లో 64 రకాల ఖనిజ సంపద ఉన్నట్టుగా శాస్త్రీయ సర్వేలు చెబుతున్నాయి. ఇనుము, బ్రైరైట్స్, స్లైలైట్, ఆస్బెస్టాస్, రాగి, వజ్రాలు, కాల్‌సైట్, బంగారం, డోలమైట్, క్లే...వంటి ఖనిజ సంపదకు కొదవలేదు. కడప, చిత్తూరు జిల్లాల్లో లభించే పులారిన్ ప్రపంచంలోనే అత్యంత అరుదైన ఖనిజం. దీని ధర బంగారం కన్నా 150 రెట్లు అధికం అంటారు. నల్లమల అడవుల్లో దొరుకుతున్న అత్యంత విలువైన ఎర్రచందనం, శ్రీగంధం, శేషాచలం కొండల్లోను, కదిరి, కుప్పం గుట్టలలోనూ, ప్రకాశం జిల్లాల్లోని శింగరాయకొండ, కొణిజేడు, వై.పాలెం, ఒంగోలు, అద్దంకి, కనిగిరి కొండల్లో అపారమైన ఖనిజ సంపద ఉంది. అత్యంత విలువైన ఔషధ మొక్కలు ఈ ప్రాంతంలో ఉన్నాయి. ఉత్తరాంధ్రలో విలువైన గనులు ఉన్నాయి. అభివృద్ధికి అనేక అవకాశాలు ఉన్నప్పటికీ పాలకుల చిత్తశుద్ధిలోపం వల్ల వెనుకబడిన ప్రాంతాలు అభివృద్ధికి దూరంగా ఉన్నాయి. గత పది సంవత్సరాల్లో ఈ ప్రాంతాల అభివృద్ధికి సాగునీటి వనరులు కల్పించడంలో, పరిశ్రమలు స్థాపించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా ఉన్నాయి.

సామాజిక న్యాయానికి విఘాతం

ఈ ప్రాంతాల్లో వెనుకబడిన తరగతులు, దళిత, గిరిజన కుటుంబాలు ఎక్కువ. వీరిని పేదరికం నుండి విముక్తి చేయడానికి భూపంపిణీ చేయాలి. కాని కొన్ని స్కీమ్‌లు ఇచ్చి ఉద్ధరిస్తున్నట్లు పాలకులు ప్రచారం చేసుకుంటున్నారు. బీడు భూములు అన్యాక్రాంతం అవుతుండడంతో పాటు, అసైన్డ్ చట్టాల్లో మార్పుచేసి పెత్తందార్లకు భూములు అప్పగిస్తున్నారు. జీవాలకు వస్తున్న వివిధ వ్యాధులవల్ల గొర్రెల, మేకల పెంపకందార్లు, ముడి సరుకుల ధరలు, విదేశీ దిగుమతుల పోటీతో చేనేత కార్మికులు, సామాజిక వివక్షతో పాటు వృత్తి రక్షణ లేక రజక వృత్తిదారులు కష్టాలకు గురవుతున్నారు. కుమ్మరి, కమ్మరి, వడ్డెర లాంటి అనేక వృత్తిదారులు పట్టణాలకు వలసలు వెళ్ళి నివాసాలతోపాటు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు. పట్టణాల్లో మైనారిటీ కుటుంబాల స్వయం ఉపాధికి పెద్ద కంపెనీల పోటీలు, ప్రభుత్వాల నిర్లక్ష్యంతో తీవ్ర ఆర్థిక వెనుకబాటుకు గురవుతున్నారు. కౌలు రైతులకు చట్టబద్ధ రక్షణ లేకపోవడంతో ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయి. విద్య, వైద్యం, సామాజిక సేవలు ప్రైవేటు పరం కావడంతో పేద, దిగువ మధ్య తరగతి ప్రజలపై అదనపు భారాలు పెరిగాయి.

రాష్ట్ర విభజన చట్టంలో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేయాలి. కడప జిల్లాలో ప్రభుత్వ రంగంలో ఉక్కు పరిశ్రమ నిర్మించాలి. రాయలసీమ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం రూ.50 వేల కోట్లు, ఉత్తరాంధ్ర జిల్లాలకు రూ.25 వేల కోట్లు, ప్రకాశం జిల్లాకు రూ.10 వేల కోట్లు, నెల్లూరు, ఇతర జిల్లాల్లోని వెనుకబడిన మండలాల అభివృద్ధికి మరో రూ.15 వేల కోట్లు మొత్తం లక్ష కోట్ల రూపాయల ప్రత్యేక ప్యాకేజిని బడ్జెట్‌లోనే కేటాయించి, 3 సంవత్సరాలలో ఖర్చు చెయ్యాలి. పరిశ్రమల పేరుతో ప్రభుత్వం సేకరించిన భూముల్లో పరిశ్రమలు స్థాపించాలి. లేదా ఆ భూములను తిరిగి రైతులకు అప్పగించాలి. లేపాక్షి నాలెడ్జ్ భూముల్లో ఐ.టి పరిశ్రమను స్థాపించాలి. రాయలసీమ, ఉత్తరాంధ్ర, ప్రకాశం జిల్లాల్లోని ప్రతిపాదిత ప్రాజెక్టులన్నీ 3 సంవత్సరాలలో పూర్తి చేసి ఈ ప్రాంతాల్లోని సాగు భూమికి సంవత్సరానికి ఒక పంటకైనా సాగునీరు అందించాలి. ప్రభుత్వ రంగంలోనే విద్యా, వైద్యం అందించాలి. సాంఘిక సంక్షేమ హాస్టళ్లను మెరుగుపరచాలి. వృత్తిదారులకు రక్షణ కల్పించాలి. ఎస్.సి, ఎస్.టి సబ్‌ప్లాన్‌ను పటిష్టంగా అమలు చేయాలి. హంద్రీ-నీవాకు 80 టిఎంసిల నీరు కేటాయించాలి. పిల్లకాల్వలు తవ్వి ఆయకట్టుకు సాగునీరు అందించాలి. రాయలసీమలో మైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌ను ఏర్పాటు చేయాలి. మైనింగ్ ద్వారా వచ్చే ఆదాయంలో 50 శాతం రాయలసీమ అభివృద్ధికి ఖర్చు చేయాలి. గత ప్రభుత్వం శాసనసభలో రాయలసీమకు, ఉత్తరాంధ్ర, ప్రకాశం జిల్లాలకు ప్రకటించిన అభివృద్ధి పథకాలను పూర్తి చేయడంతో పాటు, కొత్త పరిష్కార చర్యలను చేపట్టాలి. అందుకోసం సిపిఎం రాష్ట్ర వ్యాప్త ఉద్యమానికి శ్రీకారం చుట్టింది. రాష్ట్రంలోని ప్రధాన పార్టీలను కేంద్ర ప్రభుత్వం తన ఇష్టానుసారంగా ఆడిస్తున్నది. ఎన్నికల లబ్ధి కోసం కేసులు, జైళ్లు, బెయిళ్ల రాజకీయం నడుస్తున్నది. ఈ పరిస్థితుల్లో సిపిఎం ప్రజా రక్షణ భేరి నిర్వహిస్తున్నది.

/ వ్యాసకర్త సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు /

విద్య సరుకు కాదు ...

విమర్శ

జి. వెంకటేశ్వరరావు

'విద్య ఒక సామాజిక వస్తువు. సరుకు కాదు. దీన్ని మార్కెట్లో అమ్మడం లేదా కొనడం చేయకూడదు. ప్రైవేటీకరణ అనేది విద్యాహక్కును కుదిస్తుంది' అంటారు నెల్సన్ మండేలా. 'రాజకీయంగా, ఆర్థికంగా, సాంస్కృతికంగా అణచివేసే సమాజంలో అణగారిన వ్యక్తుల సృజనాత్మకతను వెలికితీసి స్వేచ్ఛను ప్రసాదించే శక్తులను పెంపొందింప చేసేదే విద్య' అని ప్రముఖ విద్యావేత్త పాలో ఫ్రియరీ అభిప్రాయం. 1990లో నూతన ఆర్థిక సంస్కరణల ప్రారంభమైన తర్వాత ప్రభుత్వాలు అన్ని రంగాలతో పాటు విద్యను కూడా తమ పౌరులకు అందించవలసిన సామాజిక బాధ్యత నుండి తప్పుకొని మార్కెట్ శక్తుల చేతిలోకి పూర్తిగా అప్పగించే దిశగా ప్రయాణం ప్రారంభించి ఇప్పటికే మూడు దశాబ్దాలు దాటింది. భారతదేశంలో 1978లో ప్రయివేటు విద్యాసంస్థలలో 3.4 శాతంగా ఉన్న విద్యార్థులు 1993 నాటికి 9.2 శాతంగా పెరిగారు. 2021-22 యుడిఐఎస్‌ఇ ప్రకారం 2022 నాటికి ప్రయివేటు విద్యాసంస్థల్లో విద్యార్థులు 33 శాతానికి పెరిగారు. ప్రయివేటు పాఠశాలల సంఖ్య 2.3 శాతం నుండి నేడు 23 శాతానికి చేరాయి. ఈ గణాంకాలు గత మూడు దశాబ్దాల కాలంలో దేశంలో పాఠశాల విద్యలో 90 తర్వాత పెరిగిన ప్రైవేటీకరణ వేగాన్ని తెలియజేస్తున్నది. దాదాపు 8 కోట్ల 83 లక్షల మంది విద్యార్థులు ఈ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్నారు. 3 లక్షల 41 వేల మంది ఉపాధ్యాయులు ఈ సంస్థల్లో పనిచేస్తున్నారు. వీరు మొత్తం ఉపాధ్యాయుల్లో 38 శాతంగా ఉన్నారు. యునెస్కో వారి జిఇఎమ్ (గ్లోబల్ ఎడ్యుకేషన్ మోనిటరింగ్ రిపోర్ట్)-2022 నివేదిక ప్రకారం 2014 నుండి స్థాపించిన 97 వేల పాఠశాలల్లో 67 వేల ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. యునెస్కో గణాంకాల ప్రకారం 187 దేశాల్లో పాఠశాల విద్యను ప్రైవేటుపరం చేసిన దేశాల్లో భారత్ 15వ స్థానంలో ఉంది అంటే ఇక్కడ పాఠశాల విద్య ఎంత వేగంగా మార్కెట్ పరం అవుతుందో అర్థం చేసుకోవచ్చు. మన పొరుగునే ఉన్న శ్రీలంకలో సైతం ప్రాథమిక స్థాయిలో 3.2 శాతం మంది విద్యార్థులు మాత్రమే ప్రయివేటు పాఠశాలల్లో చదువు తున్నారని యునెస్కో గణాంకాలు తెలియజేస్తున్నాయి.

భారతీయ సమాజంలో పిల్లలను చదివించుకోవాలనే ఆకాంక్ష పెరగడం ఒక సానుకూల అంశం. గతంలో లాగా పిల్లలకు నాలుగు అక్షరం ముక్కలు వస్తే చాలనుకునే దశ నుండి పిల్లలకు నాణ్యమైన విద్యనందించాలని తల్లిదండ్రులు కోరుకుంటున్నారు. ఈ ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వ పాఠశాలలను స్థాపించి నాణ్యమైన విద్యను అందించడంలో ప్రభుత్వం విఫలం కావడం విద్యార్థులు ప్రైవేటు బాట పట్టడానికి ఒక ప్రధాన కారణం. యునెస్కో జిఇఎమ్-2022 ప్రకారం ప్రైవేటుకు వెళుతున్న విద్యార్థులలో 73 శాతం తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందటం లేదని, ఇంగ్లీష్ మీడియం విద్య కోసం 12 శాతం మంది, 10.2 శాతం ప్రభుత్వ స్కూలు అందుబాటులో లేకపోవడం వలన, 4.7 శాతం ఇతర కారణాలు ప్రైవేటు బాట పడుతున్నారని తెలియజేస్తున్నది. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి ఏడు పాఠశాలలకు ఒక పాఠశాలలో ఐదు తరగతుల వరకు ఒకే ఒక ఉపాధ్యాయుడు బోధిస్తున్నారు. కానీ ప్రైవేటు పాఠశాలల్లో 81.4 శాతం పాఠశాలల్లో తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉంటున్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయులకు బోధనేతర పనులు ఉండకూడదని అనేక నివేదికలు, ఎన్ఇపి (నూతన విద్యా విధానం) వంటివి సూచించాయి. అయినప్పటికీ ప్రభుత్వాలు ఉపాధ్యాయులపై బోధనేతర పనులు మోపడంతో బోధనా సమయం హరించుకుపోతున్నది. ఇది ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా నాణ్యతను తీవ్రంగా దెబ్బతిస్తున్నది. అందువలన ప్రభుత్వ పాఠశాలలు సామాన్య ప్రజల నమ్మకాన్ని కోల్పోయాయి. ఐదు తరగతులకు ఒకే ఒక ఉపాధ్యాయునిచే బోధించడం అంటే విద్యా హక్కును నిరాకరించడమే అవుతుంది. కేంద్ర విద్యాశాఖ గణాంకాల ప్రకారం ఇప్పటికే దేశవ్యాప్తంగా 1:30 నిష్పత్తిలో పది లక్షల ఉపాధ్యాయుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇవి మొత్తం ఉపాధ్యాయులలో 15.7 శాతం. దీనినిబట్టే ప్రభుత్వ విద్యపై ప్రభుత్వాల ప్రేమ అర్థమవుతుంది.

> భావి భారత పౌరుల విద్య కోసం మూడు శాతం లోపు మాత్రమే ఖర్చు పెడుతూ...విద్యను అందించవలసిన బాధ్యత నుండి తప్పుకొని కార్పొరేట్ల చేతుల్లో పెట్టడం దేశభక్తి అవుతుందా? విద్యార్థులకు అసమాన అవకాశాలను కల్పించే ఈ విద్యా వ్యవస్థను మార్చి కొఠారి కమిషన్ సూచించిన విధంగా కామన్ స్కూల్ విధానాన్ని అమలు చేయాలి.

విద్య ప్రాథమిక లక్ష్యాలు పట్టవా?

విద్య ద్వారా సాంఘిక జాతీయ సమైక్యతను సాధించడం, ప్రజాస్వామిక విలువలు అభివృద్ధి పరచడం, సాంఘిక నైతిక విలువలను అభివృద్ధి పరచడం, అంతర్జాతీయ అవగాహన పెంపొందించడం వంటి లక్ష్యాలను కొఠారి కమిషన్ సూచించింది. జాతీయ విద్యా విధానం(ఎన్ఇపి)-1986 కూడా ప్రాథమిక స్థాయిలో మాతృభాషలో బోధన, క్రీడలకు వ్యాయామానికి సముచిత స్థానం, లౌకికత మానవతా విలువలు పెంపొందించడం, విద్యలో సమాన అవకాశాలు కల్పించడం వంటి లక్ష్యాలను నిర్దేశించింది. నూతన విద్యా విధానం కూడా దాదాపుగా ఇదే లక్ష్యాలను సూచించింది. దాదాపుగా దేశంలో సగం మంది పిల్లలు చదువుతున్న ప్రైవేటు విద్యాసంస్థల నిర్వహణ, బోధనా విధానాలపై పర్యవేక్షణ లేకుండా భవిష్యత్తు భారతాన్ని నిర్మించలేం. ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థుల సామర్థ్యాలు ఆశించిన మేర లేవనేది అసర్ నివేదిక, యునెస్కో వారి జిఇఎమ్ రిపోర్టుల ద్వారా స్పష్టం అవుతుంది. రెండవ తరగతి స్థాయి పాఠ్య పుస్తకాన్ని చదవగలిగిన 3వ తరగతి విద్యార్థులు 20.5 శాతం, ఐదో తరగతి విద్యార్థులు 42.8 శాతం మంది ఎనిమిదో తరగతి విద్యార్థులు 69.2 శాతం మంది మాత్రమే ఉన్నారు అంటే ఈ విద్యాసంస్థల్లో నాణ్యతను అర్థం చేసుకోవచ్చు. విద్య ప్రైవేటీకరణతో విద్యారంగంలో నూతన సవాళ్లను ఎదుర్కోవాల్సి వస్తున్నది. ప్రైవేటీకరణ విధానాలు పాఠశాలల్లో పెట్టుబడి పెట్టి నిర్వహించడం వరకే పరిమితం కావడంలేదు. విద్య ప్రాథమిక లక్ష్యాన్ని మరిచిపోయేలా నూతన లక్ష్యాలను, నిర్వహణ విధానాలను ప్రవేశపెడుతున్నాయి. ఇవి మార్కెట్ విలువలను పెంచే విధంగా విద్యను మార్చి విద్యలో మాధుర్యాన్ని కోల్పోయేలా చేస్తున్నాయి. విద్యాసంస్థల మధ్య లాభాల పోటీలో భాగంగా పాఠశాలల పని వేళలను పెంచటం, పాఠశాల స్థాయిలోనే జెఇఇ, నీట్, ఐఎఎస్ వంటి పోటీ పరీక్షలకు సంసిద్ధులను చేయడమనే పేరుతో విద్యార్థులపై తీవ్రమైన ఒత్తిడి పెంచుతున్నాయి. విద్యా స్వభావాన్ని మాత్రమే కాకుండా కీలకమైన సామాజిక సాంస్కృతిక సంబంధాలను కూడా రూపాంతరం చెందిస్తున్నాయి.

3.75 లక్షల కోట్ల డాలర్ల డిజిపితో ప్రపంచంలోనే ఐదవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న భారతదేశం 2025 నాటికి ప్రపంచంలో ఐదు ట్రిలియన్ల డాలర్లతో మూడవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవించబోతోందని ప్రధాని నరేంద్ర మోడీ ఘనంగా చెప్పుకోవడం చూస్తున్నాం. ఇటువంటి దేశంలో భావి భారత పౌరుల విద్య కోసం మూడు శాతం లోపు మాత్రమే ఖర్చు పెడుతూ...విద్యను అందించవలసిన బాధ్యత నుండి తప్పుకొని కార్పొరేట్ల చేతుల్లో పెట్టడం దేశభక్తి అవుతుందా? విద్యార్థులకు అసమాన అవకాశాలను కల్పించే ఈ విద్యా వ్యవస్థను మార్చి కొఠారి కమిషన్ సూచించిన విధంగా కామన్ స్కూల్ విధానాన్ని అమలు చేయాలి. కత్తులు దూసే విద్యా వ్యాపారంలో బలవుతున్న బాలల జీవితానికి రక్షణ కల్పించాలి. విద్యార్థులకు విరామ సమయం, ఆటలాడుకునే హక్కు, తగిన సౌకర్యాలు విద్యా సంస్థలు కల్పించాలి. విద్యావేత్తలు సూచించిన విధంగా ఏ తరగతి సిలబస్‌ను ఆ తరగతిలో మాత్రమే బోధించేలా చర్యలు తీసుకోవాలి. భావిభారత పౌరులకు నాణ్యమైన జీవనానికి గ్యారెంటీ ఇస్తూ పని హక్కును అంటే ఉద్యోగ గ్యారెంటీని కల్పించాలి. ఆ పేరుతో జరుగుతున్న వ్యాపారాన్ని అరికట్టాలి. అప్పుడు మాత్రమే అత్యంత ఆనందదాయకమైన దేశాల సరసన మన దేశం చేరుతుంది. ఐక్యరాజ్యసమితి విడుదల చేసిన ఆనందదాయక దేశాల జాబితాలో మన దేశం అన్నింటికన్నా చివరిన 136 దేశాలలో 126వ స్థానంలో ఉంది. అంటే ఈ దేశంలోనే ప్రజల ఎంత ఆనందంగా ఉన్నారో అర్థం చేసుకోవచ్చు. మన పొరుగునే ఉన్న శ్రీలంక, నేపాల్, చైనా, బంగ్లాదేశ్ వంటి దేశాల కన్నా వెనుకనే ఉన్నాం. విద్య పేరుతో జరుగుతున్న తంతులో బలవుతున్న బాలల హక్కులను కాపాడకుండా ఈ దేశంలోని ప్రజల ఆనందాన్ని రెట్టింపు చేయలేం. ఆనందదాయకమైన సమాజ నిర్మాణం కోసం విద్యావంతులు, బాలల హక్కుల సంఘాలు, ఉపాధ్యాయ సంఘాలు పాలకులపై ఒత్తిడి తీసుకురావడం ద్వారానే ఆనందదాయక భారత్‌ను నిర్మించగలం.

/ వ్యాసకర్త యుటిఎఫ్ గుంటూరు జిల్లా కార్యదర్శి,
సెల్ : 9966135289 /

కవిత్వం

నువ్వా? నేనా?

'యత్ర నార్యస్తు పూజ్యంతే' అన్నావు
నిస్సిగ్గుగా స్త్రీని ఊరేగిస్తున్నావు
'సర్వేజనో సుఖినోభవంతు' అన్నావు
స్వజనో స్వఅనుభవ జగత్తును చేస్తున్నావ్.
వేదాలే జీవన నాదములన్నావు
నిర్వేదమే జనానికి మిగిల్చావు
ప్రపంచ వేదిక మీద జాతి వెలిగిపోతోందన్నావు
ఇంకా నిమ్న జాతిని దారిద్య రేఖ
దిగువనే ఉంచే ప్రయత్నం చేస్తున్నావు.
సుపరిపాలనన్నావు
'మణిపూర్' దేశానికి మణి మకుటమన్నావు
పూర్ మణి ప్రజ మీద
విశృంఖల మతమౌఢ్యానికి,
వికృత రాజకీయ క్రీడకు తెర లేపావ్.
జాత్యహంకారాన్ని మట్టు పెట్టడానికే
స్వాతంత్ర్య కాగడా చేతపట్టినారుగా
మత దురహంకారాన్ని తొలగించడానికి
బలపాన్ని ఒత్తుగా చేసుకుని జ్ఞాననేత్రంతో
నినదిస్తాము ఒక గొంతుకగా.
భయపెట్టడం నీ నైజం కావచ్చు
ఎదురొడ్డి నిలిచిన అమరవీరుల వారసులం మేము
అచేతనంలోంచి నిప్పు కణికవలే ప్రజ్వరిల్లడానికి
సిద్ధంగా ఉన్నాం
సమానత్వం, స్వేచ్ఛకు ప్రతీకలుగా మిగులుతాం.
ఆనాడు యుద్ధాలు జరిగినా ఈనాడు అల్లర్లు
జరిగినా
పాలకుల మధ్య ఆధిపత్య పోరుకు బహుజనులు
సమిధిలయ్యారు
ఇప్పుడిప్పుడే గ్రహించగలిగాం ఆ నగ్న సత్యాన్ని.
ఇప్పుడు యుద్ధం పాలకులకు, పాలితులకు
మత దురహంకారానికి, సమ సమాజ నిర్మాణానికి
నువ్వా? నేనా?
కత్తుల కాలానికి కొవ్వెత్తినై దారి చూపుతా!
చరిత్రను తిరగ రాస్తా!

- డా॥ జి.వి.ఎస్.జైపాల్ రావు,
సెల్ : 9492020115

అసత్య ఆరోపణలు

- గతంలోనూ విచారించి భంగపడ్డారు
- న్యాయస్థానానికి ఆదాయ వ్యయాలను సమర్పించాం
- న్యూయార్క్ టైమ్స్‌ది బూటకపు, ప్రేరేపిత కథనం


ఢిల్లీలోని న్యూస్‌క్లిక్ కార్యాలయానికి సీల్ వేసిన దృశ్యం

- ప్రజావాణిని వినిపించనీయకుండా గొంతు నొక్కుతున్నారు
- పత్రికా స్వేచ్ఛ కోసం తుదికంటా పోరాడతాం
- ఢిల్లీ పోలీసుల చర్యలపై న్యూస్‌క్లిక్ ప్రకటన

ప్రజాశక్తి, న్యూఢిల్లీ బ్యూరో

తమపై ఢిల్లీ పోలీసులు రుజువుకు నిలవని, నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని న్యూస్‌క్లిక్ పోర్టల్ విమర్శించింది. గతంలో అనేకసార్లు ఈడీ, ఐటీ, ఢిల్లీ పోలీసులు తమను విచారించారని, కానీ వారు ఆశించినది ఏమీ లేకపోవడంతో భంగపడ్డారని వ్యాఖ్యానించింది. తమ ఆదాయ వ్యయాలు న్యాయస్థానం ముందే ప్రకటించామని, ఆర్బీఐ నిబంధనలకు అనుగుణంగానే నిధుల సమీకరణ జరిగిందని వివరించింది. ఢిల్లీ పోలీసులు తమ కార్యాలయంలో, ఉద్యోగుల నివాసాలలో సోదాలు నిర్వహించడం, అరెస్టులు చేయడంపై బుధవారం ఆ సంస్థ ఓ ప్రకటన విడుదల చేసింది.

"న్యూస్‌క్లిక్ కార్యాలయం, జర్నలిస్టుల నివాసాలు, న్యూస్‌క్లిక్‌తో సంబంధమున్న ఉద్యోగుల నివాసాలతో సహా వివిధ ప్రదేశాలలో ఢిల్లీ పోలీసుల ప్రత్యేక విభాగం మంగళవారం దాడులు నిర్వహించింది. చాలా మందిని విచారించారు. చీఫ్ ఎడిటర్ ప్రబీర్ పుర్కాయస్థ, అమిత్ చక్రవర్తిలను అరెస్టు చేశారు. మాకు ఎఫ్ఐఆర్ కాపీని ఇవ్వలేదు. మాపై మోపిన నేరాలేమిటో చెప్పలేదు. జప్తు చేసేందుకు అవసరమైన మెమోలు ఇవ్వలేదు. స్వాధీనం చేసుకున్న సమాచారం విలువ ఎంతో చెప్పలేదు. ఎలాంటి నిబంధనలు పాటించకుండా న్యూస్‌క్లిక్ ప్రాంగణం, ఉద్యోగుల నివాసాల నుండి ఎలక్ట్రానిక్ పరికరాలు స్వాధీనం చేసుకున్నారు. కార్యకలాపాలను కొనసాగనివ్వకుండా మమ్మల్ని నిరోధించే ప్రయత్నంలో మా కార్యాలయాన్ని కూడా మూసివేశారు" అని న్యూస్‌క్లిక్ ఆ ప్రకటనలో తెలిపింది.

"మా వెబ్‌సైట్‌లో చైనా అనుకూల ప్రచారానికి పాల్పడ్డామనే అభియోగంపై చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం (ఉపా) కింద కేసు నమోదు చేశారని తెలుసుకున్నాము. పాత్రికేయుల స్వాతంత్ర్యాన్ని గౌరవించడం తెలియని, హేతుబద్ధమైన విమర్శలను దేశద్రోహంగా లేదా దేశ వ్యతిరేక ప్రచారంగా పరిగణించే కేంద్ర ప్రభుత్వ దుర్మార్గ చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నాము" అని ఆ ప్రకటన పేర్కొంది.

"2021 నుండి ప్రభుత్వానికి చెందిన వివిధ సంస్థలను ఉపయోగించి వరుస చర్యలతో న్యూస్‌క్లిక్‌ను ప్రభుత్వం లక్ష్యంగా ఎంచుకుంది. మా కార్యాలయాలు, ఉద్యోగుల నివాసాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, ఢిల్లీ పోలీసుల ఆర్థిక నేరాల విభాగం, ఆదాయపు పన్ను శాఖ దాడులు నిర్వహించాయి. పరికరాలు, లాప్‌టాప్‌లు, ఎలక్ట్రానిక్ వస్తువులు, ఫోన్లు మొదలైన వాటిని గతంలోనే స్వాధీనం చేసుకున్నారు. ఈ-మెయిల్స్‌ను, సమాచార మార్పిడులను మైక్రోస్కోప్‌లో విశ్లేషించారు. బ్యాంక్ స్టేట్‌మెంట్లు, ఇన్వాయిస్‌లు, చేసిన ఖర్చులు, న్యూస్‌క్లిక్ ఆదాయ వనరులను ఎప్పటికప్పుడు ప్రభుత్వ సంస్థలు పరిశీలిస్తున్నాయి. మా సంస్థకు చెందిన డైరెక్టర్లను, ఇతర వ్యక్తులను ప్రభుత్వ ఏజెన్సీలు గంటల తరబడి విచారించాయి" అని వివరించింది.

"ఎన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ గత రెండు సంవత్సరాలుగా మనీ లాండరింగ్‌కు పాల్పడుతోందని ఆరోపిస్తూ న్యూస్‌క్లిక్‌పై ఈడీ ఫిర్యాదు దాఖలు చేయలేకపోయింది. ఐపీసీ కింద న్యూస్‌క్లిక్‌పై నేరారోపణ చేస్తూ ఢిల్లీ పోలీసులకు చెందిన ఆర్థిక నేరాల విభాగం ఛార్జ్‌షీట్ దాఖలు చేయలేకపోయింది. ఆదాయపుపన్ను శాఖ న్యాయస్థానాల ఎదుట తన చర్యలను సమర్థించుకోలేకపోయింది. గత కొన్ని నెలలుగా ప్రబీర్ పుర్కాయస్థను ఈ సంస్థలు కనీసం విచారణకు కూడా పిలవలేదు" అని న్యూస్‌క్లిక్ తెలిపింది.

"న్యూస్‌క్లిక్‌కి సంబంధించిన సమాచారం, పత్రాలు, సమాచార మార్పిడికి సంబంధించిన వివరాలు తన వద్ద ఉన్నప్పటికీ ఆరోపణలను ప్రభుత్వం రుజువు చేయలేకపోయింది. న్యూయార్క్ టైమ్స్‌లో వచ్చిన ప్రేరేపిత, బూటకపు కథనాన్ని అడ్డు పెట్టుకొని క్రూరమైన ఉపా చట్టాన్ని అమలు చేయడానికి, సంస్థ కార్యాలయాన్ని మూసివేయడానికి పూనుకుంది. దేశ వాస్తవ చిత్రాన్ని నిర్భయంగా, స్వతంత్రంగా అందించే గొంతులను నొక్కేయాలని ప్రయత్నిస్తోంది. రైతులు, కార్మికులు, వ్యవసాయ కార్మికులు, ఇతర అణగారిన వర్గాల తరపున మాట్లాడే వారిని అణచివేయడంలో భాగంగానే మాపై దాడి జరిగింది" అని న్యూస్‌క్లిక్ పేర్కొంది.

"న్యూస్‌క్లిక్ ఒక స్వతంత్ర వార్తా వెబ్‌సైట్. మా వార్తలు, వ్యాసాలు ఎప్పుడూ వృత్తిపరంగా అత్యున్నత ప్రమాణాలపై ఆధారపడి ఉంటుంది. న్యూస్‌క్లిక్ ప్రత్యక్షంగా కానీ లేదా పరోక్షంగా కానీ ఏదైనా చైనా సంస్థ లేదా ఆ దేశ అధికారుల ఆదేశానుసారం ఎటువంటి వార్తలను, సమాచారాన్ని ప్రచురించదు. న్యూస్‌క్లిక్ తన వెబ్‌సైట్‌లో చైనా అనుకూల ప్రచారం చేయదు. న్యూస్‌క్లిక్ తన వెబ్‌సైట్‌లో పొందుపరచిన వార్తలు, వ్యాసాలకు సంబంధించి నెవిల్లే రాయ్ సింఘమ్ నుండి ఆదేశాలు తీసుకోదు. న్యూస్‌క్లిక్‌కు అందిన నిధులన్నీ సక్రమమైన బ్యాంకింగ్ పద్ధతుల ద్వారా చేరుతున్నవే. ఈ వివరాలన్నింటినీ చట్ట ప్రకారం, ఆర్‌బీఐ నిబంధనల మేరకు ఢిల్లీ హైకోర్టు ఆదేశానుసారం అధికారులకు అందజేశాము" అని తెలిపింది.

"న్యూస్‌క్లిక్ వెబ్‌సైట్‌లో ఇప్పటివరకూ ప్రచురించిన అన్ని వార్తలు, వ్యాసాలు ఇంటర్నెట్‌లో అందుబాటులో ఉన్నాయి. వీటిని ఎవరైనా చూడవచ్చు. చైనా అనుకూల ప్రచారంగా భావించే ఒక్క కథనాన్ని కానీ, వీడియోను కానీ ఢిల్లీ పోలీసుల ప్రత్యేక విభాగం ప్రస్తావించలేదు. ఢిల్లీ అల్లర్లు, రైతుల నిరసనలు వంటి ఘటనలపై ప్రత్యేక విభాగం వేసిన ప్రశ్నల తీరు చూస్తుంటే ఈ వ్యవహారం వెనుక దురుద్దేశం, హానికరమైన ఉద్దేశం ఉన్నట్లు అర్థమవుతోంది" అని విమర్శించింది. కోర్టులు, న్యాయ ప్రక్రియలపై తమకు పూర్తి విశ్వాసం ఉన్నదని, రాజ్యాంగం మేరకు పత్రికా స్వేచ్ఛ కోసం, తమ జీవితాల కోసం పోరాడతామని న్యూస్‌క్లిక్ స్పష్టం చేసింది.

జంతర్‌మంతర్ వద్ద ..

న్యూస్‌క్లిక్‌పై దాడులు, అరెస్టులకు నిరసనగా వివిధ సంఘాల ఆందోళన

న్యూఢిల్లీ : న్యూస్‌క్లిక్ కార్యాలయంపై ఇడి దాడులు, సంస్థ వ్యవస్థాపకులు ప్రబీర్ పురకాయస్థ, హెచ్‌ఆర్ హెడ్ అమిత్ చక్రవర్తిలను అరెస్టుకు వ్యతిరేకంగా వివిధ జర్నలిస్టు సంఘాలు, విద్యార్థులు, యువజన, పౌర సమాజ సంస్థలు బుధవారం ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియా, జంతర్ మంతర్ వద్ద నిరసనలు నిర్వహించాయి.

ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియా వద్ద ..

బిజెపి పాలనలో పత్రికా స్వేచ్ఛపై దాడిని ఈ సందర్భంగా నిరసనకారులు లేవనెత్తారు. బిజెపి ప్రభుత్వం, దాని విధానాలను విమర్శించే జర్నలిస్టులను, ఇతర ప్రగతిశీల మీడియా సంస్థలను ఇడి వేటాడుతోందని విమర్శించారు. క్రూరమైన ఉపా చట్టాన్ని ఉపయోగించి ఢిల్లీ పోలీసులు జర్నలిస్టుల ఇళ్లపై దాడి చేయడాన్ని వ్యతిరేకించారు. జర్నలిస్టులకు సంఘీభావం తెలిపారు. అలాగే న్యూస్ క్లిక్ కార్యాలయానికి సీలు వేయడాన్ని కూడా తీవ్రంగా ఖండించారు.

ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో ఆప్ ఎంపి అరెస్ట్

న్యూఢిల్లీ : ఆప్ ఎంపి సంజయ్‌సింగ్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడి) బుధవారం అరెస్ట్ చేసింది. ఉదయం నుండి ఎంపి నివాసంలో ఈడి అధికారులు సోదాలు నిర్వహించారు. సుమారు పదిగంటల పాటు సోదాలు చేపట్టిన తరువాత ఈ అరెస్టు జరిగింది. ఢిల్లీ లిక్కర్ పాలసీ దర్యాప్తుతో ముడిపడి ఉన్న మనీలాండరింగ్ కేసులో అరెస్ట్ చేసినట్లు సమాచారం. ఈ కేసులో నిందితుడైన వ్యాపారవేత్త దినేష్ అరోరా అప్రూవర్‌గా మారిన తర్వాత సంజయ్ సింగ్ నివాసంపై ఈడి దాడులు నిర్వహించడం గమనార్హం. ఆప్ నేత తనను ఎక్సైజ్ మంత్రిగా ఉన్న మనీష్ సిసోడియాకు పరిచయం చేశారని అరోరా పేర్కొన్నట్లు ఈడి తెలిపింది. ఆప్ పార్టీకి సంబంధించి మూడో కీలక నేత అరెస్ట్ కావడం గమనార్హం. నాలుగు కంపెనీల ద్వారా మనీలాండరింగ్ చేశారనే ఆరోపణలపై ఢిల్లీ మాజీ ఆరోగ్య మంత్రి సత్యేందర్‌జైన్‌ను గతేడాది మేలో అరెస్ట్ చేశారు. అనంతరం ఈఏడాది ఫిబ్రవరిలో కేజ్రీవాల్ సన్నిహితుడు, ఢిల్లీ డిప్యూటీ సిఎం మనీష్ సిసోడియాను సిబిఐ అదుపులోకి తీసుకుంది.

అరెస్టును ఖండించిన సీతారాం ఏచూరి

ఆప్‌ఎంపి సంజ్‌సింగ్‌ను దారుణంగా అరెస్టు చేయడాన్ని సిపిఎం ప్రధానకార్యదర్శి సీతారాం ఏచూరి ఖండించారు. మోడీ నేతృత్వంలోని ఇడి రాజకీయ ప్రత్యర్థులను వారి కల్పిత ప్రకటనలను అంగీకరించనందుకు 'సహకారం లేని' కారణంగా అరెస్టు చేయడం సాధారణంగా మారిపోయిందని అన్నారు. 'ఇండియా అంటే భారత్' కోసం మోడీ ప్రభుత్వం ముందుకు సాగాలని అన్నారు.

పోలీస్ రిమాండ్‌కు ప్రబీర్, అమిత్

న్యూఢిల్లీ : న్యూస్‌క్లిక్ వ్యవస్థాపకుడు ప్రబీర్ పురకాయస్థ, హెచ్‌ఆర్ విభాగం అధిపతి అమిత్ చక్రవర్తిలను ఏడు రోజుల పాటు పోలీసు రిమాండ్‌కు పంపినట్లు అధికారులు బుధవారం తెలిపారు. న్యూస్‌క్లిక్ ఆన్‌లైన పోర్టల్‌పై తీవ్రవాద వ్యతిరేక చట్టం (యుఎపిఎ) కింద ఢిల్లీ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. చైనా ప్రచారాన్ని వ్యాప్తి చేసేందుకు అమెరికన్ మిలియనీర్ నుండి నిధులు అందుతున్నాయంటూ న్యూయార్క్ టైమ్స్ రాసిన అసత్య వార్తా కథనాన్ని ఆధారంగా చేసుకుని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం న్యూస్‌క్లిక్‌ను గత రెండున్నరేళ్లుగా వేటాడి వేధిస్తోంది. అరెస్టు చేసిన ఇద్దరికీ వివిధ అంశాలపై 25 ప్రశ్నలను పోలీసులు సంధించారు. విదేశీ ప్రయాణాలు, షహీన్ బాగ్‌లో పౌరసత్వ (సవరణ) చట్టానికి వ్యతిరేకంగా జరిగిన నిరసనలు, రైతుల ఆందోళనలు వంటి అంశాలపై ఆ ప్రశ్నలు వున్నాయని సంబంధిత వర్గాలు తెలిపాయి.

భూకుంభకోణం కేసులో లాలూకు బెయిల్

న్యూఢిల్లీ : భూ కుంభకోణం కేసులో బీహార్ మాజీ ముఖ్యమంత్రి, రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్‌జెడి) అధ్యక్షుడు లాలూ ప్రసాద్ యాదవ్‌కి ఢిల్లీ కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఇదే కేసుకు సంబంధించి ఆయన భార్య రబ్రీదేవి, కుమారుడు, బీహార్ ఉప ముఖ్యమంత్రి తేజస్వీయాదవ్‌లకు కూడా బెయిల్ జారీ చేసింది. ప్రత్యేక సిబిఐ జడ్జి గీతాంజలి గోయల్ బుధవారం ఈ బెయిల్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. 2004-2009 మధ్య లాలూ కేంద్రమంత్రిగా ఉన్న సమయంలో రైల్వేలో ఉద్యోగాలు ఇప్పించేందుకు కొందరు అభ్యర్థుల నుంచి భూములు తీసుకున్నారంటూ లాలూతో పాటు మరో 15 మందిపై గతేడాది మేలో సిబిఐ కేసు నమోదుచేసిన సంగతి తెలిసిందే. ఇదే కేసులో ఈ ఏడాది జులై 3న సిబిఐ చార్జిషీట్ దాఖలు చేసింది. రైల్వేలోని వివిధ జోన్‌లలో గ్రూప్ డి పోస్టుల్లో పలువురిని నియమించినట్లు ఆరోపించింది.

రసాయనశాస్త్రంలో ముగ్గురికి నోబెల్



స్టాక్‌హోం : రసాయశాస్త్రంలో ముగ్గురు శాస్త్రవేత్తలకు నోబెల్ పురస్కారం దక్కింది. అమెరికాకు చెందిన మోంగి బావెండి, లూయిస్ బ్రస్, అలెక్సి ఎకిమోవ్‌లను ఈ ఏడాది నోబెల్ పురస్కారానికి ఎంపిక చేసినట్లు కమిటీ బుధవారం ప్రకటించింది. క్వాంటమ్ డాట్స్ విశ్లేషణ, ఆవిష్కరణలో, నానో పార్టికల్స్ అభివృద్ధిలోనూ ఈ ముగ్గురు శాస్త్రవేత్తలు కీలక పాత్ర పోషించినట్లు నోబెల్ కమిటీ తెలిపింది. క్వాంటమ్ డాట్స్, నానో పార్టికల్స్‌కు విశిష్టమైన గుణాలు ఉన్నాయని, ఎల్ఇడి టెలివిజన్ స్క్రీన్‌లు, సోలార్ ప్యానెల్‌లు మరియు వైద్య చికిత్సలో క్వాంటం డాట్‌లను అధికంగా వినియోగిస్తుంటారు. వైద్య చికిత్సలో కణితులను తొలగించడంలో వైద్యులకు సహాయపడతుంటాయి. భవిష్యత్తులో జరగబోయే క్వాంటమ్ కమ్యూనికేషన్ కోసం క్వాంటమ్ డాట్స్ కీలకం కానున్నట్లు నోబెల్ కమిటీ ప్రకటనలో తెలిపింది. అయితే రసాయన శాస్త్రంలో బహుమతి గ్రహీతల పేర్లు లీక్ అయినట్లు, కొన్ని గంటల ముందు స్వీడిష్ మీడియా సంస్థలు ప్రకటించాయి. ఇలాంటి ఘటనలు అరుదుగా జరుగుతుంటాయని, నోబెల్ కమిటీ ప్రకటించేంతవరకు విజేతల పేర్లు బయటకు రాకుండా చూసేందుకు తీవ్రంగా యత్నిస్తుంటాయని సంబంధిత అధికారులు తెలిపారు.

ఆధారాలు ఉంటేనే అరెస్టులు చేయాలి

- ఇడికి సుప్రీం మొట్టికాయలు

న్యూఢిల్లీ : సరైన ఆధారాలు ఉంటనే అరెస్టులు చేయాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి)కి సుప్రీంకోర్టు బుధవారం మొట్టికాయ లేసింది. కేసుల దర్యాప్తు సమయంలో ఇడి కక్షసాధింపు చర్యలకు పాల్పడకూడదని, చట్ట ప్రకారం వ్యవహరించాలని కోర్టు హెచ్చరించింది. మనీలాండరింగ్ కేసులో గురుగ్రామ్ కంపెనీకి చెందిన రియల్టి గ్రూప్ ఎం3ఎం డైరెక్టర్లు బసంత్ బన్సాల్, పంకజ్ బన్సాల్‌ల అరెస్ట్‌లను మంగళవారం కొట్టివేస్తూ.. ఇడిపై మండి పడింది. ఈ తీర్పు బుధవారం నోట్ చేయబడింది. తమ అరెస్ట్‌లను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌లను పంజాబ్, హర్యానా హైకోర్టు కొట్టివేయడంతో.. వారు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. జూన్ 14న బన్సాల్‌లను విచారణకు రావాల్సిందిగా సమన్లు జారీ చేశారని, అదే రోజు ఈడి నమోదు చేసిన మరో కేసులో అరెస్ట చేశారని సుప్రీంకోర్టు పేర్కొంది. ఇడీ ప్రతి చర్య పాదర్శకంగా, ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలని సుప్రీంకోర్టు పేర్కొంది. కానీ, ఈ కేసులో దర్యాప్తు సంస్థ తన అధికారాలను, విధులను అనుసరించడంలో విఫలమైందని వాస్తవాలు నిరూపించాయని కోర్టు పేర్కొంది. ప్రశ్నలకు నిందితులు సమాధానం ఇవ్వకపోవడంతో అరెస్టు చేయడం సరికాదని హెచ్చరించింది. మనీలాండరింగ్ చట్టం కింద వారు నేరానికి పాల్పడ్డారని చెప్పేందుకు కచ్చితమైన ఆధారాలను సేకరించి అరెస్టు చేయాలి తప్ప సమన్లకు సరిగా స్పందించలేదని ఎవరినీ అరెస్టు చేయకూడదని పేర్కొంది. అరెస్టు సమయంలో అందుకు గల కారణాలను కూడా నిందితులకు లిఖితపూర్వకంగా అందించాలని సుప్రీంకోర్టు పేర్కొంది. ఇడి మాజీ ప్రత్యేక న్యాయమూర్తి సుధీర్ పర్మార్, అతని మేనల్లుడు రూప్ కుమార్ బన్సాల్ (రియల్టీ సంస్థలో మూడో భాగస్వామి) లంచం ఆరోపణ కేసులో బన్సాల్ సోదరులను ఇడి అరెస్ట్ చేసింది.

అమెరికాలోని కైజర్‌లో 75 వేల మంది హెల్త్ వర్కర్ల సమ్మె

న్యూయార్క్: అమెరికాలో అతిపెద్ద హెల్త్ కేర్ సంస్థ కైజర్ లో ఉద్యోగులు బుధవారం ఉదయం నుంచి సమ్మెకు దిగారు. కంపెనీతో కార్మిక సంఘాలు జరిపిన చర్చలు విఫలమవడంతో 75 వేల మంది మెడికల్ ఆఫీసర్లు, ఇతర సిబ్బంది సమ్మెకు వెళ్తున్నట్లు ప్రకటించారు. ఆసుపత్రుల నుంచి వారు వాకౌట్ చేశారు. అమెరికా చరిత్రలో అతి పెద్ద సమ్మెల్లో ఇది ఒకటిగా నిలిచిపోతుందని కొయిలేషన్ ఆఫ్ కైజర్ పర్మినెంట్ యూనియన్లు తెలిపాయి. పని ఒత్తిడి పెరిగిపోతున్నందున డిపార్టుమెంట్‌లో తగినంత సిబ్బందిని నియమించాలని వారు కోరుతున్నారు. ఈ సమ్మెతో కైజర్ హాస్పిటల్స్ స్తంభించిపోయాయి. కాలిఫోర్నియా, కొలరాడో, ఆరెగావ్, వర్జీనియా, డిస్ట్రిక్ట్ ఆఫ్ కొలంబియా, వాషింగ్టన్‌లలో హెల్త్ కేర్ సెంటర్లు, మెడికల్ ఆఫీసుల్లో సమ్మె సంపూర్ణంగా జరిగింది. మిగతా రాష్ట్రాల్లోనూ సమ్మె మొదలైంది. శనివారం దాకా ఇది కొనసాగవచ్చని భావిస్తున్నారు. సమ్మె చేస్తున్నవారిలో నర్సులు, ఎమర్జెన్సీ డిపార్టుమెంట్ టెక్నిషియన్లు, రేడియాలజీ టెక్నిషియన్లు, ఎక్స్‌రే టెక్నిషియన్లు,, రెస్పిరేటరీ థెరపిస్టులు, మెడికల్ అసిస్టెంట్లు, ఫార్మాసిస్టులు ఉన్నారు. సిబ్బంది కొరత తీవ్రంగా వెంటాడుతుండడంతోబాటు, అధ్వానమైన పని పరిస్థితుల, రోగులకు సదుపాయాలు దిగజారుతుండం వంటివి పరిష్కరించాలన్నా, ఉద్యోగులకు మెరుగైన వేతనాలు చెల్లించాలన్నా ఈ రంగంలో ప్రభుత్వ పెట్టుబడులు పెరగాలని కైజర్ యూనియన్లు కోరుతున్నాయి. కైజర్ సంస్థ అమెరికాలోని ఎనిమిది రాష్ట్రాల్లో 600 మెడికల్ కార్యాలయాలు, 39 హాస్పిటల్స్‌ను నిర్వహిస్తోంది. వీటి ద్వారా కోటి 30 లక్షల మంది రోగులకు సేవలందిస్తున్నది.

కాలిఫోర్నియాలోని కైజర్ సంస్థ ముందు ఉద్యోగుల ఆందోళన

2028లో చంద్రునిపై చైనా పరిశోధనా కేంద్రం!

బీజింగ్ : 2028లో చంద్రుడి అన్వేషణా మిషన్ 'చాంగ్ ఇ-8'ను ప్రయోగించాలని చైనా భావిస్తోంది. చాంగ్ ఇ-7తో కలిసి చాంగ్ ఇ-8 చంద్రుడిపై పరిశోధనలకు నిర్మించే స్టేషన్ మౌలిక స్వరూపాన్ని రూపొందిస్తుందని చైనా జాతీయ రోదసీ సంస్థ (సిఎన్‌ఎస్‌ఎ) ప్రకటించింది. ఇక్కడ జరుగుతున్న 74వ అంతర్జాతీయ ఖగోళ శాస్త్రవేత్తల మహాసభలో సోమవారం ఈ మేరకు ప్రకటన వెలువడింది. చాంగ్ ఇ-8తో ముడిపడిన అంతర్జాతీయ సహకారానికి సంబంధించిన అవకాశాలను కూడా ఆ ప్రకటన వెల్లడించింది. "సమానత్వం, పరస్పర ప్రయోజనాలు, శాంతి కోసం వినియోగం, సమాన అవకాశాలు, సహకారం" అన్న సిద్ధాంతాలకు చైనా లూనార్ ఎక్స్‌ప్లోరేషన్ ప్రాజెక్టు కట్టుబడి వుందని ఆ మహాసభకు సమర్పించిన పత్రం పేర్కొంది. అంతర్జాతీయ సమాజంతో పరస్పర సహకారానికి కూడా సిద్ధంగా వున్నామని పేర్కొంది. మిషన్, సిస్టమ్, యూనిట్ స్థాయిలో సహకరించాల్సిందిగా, పాల్గొనాల్సిందిగా దేశాలను, అంతర్జాతీయ సంస్థలను సిఎన్‌ఎస్‌ఎ ఆహ్వానించింది. గణనీయమైన కొత్త శాస్త్రీయ అన్వేషణలను సంయుక్తంగా సాధించడానికి, మానవాళి భవిష్యత్ ప్రయోజనాలకు దోహదపడేందుకు ముందుకు రావాల్సిందిగా కోరింది. రోదసీ నౌక నుండి రోదసీ నౌకకు సంబంధాలు, సంయుక్త అన్వేషణ, మౌలిక నిర్వహణా సామర్థ్యాలతో చంద్రుని ఉపరితలంపై రోబోలు, అనుబంధ సైంటిఫిక్ పేలోడ్‌లు వంటి ప్రాధాన్యతాపరమైన కర్తవ్యాల్లో అంతర్జాతీయ సహకారాన్ని చైనా కోరుతోంది.

ఇక జాప్యం కూడదు !

- గ్లోబల్ వార్మింగ్‌ను తగ్గించే లక్ష్యాలకు కట్టుబడాలి
- ప్రపంచ నేతలకు పోప్ పిలుపు

వాటికన్ సిటీ : వాతావరణ మార్పులు నెమ్మదించే లక్ష్యాలకు కట్టుబడి వుండాల్సిందిగా పోప్ ఫ్రాన్సిస్ ప్రపంచ నేతలను కోరారు. ఇంకా ఆలస్యం కాకుండా ఈ విషయంలో తొందరపడాల్సి వుందని ఆయన హెచ్చరించారు. ప్రపంచంలోని అత్యంత నిరుపేదలు, ఒడిదుడుకులను ఎదుర్కొంటున్న వారు ఇప్పటికే ఈ వాతావరణ మార్పులకు అధిక మూల్యం చెల్లిస్తున్నారని గుర్తు చేశారు. మానవాళికి, భూగోళానికి ఇప్పటికే జరగరాని నష్టం జరిగిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే కలిగిన నష్టాన్ని మనమెలాగూ పూడ్చలేం, కనీసం మరింత నష్టం వాటిల్లకుండా నిలువరించేందుకన్నా మనం ప్రయత్నించాల్సి వుందన్నారు. ప్రధానంగా అమెరికాను ఉద్దేశించి ఆయన వ్యాఖ్యలు చేశారు. అమెరికాలో తలసరి కాలుష్య ఉద్గారాల విడుదల చైనాతో పోలిస్తే రెట్టింపుగా వుందని అన్నారు. అదే పేద దేశాల సగటుతో పోల్చుకుంటే ఏడు రెట్లు ఎక్కువగా వుందన్నారు. వ్యక్తిగత, కుటుంబాల స్థాయిలో జరుగుతున్న ప్రయత్నాలు కొంతమేరకు దోహదపడుతున్నప్పటికీ, సుదీర్ఘకాలంలో గణనీయమైన ప్రభావాన్ని చూపగలిగే, పశ్చిమ దేశాల నమూనాతో ముడిపడిన బాధ్యతారాహిత్యమైన జీవనశైలిలో విస్తృతమైన మార్పులు తీసుకురావాల్సి వుందన్నారు. ప్రెయిజ్ గాడ్ పేరుతో ఒక డాక్యుమెంట్‌ను ఆయన ఈ సందర్భంగా విడుదల చేశారు. దుబాయ్‌లో తదుపరి దఫా ఐక్యరాజ్య సమితి చర్చలకు వాతావరణ లక్ష్యాలను నిర్దేశించుకోవాలని ఆయన కోరారు.

వెనుకబడిన తరగతుల గణన నిర్వహించాలి

- కాంగ్రెస్ డిమాండ్

న్యూఢిల్లీ : వెనుకబడిన తరగతుల సంక్షేమం కోసం చర్యలు తీసుకోవడానికి వెనుకబడిన తరగతుల గణన జరగాలని కాంగ్రెస్ కోరుకుంటోందని ఆ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖార్గె తెలిపారు. కుల గణన నిర్వహించినట్లైతే వారి స్థితిగతులకు సంబంధించిన కచ్చితమైన వివరాలు తెలుస్తాయని, అప్పుడు వారి సంక్షేమానికి చర్యలు తీసుకోవడం సులభమవుతుందని చెప్పారు. దేశాన్ని విభజించడానికి కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని ప్రధాని నరేంద్ర మోడీ ఆరోపించడాన్ని ఆయన విమర్శించారు. దేశ ప్రజలకు చైతన్యవంతులుగా మారారని, ఇక 2024లో మోడీ ఆటలు సాగవని అన్నారు. రాయ్‌ఘడ్ జిల్లాలో కొద్‌తరాయ్ గ్రామంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌లు మహిళా వ్యతిరేక సిద్ధాంతాలను కలిగివున్నాయని విమర్శించారు. మహిళలు, వెనుకబడిన తరగతులు, నిరుపేదల గురించి బిజెపి నిజంగా ఆందోళన చెందుతున్నట్లైతే ఇప్పుడే మహిళా రిజర్వేషన్‌ను అమలు చేయాలన్నారు. మహిళలు ముందుకు రావాలని ఆ పార్టీ కోరుకోవడం లేదన్నారు. వెనుకబడిన తరగతుల కుల గణన జరిగితే ఎంతమంది వెనుకబడ్డారు, వారిలో ఎంతమంది అక్షరాస్యులు, ఎంతమంది ఆర్థికంగా వెనుకబడ్డారు వంటి వివరాలు తెలుస్తాయన్నారు. అప్పుడు వారి ప్రయోజనాల కోసం చర్యలు తీసుకోవడానికి వీలు వుంటుందన్నారు. అందుకే నిరుపేదల, వెనుకబడిన వర్గాల గణన జరగాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోందన్నారు.

బీహార్ బాటలో ఒడిశా..!

- కుల గణన షురూ

భువనేశ్వర్ : బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ బాటలో ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ నడుస్తున్నారు. బీహార్ లో ఇటీవల కుల గణన నివేదికను ఆ రాష్ట్ర ప్రభుత్వం బయటపెట్టింది. లోక్‌సభ ఎన్నికలకు ముందే నవీన్ పట్నాయక్ ప్రభుత్వం కుల గణన చేపట్టి సర్వే వివరాలు విడుదల చేయాలని భావిస్తోంది. ఇందులో భాగంగా తొలుత వెనకబడిన తరగతుల జనాభా గణనకు పూనుకుంది. ఇప్పటికే రంగంలోకి దిగిన అధికారులు విస్తృతంగా సర్వే చేస్తున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను త్వరలో విడుదల చేయనున్నట్లు తెలుస్తోంది. ఓబీసీ గణనపై తమ ప్రభుత్వం కమిట్‌మెంట్ తో ఉందని బిజు జనతాదళ్ ఎమ్మెల్యే ఒకరు వ్యాఖ్యానించారు. అదే సమయంలో బీహార్ ప్రభుత్వం కుల గణన సర్వే నివేదిక విడుదల చేయడంతో దేశ వ్యాప్తంగా మళ్లీ చర్చ మొదలైంది. ఆ సర్వే ప్రకారం.. బీహార్ లో 63 శాతం జనాభా ఓబీసీ, ఈబీసీలే ఉన్నారు. ఒడిశాలో ఈ ప్రక్రియ పూర్తయ్యాక మిగతా రాష్ట్రాలపై సైతం కుల గణన చేయాలని ఒత్తిడి చేసే అవకాశం ఉంది. అసోంలో మాత్రం మైనార్టీల(ముస్లిం) జన గణనను ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ చేపట్టారు.

**IN THE COURT OF
THE HON'BLE V ADDL. DISTRICT JUDGE,
VIJAYAWADA
E.P. No. 910/2019
IN
A.O.P. No. 380/2014**

Between:
M/s. Shriram Transport Finance Co. Ltd.,
Rep. by its Authorized Signatory ...DHR/Claimant
Vs
1. Akku Naidu Gadi & Others ... JDRs/Respondents

NOTICE TO JDR NO.1 / RESPONDENT'S

1) Akku Naidu Gadi, S/o. Sanyasi, D.No. 22-17-5C, ward No. 26,Bhanu Nagar, Madhura Nagar, Vijayawada - 520011.

Take notice that the above Execution Petition filed by the DHR/Claimant praying orders against JDR 1&2. The same is posted to **05/10/2023** for your appearance on that day you should attend the court in person or through an advocate at 10.30 A.M. failing which the matter will be decided in your absence by the Hon'ble Court.

(BY ORDER OF THE HON'BLE COURT)
P. BABU RAO, B. SURYA PRAKASH
Advocate, D.No. 27-22-28, J.D. Hospital Road, Governorpet, Vijayawada - 520002.
Mail ID: mrbsprao@gmail.com

**IN THE COURT OF
THE HON'BLE V ADDL. DISTRICT JUDGE,
VIJAYAWADA
E.P. No. 991/2022
IN
A.O.P. No. 211/2021**

Between:
M/s. Shriram Transport Finance Co. Ltd.,
Rep. by its Authorized Signatory ...DHR/Claimant
Vs
1. Oruganti Ramesh
2. Venkata Suresh Medarametla ... JDRs/Respondents

NOTICE TO JDR NO.1&2/ RESPONDENT'S

1) Oruganti Ramesh, D.no:5-78, Near Vaishnavi Apartments, Ramavarappadu, Near Vaishnavi Apartments, Krishna - 521108.

2) Naga Linga Vara Prasad Budda Raju, D.No: 1-4-204, Lalitha Nagar, Bhavani Puram, Near Apple Store Company, Vijayawada, Krishna, AP-520012.

Take notice that the above Execution Petition filed by the DHR/Claimant praying orders against JDR 1&2. The same is posted to **06/10/2023** for your appearance on that day you should attend the court in person or through an advocate at 10.30 A.M. failing which the matter will be decided in your absence by the Hon'ble Court.

(BY ORDER OF THE HON'BLE COURT)
D. ANJANAYA PRASAD
Advocate for the Petitioner / DHR,
Vijayawada.

**OFFICE OF THE RECOVER OFFICER - I
DEBTS RECOVERY TRIBUNAL
(Department of Financial Services, Ministry of Finance, Government of India)**
31-31-21, Narayan Bhawan, Sai Baba Street, Dabagardens, Visakhapatnam - 530020

DEMAND NOTICE
(NOTICE UNDER SECTIONS 25 TO 28 OF THE RECOVERY OF DEBTS & BANKRUPTCY ACT, 1993 AND RULE 2 OF SECOND SCHEDULE TO THE INCOME TAX ACT, 1961)

RC/1069/2019 **11-09-2023**

Punjab National Bank, Arundalpet Branch, Guntur, Guntur District
Versus
M/s. Madhavi Traders & Others

To:
(CD -1) M/s. Madhavi Traders, Rep.by its Prop: Mahankali Nagaraju, Hollywood Theatre, Back side Road, Brodipet, 6/13 Line, Guntur - 522006.
(CD -2) Sri Mahankali Nagaraju, H.No.15-13-155, Gandhi Nagar, 2nd Line, RTC Colony, Guntur - 522001.
(CD -3) Smt. Musuluri Bhanu Priya, W/o. Sri Ram Babu, H.No.10-27-60/2, 5th Lane, Muttayapalem, Guntur - 522020.

This is to notify that as per the Recovery Certificate issued in pursuance of orders passed by the Presiding Officer, Debts Recovery Tribunal, Visakhapatnam in **OA/580/2018** an amount of **Rs.2,30,74,150/-** (Rupees Two Crore Thirty Lakhs Seventy Four Thousand One Hundred and Fifty Only) along with pendentellite and future interest **@10.15%** p.a. compounded monthly rests from **13.04.2018** till realization/date of payment and costs of **Rs.1,94,000/-** (Rupees one Lakh Ninety Four Thousand Only) has become due against you (Jointly and severally/Fully/Limited).

You are hereby directed to pay the above sum within 15 days of the receipts of the notice, failing which the recovery shall be made in accordance with the Recovery of Debts Due to Banks and Financial Institutions Act, 1993 and Rules there under.

You are hereby ordered to declare on an affidavit the particulars of yours assets on or before the next date of hearing.

You are hereby ordered to appear before the undersigned on **09/10/2023 at 10:30 a.m.** for further proceedings.

In addition to the sum aforesaid you will be liable to pay, ...

a) Such interest as is payable for the period commencing immediately after this notice of the execution proceedings.

b) All costs, charges and expenses incurred in respect of the service of this notice and other process that may be taken place for recovering the certificate amount.

(Given under my hand and the seal of the Tribunal, on this day 11th September 2023)

(Avasarala Anil)
Recovery Officer
Debts Recovery Tribunal, Visakhapatnam

**OFFICE OF THE RECOVER OFFICER - I
DEBTS RECOVERY TRIBUNAL
(Department of Financial Services, Ministry of Finance, Government of India)**
31-31-21, Narayan Bhawan, Sai Baba Street, Dabagardens, Visakhapatnam - 530020

DEMAND NOTICE
(NOTICE UNDER SECTIONS 25 TO 28 OF THE RECOVERY OF DEBTS & BANKRUPTCY ACT, 1993 AND RULE 2 OF SECOND SCHEDULE TO THE INCOME TAX ACT, 1961)

RC/1007/2019 **11-09-2023**

Punjab National Bank, Arundalpet Branch, Guntur, Guntur District
Versus
M/s. Chandrika Traders & Others

To:
(CD -1) M/s. Chandrika Traders, Rep.by its Prop: Smt. Mahankali Madhavi, D.No.5-93-30/A, Hollywood Theatre, Backside, Brodipet, 6/13 Line, Guntur - 522006.
(CD -2) Smt. Mahankali Madhavi, W/o. Mahankali Nagaraju, H.No.15-13-155, Gandhi Nagar, RTC Colony, Guntur - 522001.
(CD -3) Sri Mahankali Nagaraju, S/o. Durga Rao, H.No.15-13-155, Gandhi Nagar, RTC Colony, Guntur - 522001.

This is to notify that as per the Recovery Certificate issued in pursuance of orders passed by the Presiding Officer, Debts Recovery Tribunal, Visakhapatnam in **OA/607/2018** an amount of **Rs.59,71,960/-** (Rupees Fifty Nine Lakhs Seventy One Thousand Nine Hundred and Sixty Only) along with pendentellite and future interest **@11.25%** p.a. compounded monthly rests from **16.04.2018** till realization/date of payment and costs of **Rs.91,000/-** (Rupees Ninety One Thousand Only) has become due against you (Jointly and severally/Fully/Limited).

You are hereby directed to pay the above sum within 15 days of the receipts of the notice, failing which the recovery shall be made in accordance with the Recovery of Debts Due to Banks and Financial Institutions Act, 1993 and Rules there under.

You are hereby ordered to declare on an affidavit the particulars of yours assets on or before the next date of hearing.

You are hereby ordered to appear before the undersigned on **09/10/2023 at 10:30 a.m.** for further proceedings.

In addition to the sum aforesaid you will be liable to pay, ...

a) Such interest as is payable for the period commencing immediately after this notice of the execution proceedings.

b) All costs, charges and expenses incurred in respect of the service of this notice and other process that may be taken place for recovering the certificate amount.

(Given under my hand and the seal of the Tribunal, on this day 11th September 2023)

(Avasarala Anil)
Recovery Officer
Debts Recovery Tribunal, Visakhapatnam

మీకోసం

ఒక కప్పు ఉసిరి పొడి, రెండు కప్పుల పెరుగు కలిపి రాత్రంతా నాననిచ్చి, మరుసటి రోజు తలకు పట్టించి, ఒక గంట తర్వాత కడిగేయాలి. వారానికోసారి ఇలా చేస్తుంటే తెల్లజుట్టు నల్లబడుతుంది.

జీవన సౌరభం

చేయగలిగే శక్తి ఉన్నవాడికంటే, చెయ్యాలనే కోరిక, సంకల్పం ఉన్నవాడు ఎక్కువ చెయ్యగలడు.

పాటల మాస్టారు



ఆ పాఠశాలకు కొత్తగా సైన్సు మాస్టారు వచ్చారు. ఆయనకు పాటలంటే చాలా ఇష్టం. పిల్లలకు రోజూ పాటల రూపంలోనే పాఠాలు చెప్పేవారు. ఒకరోజు పరిసరాల విజ్ఞానంలో ప్రాజెక్టు పని చేయమని పిల్లలకు చెప్పారు. అయితే వారి కష్టాలు, ఇష్టాలు అన్నీ పాటల రూపంలోనే చెప్పాలని షరతు పెట్టారు.

విద్యార్థులు గ్రూపులుగా తయారయ్యి ప్రాజెక్టు పని పూర్తి చేశారు. మరుసటి రోజు మాస్టారు క్లాసు ప్రారంభమైంది.

'ఏ' గ్రూపులో ఒక విద్యార్థి లేచి 'మీ నాన్నెలా ఉంటాడని– ఎవరైనా అడిగితే– మా అన్నలా ఉంటాడని అంటాను నేను' అని పాడాడు. ఆ పాట ఎందుకు ఎంపిక చేసుకున్నావు అని మాస్టారు అడిగారు. 'నాకు అమ్మానాన్న లేరు సార్! మా అన్నయ్యే కష్టపడి ఇల్లు నడిపిస్తున్నాడు' అని అన్నాడు. మరో విద్యార్థి లేచి 'జగమంత కుటుంబం నాది– ఏకాకి జీవితం నాది' అని పాడి 'నేను అనాథను సార్... హాస్టల్లో ఉంటూ చదువుకుంటున్నాను' అని అన్నాడు.

'బి' గ్రూప్ విద్యార్థి లేచి 'అయ్యా నే చదివి బాగుపడతా– ఓరయ్య నే చదువు బాగుపడతా– పుస్తకాలు చదివి నేను– మన బతుకులు మారుస్తా' అని పాడుతూ' మా నాన్న మేకలు కాయడానికి వెళ్ళమంటాడు సార్' అని అన్నాడు.

'సి'గ్రూప్‌లో నుంచి ఒక పిల్లవాడు లేచి 'భలే మంచి రోజు– పసందైన రోజు' అని పాడి, 'మా నాన్నకు ఉద్యోగం వచ్చింది సార్' అని అన్నాడు. మరో విద్యార్థి లేచి 'చందమామ కథలో చదివా– రెక్కల గుర్రాలు ఉంటాయని' అంటూ 'నాకు హాయిగా పక్షుల్లా ఆకాశంలో ఎగరాలని ఉంది సార్' అని అన్నాడు.

'డి' గ్రూప్ నుంచి ఒక విద్యార్థి లేచి 'కొత్తగా రెక్కలొచ్చినా–గూటిలోని గువ్వపిల్లకు' 'నేను ఫ్యాక్టరీలో పని చేస్తుంటే అధికారులు విడిపించి ఈ బడిలో చేర్పించారు సార్' అని అన్నాడు. మరో విద్యార్థి లేచి 'ఏమున్నదక్కో ఏమున్నదక్కో– ముల్లె సర్దుకుని వెళ్ళిపోతావున్న' అని పాడుతూ 'మా అమ్మ నాన్న వలస వెళ్లిపోతామంటున్నారు సార్' అని ఏడుస్తూ అన్నాడు. ఇలా పిల్లలంతా పాటలు పాడుతూ వారి బాధలు, ఇష్టాలు, కష్టాలు చెబుతున్నప్పుడే పాఠశాలకు డిఇఓ వచ్చారు.

పిల్లలకు పాఠాలు చెప్పకుండా పాటలు, డాన్సులతో కాలక్షేపం చేస్తున్నారని మాస్టారు మీద స్కూలు సిబ్బంది డీఈవో గారికి ఫిర్యాదు చేశారు. దీంతో తనిఖీ చేసేందుకు వచ్చిన డిఇఓ, మాస్టారు క్లాసు ముందే నిలబడి జరిగిందంతా చూశారు. చివర్లో ఆయన కూడా 'నూటికో కోటికో ఒక్కరు– ఎప్పుడో ఎక్కడో పుడతారు– అది మీరే మీరే మాస్టారు' అంటూ' ప్రాజెక్టు పని పేరుతో పిల్లల ఇష్టాయిష్టాలు, సాధకబాధలు అన్నీ తెలుసుకున్న మీకు అభినందనలు' అని మెచ్చుకున్నారు.

- ద్వారపురెడ్డి జయరాం నాయుడు,
94415 19570

నేను గీసిన బొమ్మ

అనుముల లక్ష్మి పర్ణిక,
3వ తరగతి,
బృందావన్ ఇంగ్లీషు మీడియం స్కూలు,
చిత్తూరు.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

నిరుపేద కుటుంబం వారిది. చదువు బతుకును బాగు చేస్తుందని మాత్రమే వారికి తెలుసు. కానీ చదివేది ఎలా? కూలి పనులు చేసి కుటుంబాన్ని పోషించే నాన్న, మానసిక వైకల్యంతో బాధపడే అమ్మ వెరసి రెండుపూటలా తిండి దొరకడమే కష్టమైన కుటుంబం. చీకటైతే అందరిళ్లల్లో కరెంటు దీపాలు వెలిగినా, వారింట్లో గుడ్డి దీపమే కాంతిపుంజమయ్యేది. ఆ వెలుగులోనే భవిష్యత్తుకై బంగారు కలలు కన్నారు. ఆ దిశగా నేడు ఆ కుటుంబంలో అన్నదమ్ములు ఇద్దరూ, ఆ ఇంటి కోడలు ... ముగ్గురూ ఏకకాలంలో పిహెచ్‌డి సాధించారు. 'ఈ విజయం వెనుక వారి కష్టం ఎంతో వుంది' అని ఒక్క మాటలో చెప్పలేం. వారు ఎంతో శ్రమించారు. ఎన్నో అవమానాలు పడ్డారు. మంచానికే పరిమితమైన ఓ ప్రొఫెసరమ్మకు అన్ని సపర్యలూ చేస్తూ చదువులు సాగించారు. ఎట్టకేలకు డాక్టరేట్లు పొందారు. అర్హతకు తగిన ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్నారు.

ఈ డాక్టరేట్ల వెనక వెతలెన్నో..!

అంబేద్కర్ కోనసీమ జిల్లా, ముమ్మిడివరం మండలం గున్నెపల్లి గ్రామానికి చెందిన పాము సత్య వరప్రసాద్, పాము శాంతి (ప్రసాద్ భార్య), పాము ఆనంద్ ఇటీవల ఆంధ్రా యూనివర్శిటీ నుంచి ఒకేసారి డాక్టరేట్లు పొందారు. పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో శాంతి, కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగంలో ప్రసాద్, ఆనంద్ పిహెచ్‌డీ చేశారు. ఇదంతా ఆషామాషీగా జరగలేదు. అనేక కష్టాలూ ఆకలి బాధలూ ఎదుర్కొని వారీ విజయం సాధించారు.

తన నేపథ్యం గురించి ప్రసాద్ ఇలా చెప్పారు : 'అక్క, తరువాత నేను పుట్టినప్పుడు అమ్మ మానసిక ఆరోగ్యం దెబ్బతింది. ఎంతలా అంటే నన్ను కొడుకుగా గుర్తించలేకపోయేది. పాలు ఇచ్చేది కాదు. ప్రాణాలు నిలిపేందుకు గంజినీళ్లు పట్టేవాళ్లమని అమ్మమ్మ తరువాత నాతో చెప్పేది. నాన్నకు మా పోషణే చాలా భారంగా ఉండేది. అమ్మ ఆరోగ్యం దెబ్బతినడం నాన్నపై మరింత బాధ్యత పడింది. ఇటువంటి పరిస్థితుల్లో చదువుపై శ్రద్ధ పెట్టడం ఆషామాషీ కాదు. పదో తరగతిలో లెక్కలు, హిందీ సబ్జెక్టుల్లో ఫెయిల్ అయ్యాను. నాతో పాటు ఫెయిలైన వారంతా కంపెనీల్లో పనులకు వెళ్లిపోయారు. నేను మాత్రం ఆ పరీక్షలు మళ్లీ కట్టి పాసయ్యాను. ఎలాగోలా ఊళ్లో ఉంటూనే ఇంటర్, డిగ్రీ పూర్తిచేశాను. ఇంకా చదువుకోవాలని ఆశ. కానీ మార్గం కనిపించలేదు'.

మలమూత్రాదులు ఎత్తి ...

ఆ సమయంలో నా గురించి బాగా తెలిసిన మా ఊరి ప్రొఫెసర్ వాళ్లింటికి నన్ను పిలిచారు. ఆయన భార్య కూడా ప్రొఫెసర్. 'అనారోగ్య కారణాలతో మంచానికే పరిమితమైన ఆమె చక్రాల కుర్చీలోనే యూనివర్శిటీకి హాజరయ్యేవారు. ఇంటి దగ్గర ఆమె ఆలనా పాలనా చూసుకోవడం మాస్టారికి చాలా ఇబ్బంది అయ్యేది. వారికి మేము దూరపు బంధువులం. 'మేడమ్ బాగోగులు పట్టించుకుంటూ, నీ ఉన్నత చదువులు

పూర్తిచేసుకోవచ్చు. మా ఇంటికి వచ్చేయ్' అని ఆయన అన్నారు. ఆ మాటకు చాలా సంతోషించాను. అక్కడికి వెళ్లాక మేడమ్‌కి అన్నం తినిపించడం దగ్గర నుంచి మలమూత్రాదులకు కూర్చోబెట్టడం, ఎత్తి పారేయడం వంటి వన్నీ చేయాల్సి వచ్చేది. ఆమెను నా తల్లిగా భావించి అన్నీ చేశాను. ఎంబిఎ, ఎంఫిల్ అక్కడే పూర్తిచేశాను. తమ్ముడు ఆనంద్ మాత్రం మొన్నమొన్నటి వరకు అంటే పిహెచ్‌డి చేసేటప్పుడు కూడా మేడమ్‌కి సపర్యలు చేశాడు.

'ఉన్నత విద్య చదువుకుంటూ మీరేంటి ఇలాంటి పనులు చేస్తున్నారు. జీతం ఇస్తే చాలామంది పనివారు దొరుకుతారు. చదువు సాకు పెట్టి మీతో ఊరికినే చాకిరీ చేయించుకుంటున్నారు. మీ అవసరం తీరిపోయాక మిమ్మల్ని బయటికి గెంటేస్తారు' అంటూ మా చుట్టూ ఉన్నవాళ్లు అనేవారు. మేము అవేమీ పట్టించుకోలేదు. పేద కుటుంబంలో పుట్టిన మాకు చదువుకునే మార్గం చూపించిన మాస్టారంటే మాకు ఎప్పుడూ గౌరవం ఉండేది. మేడమ్ మా పట్ల ఎంతో ఆప్యాయత చూపించేవారు' అని ప్రసాద్ వివరించారు.

జూనియర్ లెక్చరర్ ఉద్యోగం వదిలేసి ...

ప్రొఫెసర్ ఇంట్లో పనిచేస్తున్న ప్రసాద్‌ని అక్కడే మేడమ్ దగ్గర క్లాసులకు హాజరయ్యే శాంతి చాలాసార్లు చూశారు. 'మగ మనిషి ఒక మహిళకు ఇలాంటి సేవలు చేస్తున్నాడేంటి అని చాలా ఆశ్చర్యపోయేదాన్ని. ఉండబట్టలేక ఒకసారి అడిగేశాను. 'ఆమెలో నాకు నా తల్లి కనపడుతోంది. తనకే ఇటువంటి పరిస్థితి వస్తే వదిలేయను కదా!' అని ఆయన సమాధానం ఇచ్చాడు. దాంతో తనపై గౌరవం పెరిగింది' అని చెప్పారు శాంతి. తరువాత వాళ్లిద్దరూ మంచి స్నేహితులు, భార్యాభర్తలూ అయ్యారు. పీజీ పూర్తి చేసిన శాంతి కాంట్రాక్ట్ జూనియర్ లెక్చరర్‌గా బాధ్యతలు నిర్వహించేవారు. భర్త ప్రసాద్ పిహెచ్‌డికి సిద్ధమవ్వడంతో తను కూడా ఉద్యోగాన్ని విడిచిపెట్టి 2013లో పిహెచ్‌డి అడ్మిషన్ పొందారు. తమ ప్రతిభతో రాజీవ్‌గాంధీ ఫెలోషిప్‌కి ఎంపికై నామమాత్రపు ఉపకార వేతనంతోనే 2018 నాటికి పరిశోధన పూర్తి చేశారు.

మహిళా పోలీసుగా ఆదర్శ సేవలు

పిహెచ్‌డి పూర్తి చేసిన శాంతి గెస్ట్ లెక్చరర్‌గా విధులు నిర్వహిస్తూ, రాష్ట్రప్రభుత్వ సచివాలయ పోస్టులకు దరఖాస్తు చేసుకుని అల్లూరి జిల్లా గూడెం కొత్తవీధి ప్రాంత మహిళా పోలీసుగా నియమితులయ్యారు. సారా బట్టీల ధ్వంసం, స్కూలు డ్రాపౌట్లను బడికి పంపించడం, గర్భిణీలను సకాలంలో ఆస్పత్రికి చేరవేయడం వంటి ఎన్నో విధుల్లో ఆదర్శంగా నిలుస్తున్నారు. 'నా లక్ష్యం ప్రొఫెసర్ అవ్వడం. అందుకే సమయం చేసుకుని మరీ పిహెచ్‌డీ చేశాను. ఉద్యోగంలో ఉండగానే వైవాకి పిలిచారు. అప్పుడు 'పిహెచ్‌డీ చేసేవాళ్లు పోలీసు ఉద్యోగం ఎందుకు చేస్తున్నారు?' అని కొందరు హేళన చేశారు. ఈ ఉద్యోగం నా కుటుంబాన్ని నడిపిస్తుంది. నాకు లేని ఇబ్బంది మీకెందుకు? అని వారితో వాదించాను. మాలాంటి వాళ్లు చదువుకోవడమే కొంతమందికి గిట్టదు. అవకాశం ఉన్న ప్రతిచోటా మమ్మల్ని అడ్డుకోవాలని చూస్తారు. వాటన్నింటికీ భయపడితే ఈరోజు ఇంత ఉన్నత స్థానం దక్కేది కాదు' అని శాంతి పేర్కొన్నారు. ప్రొఫెసర్‌గా పని చేయడమే తన చిరకాల కల అని ఆమె అంటున్నారు.

ఉన్నత విద్య చదివినా ఉపాధి లేదు

'బాగా చదువుకోవాలని ఎంతో కష్టపడ్డాను. మేడమ్‌కి సేవ చేస్తూ పదేళ్ల పాటు అక్కడే ఉండిపోయాను. చదువులో ఆమె ఎన్నో సూచనలు ఇచ్చేవారు. పిహెచ్‌డి పూర్తి చేయడంలో గైడ్ జాలాది రవి మా ముగ్గురిని ఎంతో ప్రోత్సహించారు. 2020 నాటికి పిహెచ్‌డి సమర్పించాను. 2022 డిసెంబరు 22న పిహెచ్‌డి అవార్డు వచ్చింది. అన్నయ్య, వదిన అంతకు ముందే పిహెచ్‌డి చేసినా కరోనా వల్ల అవార్డు ఇవ్వడం ఆలస్యమైంది. దీంతో ఇప్పుడు ముగ్గురం ఒకేసారి పట్టా తీసుకున్నాం.' అని ఆనంద్ చెప్పారు.

'పిహెచ్‌డి పట్టాతో కాలేజీలకు వెళితే.. 'రూ.5 వేలు జీతం ఇస్తామన్నారు. చాలా బాధేసింది. తిరిగి ఊరు వచ్చేశాను. వ్యవసాయ కూలీగా పొలంలో అన్ని పనులూ చేసేవాడ్ని. డ్రైవరుగా వెళ్లేవాడ్ని. ఉపాధి పనులకు వెళ్లాను. పిహెచ్‌డీ చేసి ఈ పనులు చేయాల్సివచ్చిందని చాలాసార్లు బాధేసింది. ఈ రోజుల్లో విద్యకు తగ్గ ఉపాధి దొరకడం లేదు. ఇప్పుడు కూడా భద్రత లేని గెస్ట్ లెక్చరర్‌గా పని చేస్తున్నాను' అంటూ ఆనంద్ చెబుతున్నప్పుడు ఆయన మాటల్లో ఎంతో ఆవేదన కనిపించింది.

ఈ ముగ్గురూ పేదింట్లో పుట్టి పిహెచ్‌డీలు చేసి బంగారు భవిష్యత్తుకై ఎన్నో కలలు కంటున్నారు. వారి ఆశలు నెరవేరాలని కోరుకుందాం.

- జ్యోతిర్మయి

13న 'తంతిరం' సినిమా విడుదల

శ్రీకాంత్ గుర్రం, ప్రియాంక శర్మ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం తంతిరం. దర్శకుడుగా ముత్యాల మెహర్ దీపక్ పరిచయం అవుతున్నారు. బండి బ్యానర్‌లో శ్రీకాంత్ కంద్రుగుల నిర్మాతగా నిర్మించిన చిత్రం ఈనెల 13న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ప్రీ రిలీజ్ బుధవారం హైదరాబాద్‌లో జరిగింది. సంగీత దర్శకుడు అజయ్ అరసడ, చిత్ర రచయితలు షాబాజ్, వినీత్, దర్శకుడు ముత్యాల మెహర్ దీపక్ మాట్లాడారు. 'తంతిరం చిత్రంలో చాలా థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ వున్నాయి. ప్రియాంక శర్మ, హీరో శ్రీకాంత్ సినిమాలోకి తీసుకెళ్ళిపోతారు.

పూర్తి వినోదంగా రూల్స్ రంజన్
కిరణ్ అబ్బవరం

కిరణ్ అబ్బవరం, నేహా శెట్టి ప్రధాన పాత్రలు పోషించిన చిత్రం 'రూల్స్ రంజన్'. ఈనెల ఆరో తేదీన ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. బుధవారం విలేకర్లతో కథానాయకుడు కిరణ్ అబ్బవరం సినిమాకి సంబంధించిన పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. 'రూల్స్ రంజన్ టైటిల్‌ని బట్టి ఇది రూల్స్‌కి సంబంధించినది అనుకోవద్దు. ఇది పూర్తి వినోదాత్మక చిత్రం. చిత్ర ప్రచార కార్యక్రమాలను ప్రారంభించినప్పటి నుండి నేను ఇలాగే చెబుతున్నాను. ప్రేక్షకులు ఈ సినిమా నుంచి అన్ లిమిటెడ్ కామెడీని మాత్రమే ఆశించాలి. ట్రైలర్‌ని చూసినప్పుడు మీరు ఎలా నవ్వుకున్నారో.. 2 గంటల 30 నిమిషాల రన్‌టైమ్ మొత్తం సిచువేషనల్ కామెడీని చూసి ప్రేక్షకులు నవ్వుతూనే ఉంటారని నేను చెప్పగలను. నిర్మాత ఎఎం రత్నం కుమారుడు రత్నం కృష్ణ దర్శకత్వం వహించారు. స్టార్ లైట్ ఎంటర్‌టైన్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ బ్యానర్‌పై మురళీకృష్ణ వేమూరి, దివ్యాంగ్ లావానియా నిర్మించారు. ఈ సినిమాలో వెన్నెల కిషోర్, సుబ్బరాజు, వైవా హర్ష, హైపర్ ఆది, మెహర్ చాహల్, అజయ్, మకరంద్ దేశ్‌పాండే, అతుల్ పర్చురే, అన్నూ కపూర్, అభిమన్యు సింగ్ కీలక పాత్రల్లో నటించారు' అని వివరించారు.

'రామాయణం'లో సాయిపల్లవి

బాలీవుడ్ ఫిలిం మేకర్ నితేశ్ తివారీ తెరకెక్కిస్తున్న 'రామాయణం'లో రాముడి పాత్రలో రణ్‌బీర్ కపూర్, రావణుడి పాత్ర కోసం యష్ నటిస్తున్నారని తెలిసిందే. తాజా సమాచారం ప్రకారం సీత పాత్రలో సాయిపల్లవి కనిపించనున్నారు. ప్రస్తుతం ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ పనులు జోరుగా జరుగుతున్నాయి. ఇటీవలే సాయి పల్లవి లుక్ టెస్ట్‌లో పాల్గొన్నారని బాలీవుడ్ వర్గాలు తెలిపాయి. ఈ సినిమా కోసం సాయి పల్లవి బల్క్ డేట్స్ కేటాయించారని తెలుస్తోంది. ఈ సినిమా షూటింగ్ ఫిబ్రవరి 2024లో ప్రారంభం కానుంది. వచ్చే ఏడాది జులైలో యష్ సెట్స్‌లోకి జాయిన్ అవుతాడు. ఈ సినిమా కోసం మేకర్స్, టాప్ హాలీవుడ్ స్టూడియోస్‌తో కలసి పని చేస్తున్నారు. మొదటి భాగం షూటింగ్ ఆగస్టు చివరి నాటికి పూర్తవుతుందని అంచనా వేస్తున్నారు.

అక్టోబరు 6న సిద్ధార్థ్ 'చిన్నా'

సిద్ధార్థ్ నటించిన తాజా చిత్రం 'చిత్తా' తెలుగులో అక్టోబరు 6న విడుదలవుతోంది. అరుణ్ కుమార్ దర్శకత్వం వహించిన ఈ సినిమా తమిళంలో 'చిత్తా' పేరుతో సెప్టెంబరు 28న విడుదలై విమర్శకుల ప్రశంసలు అందుకుంది. తాజాగా ఈ చిత్రం సెన్సార్ కార్యక్రమాలు పూర్తి చేసుకుంది. సెన్సార్ బోర్డ్ యు/ఎ సర్టిఫికేట్ జారీచేసింది. సహస్ర శ్రీ, నిమిషా విజయన్, అంజలి నాయర్, ఇతరులు ఈ చిత్రంలో కీలక పాత్రలు పోషిస్తున్నారు.

జ్యోతి సురేఖకు స్వర్ణం

నీరజ్, 4×400మీ. పరుగులోనూ పసిడి • భారత్ ఖాతాలో రికార్డు పతకాలు

ఆర్చరీ మిక్స్‌డ్‌లో స్వర్ణం నెగ్గిన జ్యోతి సురేఖ

హాంగ్జౌ: 19వ ఆసియా క్రీడల్లో భారత్‌కు పతకాల పంట పండుతోంది. ఈసారి 100 పతకాలపై గురి పెట్టిన భారత్ ఆ ఫీట్‌ను అందుకొనే దిశగా దూసుకెళ్తోంది. ఈ క్రమంలో తొలి రోజు నుంచి పతకాలు కొల్లగొడుతోంది. గురువారం భారత్‌కు మరో 12 పతకాలు దక్కాయి. దీంతో భారత్‌కు దక్కిన పతకాల సంఖ్య 81కు చేరింది. తాజాగా ఆర్చరీ మిక్స్‌డ్, జావెలిన్, 4క్ష్మ400మీ. పరుగులో స్వర్ణ పతకాలు దక్కాయి. దీంతో భారత్ 18స్వర్ణ, 31రజత, 32కాంస్యాలతో నాల్గో స్థానంలో నిలిచింది. అదే క్రమంలో ఇండోనేషియా వేదికగా జరిగిన 18వ ఆసియా క్రీడల్లో దక్కిన అత్యధిక(70) పతకాల రికార్డు (16స్వర్ణ, 23రజత, 31కాంస్య) తాజాగా బద్దలైంది. గురువారం జరిగిన పురుషుల



జావెలిన్ పతకాలు నెగ్గిన నీరజ్, కిషోర్

జావెలిన్ త్రో ఫైనల్లో నీరజ్ చోప్రా ఈటెను 88.88మీటర్ల దూరం విసిరి పసిడి పతకాన్ని చేజిక్కించుకున్నాడు. మరో త్రోయర్ కిషోర్ కుమార్ జెనా నాలుగో ప్రయత్నంలో ఈటెను 87.54 మీటర్ల దూరం విసిరి రెండో స్థానంలో నిలిచి రజత పతకాన్ని సొంతం చేసుకున్నాడు. ఇక జపాన్‌కు చెందిన జావెలిన్ త్రోయర్ డీన్ రొడెరిక్ జెంకీ తన ఈటెను 82.68 మీటర్ల దూరం విసిరి మూడో స్థానంలో నిలిచి కాంస్యం దక్కించుకున్నాడు.

జ్యోతి సురేఖ–ఓజాస్‌కు స్వర్ణం..

ఆసియా క్రీడల్లో ఆంధ్రప్రదేశ్ ఆర్చర్ వెన్నం జ్యోతి సురేఖ అద్భుత ప్రదర్శనతో అదరగొట్టింది. బుధవారం జరిగిన మిక్స్‌డ్ విభాగంలో ఓజాస్ దియోతలేతో కలిసి బరిలోకి దిగిన జ్యోతి సురేఖ బంగారు పతకాన్ని సాధించింది. ఆర్చరీ మిక్స్‌డ్ ఈవెంట్ ఫైనల్లో ఫేవరెట్ దక్షిణ కొరియా ఆటగాళ్లను ఒక్క పాయింట్ తేడాతో ఓడించారు. ఫైనల్లో సురేఖ–ఓజాస్ 159–158 పాయింట్ల తేడాతో సో చయివాన్–జూ జహివూన్(కొరియా)పై ఉత్కంఠ విజయం సాధించారు.

4×400మీ. రిలే పరుగులోనూ..

పురుషుల 4×400మీటర్ల రిలే పరుగులో భారత పురుషుల జట్టు బంగారు పతకాన్ని సాధించింది. ఫైనల్లో అనాజ్ మహ్మద్, అమోజ్ జాకోబ్, అజ్మల్, రాజేష్ రమేశ్‌లతో కూడిన భారతజట్టు 4×400మీ. పరుగును 3నిమిషాల 01:58సెకన్లలో గమ్యానికి చేరి ప్రథమస్థానంలో నిలిచారు. మహిళల 4×400మీ.రిలేలో కూడా భారత్‌కు రజతం దక్కింది. 35 కిలోమీటర్ల రేసు వాక్ మిక్స్‌డ్ టీమ్‌కు కాంస్యం పతకం లభించింది.

అవినాష్, హర్మిలాన్‌కు రజతాలు..

పురుషుల 5వేల మీటర్ల పరుగు పందెం ఫైనల్లో భారత్ అథ్లెట్ నాయబ్ సుబేదార్ అవినాష్ సాబిల్ రెండో స్థానంలో నిలిచి రజత పతకం సొంతం చేసుకున్నాడు. బహ్రెయిన్‌కు చెందిన బాలివ్ బిర్హాణి యెమతా, అడ్మాసు దవిత్ ఫికాడు వరుసగా బంగారు, కాంస్య పతకాలు నెగ్గారు. ఇక మహిళల 800 మీటర్ల ఫైనల్ ఈవెంట్‌లో కూడా భారత్‌కు రజత పతకం దక్కింది. భారత అథ్లెట్ 25 ఏళ్ల బెయిన్స్ హర్మిలాన్ 2 నిమిషాల 3.75 సెకన్ల టైమింగ్‌తో రేసును పూర్తిచేసి రెండో స్థానంలో నిలవడం ద్వారా రజత పతకాన్ని సొంతం చేసుకుంది. శ్రీలంక అథ్లెట్ దిస్సనాయక ముదియన్ సేలాకు బంగారు పతకం, చైనా అథ్లెట్ వాంగ్ చున్‌యూకు కాంస్య పతకం దక్కాయి.



4×400మీ. పరుగులో స్వర్ణం నెగ్గిన భారతజట్టు

లవ్లీనాకు రజతం

మహిళల 75కిలోల విభాగం ఫైనల్లో లవ్లీనా బోర్గోహైన్ నిరాశపరిచింది. ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్లో 26ఏళ్ల లవ్లీనా చైనా బాక్సర్ లీ–క్యుయాన్ చేతిలో ఓటమిపాలైంది. తొలిరౌండ్ పూర్తయ్యేసరికి 3–2పాయింట్లతో ఆధిక్యతలో ఉన్నా.. ఆ తర్వాత రెండు రౌండ్లలోనూ ఆశించినస్థాయిలో రాణించలేక పోయింది. దీంతో ఫైనల్లో ఓడిన లవ్లీనాకు రజత పతకం దక్కింది.

పతకాల పట్టిక

వ.స.	దేశం	స్వ	ర	కా	మొ
1.	చైనా	165	90	46	301
2.	జపాన్	33	48	50	131
3.	ద.కొరియా	32	44	64	141
4.	ఇండియా	18	31	32	81
6.	ఉజ్బెకిస్తాన్	14	15	21	50
5.	చైనీస్ తైపీ	12	10	19	41
7.	థాయ్‌లాండ్	10	12	21	43
8.	హాంకాంగ్	7	15	25	47
9.	ఉ.కొరియా	7	10	6	23
10.	బహ్రైయిన్	7	1	4	12

స్వ:స్వర్ణాలు; ర:రజితం; కా:కాంస్యం మొ:మొత్తం



ఐసిసి వన్డే ప్రపంచకప్ నేటినుంచే..

అహ్మదాబాద్: ఐసిసి 13వ వన్డే ప్రపంచకప్ సంగ్రామం గురువారం నుంచి ప్రారంభం కానుంది. ఈ ట్రోఫీని చేజిక్కించుకొనేందుకు 10జట్లు ముఖాముఖి తలపడనున్నాయి. లీగ్ దశలో ఒక్కో జట్టు 9 మ్యాచ్‌లు ఆడనుండగా... టాప్–4 జట్ల మధ్య సెమీఫైనల్ జరగనుంది. లీగ్ దశలో మొత్తం 45మ్యాచ్‌లు, నవంబర్ 15, 16న సెమీస్, 19న ఫైనల్ జరగనున్నాయి. ఈ ట్రోఫీని ఆస్ట్రేలియా ఏకంగా ఐదుసార్లు చేజిక్కించుకోగా.. భారత్, వెస్టిండీస్ జట్టు రెండేసిసార్లు, శ్రీలంక, పాకిస్తాన్, ఇంగ్లండ్ జట్లు ఒక్కోసారి ముద్దాడాయి. ఈసారి ప్రధాన టోర్నీకి వెస్టిండీస్ జట్టు అర్హత సాధించలేకపోయింది.

షెడ్యూల్

5(గురు)	ఇంగ్లండ్ × న్యూజిలాండ్	అహ్మదాబాద్	మ.2.00గం॥
6(శుక్ర)	పాకిస్తాన్ × నెదర్లాండ్స్	హైదరాబాద్	మ.2.00గం॥
7(శని)	బంగ్లాదేశ్ × ఆఫ్ఘనిస్తాన్	ధర్మశాల	ఉ.10.30గం॥
	దక్షిణాఫ్రికా × శ్రీలంక	ఢిల్లీ	మ.2.00గం॥
8(ఆది)	**ఇండియా × ఆస్ట్రేలియా**	**చెన్నై**	**మ.2.00గం॥**
9(సోమ)	న్యూజిలాండ్ × నెదర్లాండ్స్	హైదరాబాద్	మ.2.00గం॥
10(మంగళ)	ఇంగ్లండ్ × బంగ్లాదేశ్	ధర్మశాలల	ఉ.10.30గం॥
	పాకిస్తాన్ × శ్రీలంక	హైదరాబాద్	మ.2.00గం॥
11(బుధ)	**ఇండియా × ఆఫ్ఘనిస్తాన్**	**ఢిల్లీ**	**మ.2.00గం॥**
12(గురు)	ఆస్ట్రేలియా × దక్షిణాఫ్రికా	లక్నో	మ.2.00గం॥
13(శుక్ర)	న్యూజిలాండ్ × బంగ్లాదేశ్	చెన్నై	మ.2.00గం॥
14(శని)	**ఇండియా × పాకిస్తాన్**	**అహ్మదాబాద్**	**మ.2.00గం॥**
15(ఆది)	ఇంగ్లండ్ × ఆఫ్ఘనిస్తాన్	ఢిల్లీ	మ.2.00గం॥
16(సోమ)	ఆస్ట్రేలియా × శ్రీలంక	లక్నో	మ.2.00గం॥
17(మంగళ)	దక్షిణాఫ్రికా × నెదర్లాండ్స్	ధర్మశాల	మ.2.00గం॥
18(బుధ)	న్యూజిలాండ్ × ఆఫ్ఘనిస్తాన్	చెన్నై	మ.2.00గం॥
19(గురు)	**ఇండియా × బంగ్లాదేశ్**	**పూణే**	**మ.2.00గం॥**
20(శుక్ర)	ఆస్ట్రేలియా × పాకిస్తాన్	బెంగళూరు	మ.2.00గం॥
21(శని)	నెదర్లాండ్ × శ్రీలంక	లక్నో	ఉ.10.30గం॥
	ఇంగ్లండ్ × దక్షిణాఫ్రికా	ముంబయి	మ.2.00గం॥
22(ఆది)	**ఇండియా × న్యూజిలాండ్**	**ధర్మశాల**	**మ.2.00గం॥**
23(సోమ)	పాకిస్తాన్ × ఆఫ్ఘనిస్తాన్	చెన్నై	మ.2.00గం॥
24(మంగళ)	దక్షిణాఫ్రికా × బంగ్లాదేశ్	ముంబయి	మ.2.00గం॥
25(బుధ)	ఆస్ట్రేలియా × నెదర్లాండ్స్	ఢిల్లీ	మ.2.00గం॥
26(గురు)	ఇంగ్లండ్ × ఆస్ట్రేలియా	బెంగళూరు	మ.2.00గం॥
27(శుక్ర)	పాకిస్తాన్ × దక్షిణాఫ్రికా	చెన్నై	మ.2.00గం॥
28(శని)	ఆస్ట్రేలియా × న్యూజిలాండ్	ధర్మశాల	ఉ.10.30గం॥
	నెదర్లాండ్స్ × బంగ్లాదేశ్	కోల్‌కతా	మ.2.00గం॥
29(ఆది)	**ఇండియా × ఇంగ్లండ్)**	**లక్నో**	**మ.2.00గం॥**
30(సోమ)	ఆఫ్ఘనిస్తాన్ × శ్రీలంక	పూణే	మ.2.00గం॥
31(మంగళ)	పాకిస్తాన్ × బంగ్లాదేశ్	కోల్‌కతా	మ.2.00గం॥
నవంబర్-1(బుధ)	న్యూజిలాండ్ × దక్షిణాఫ్రికా	పూణే	మ.2.00గం॥
2(గురు)	**ఇండియా × శ్రీలంక**	**ముంబయి**	**మ.2.00గం॥**
3(శుక్ర)	నెదర్లాండ్స్ × ఆఫ్ఘనిస్తాన్	లక్నో	మ.2.00గం॥
4(శని)	న్యూజిలాండ్ × పాకిస్తాన్	బెంగళూరు	ఉ.10.30గం॥
	ఇంగ్లండ్ × ఆస్ట్రేలియా	అహ్మదాబాద్	మ.2.00గం॥
5(ఆది)	**ఇండియా × దక్షిణాఫ్రికా**	**కోల్‌కతా**	**మ.2.00గం॥**
6(సోమ)	బెంగళూరు × శ్రీలంక	ఢిల్లీ	మ.2.00గం॥
7(మంగళ)	ఆస్ట్రేలియా × ఆఫ్ఘనిస్తాన్	ముంబయి	మ.2.00గం॥
8(బుధ)	ఇంగ్లండ్ × నెదర్లాండ్స్	పూణే	మ.2.00గం॥
9(గురు)	న్యూజిలాండ్ × శ్రీలంక	బెంగళూరు	మ.2.00గం॥
10(శుక్ర)	దక్షిణాఫ్రికా × ఆఫ్ఘనిస్తాన్	అహ్మదాబాద్	మ.2.00గం॥
11(శని)	ఆస్ట్రేలియా × బంగ్లాదేశ్	పూణే	ఉ.10.30గం॥
	ఇంగ్లండ్ × పాకిస్తాన్	కోల్‌కతా	మ.2.00గం॥
12(ఆది)	**ఇండియా × నెదర్లాండ్స్**	**బెంగళూరు**	**మ.2.00గం॥**
16(బుధ)	సెమీఫైనల్–1 (1 × 4)	ముంబయి	మ.2.00గం॥
17(గురు)	సెమీఫైనల్–2 (2 × 3)	కోల్‌కతా	మ.2.00గం॥
19(ఆది)	ఫైనల్	అహ్మదాబాద్	మ.2.00గం॥

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68